సూర్య నేటి దినపత్రిక
www.suryaa.com
19 వ వసంతంలోకి ...
visit us @ https://www.suryaepaper.com
సోమవారం | 9 మార్చి 2026 | హైదరాబాద్
సంపుటి 19 | సంచిక 139
| పేజీలు 10+8 | వెల: రూ. 6.50
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi



విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...

☞ APPSC,TSPSC పోటీపరీక్షల గైడెన్స్
☞ నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్
☞ కరెంట్ అఫైర్స్
☞ నమూనా ప్రశ్నాపత్రాలు
☞ విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.


అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : ఉత్తరాయణం - శిశిర రుతువు, ఫాల్గుణ మాసం బహుళ పక్షం, షష్ఠి రా.10.13, విశాఖ మ.3.21, వర్జ్యం రా.7.47 నుంచి 9.33 వరకు
రాహుకాలం ఉ.7.30 నుంచి 9.00 వరకు దుర్ముహూర్తం మ. 12.35 నుంచి 1.21 వరకు తిరిగి మ. 2.55 నుంచి 3.41 వరకు



# భారత్ విశ్వ విజేత

## టి 20 ఫైనల్స్‌లో అద్భుత గెలుపు

- 2007, 2024 తర్వాత మూడోసారి టీ20 ప్రపంచకప్ కైవసం చేసుకున్న భారత్
- పొట్టి కప్‌ను డిఫెండ్ చేసుకున్న తొలి జట్టుగా టీమిండియా ప్రపంచ రికార్డు
- ఫైనల్లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో ఘన విజయం
- బ్యాటింగ్‌లో సంజూ శాంసన్ (89), బౌలింగ్‌లో బుమ్రా (4/15) అద్భుత ప్రదర్శన
- అహ్మదాబాద్ వేదికగా 255 పరుగుల భారీ స్కోరు నమోదు చేసిన భారత్






9 లో


సూర్య వెబ్‌సైట్
సూర్య ఈ - పేపర్


## మహిళల ఆర్థిక సాధికారతకు 'స్వయం ఏపీ' బ్రాండ్



2 లో

- మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సీఎం చంద్రబాబు నాయుడు
- డ్వాక్రా ఉత్పత్తులకు జాతీయఅంతర్జాతీయ బ్రాండింగ్ కోసం 'స్వయం ఏపీ' ప్రారంభం
- మహిళల ఆర్థికాభివృద్ధికి రూ.10,102 కోట్ల మెగా చెక్కు అందజేత
- మహిళలకు 33శాతం రాజకీయ రిజర్వేషన్లు రాబోతున్నాయి
- రూ.10,102 కోట్ల రుణాలు అందజేసిన సీఎం చంద్రబాబు

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతి రాజధాని ప్రాంతంలోని రాయపూడి వద్ద నిర్వహించిన రాష్ట్ర స్థాయి వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చిన్నారులు షర్మిల, మహిమలతో పాటు మంత్రులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన ఐదుగురు మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లను ముఖ్యమంత్రి సత్కరించారు

## ఉక్కు మహిళ సోనియాగాంధీ సంకల్పంతోనే తెలంగాణ వచ్చింది

- మహిళల ఆర్థిక శక్తిని పెంచాలనేదే మా లక్ష్యం..
- విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు ఇస్తాం
- దేశంలో ఏ పదవైనా మహిళలకు ఇచ్చిన పార్టీ కాంగ్రెస్
- దేశంలో మహిళల శ్రమకు గుర్తింపు, తగిన ఫలితం లేదు
- మహిళల ఆర్థిక శక్తి పెరిగినప్పుడే ఆ దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుంది
- ప్రజాభవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి

ఉక్కు మహిళ సోనియాగాంధీ సంకల్పంతోనే తెలంగాణ వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మహిళలకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఆదివారం ప్రజాభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తో పాటు పలువురు మంత్రులు హాజరయ్యారు.



3 లో


## అంతా ఇంతే!




వీళ్ల ఓట్ల ద్వారానా సార్ !

## ఇరాన్ దెబ్బకు గల్ఫ్ దేశాలు అతలాకుతలం

సంచలన నిర్ణయం దిశగా అడుగులు..!
అమెరికా స్థావరాలపై ఇరాన్ నిర్విరామంగా దాడులు
ఆయిల్ ఎగుమతులు నిలిచిపోవడం తగ్గుతున్న ఆదాయం



6 లో

ఇరాన్‌-ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న భీకర యుద్ధం రోజురోజుకి తీవ్రతరం అవుతోంది. అమెరికా కూడా ఈ యుద్ధంలో పాల్గొని ఇరాన్‌పై దాడులతో విరుచుకుపడుతుండగా.. పశ్చిమాసియా దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ క్షిపణులతో విజృంభిస్తోంది. ఈ క్రమంలో పశ్చిమాసియా దేశాల్లో తీవ్ర ఉద్రిక్తకర పరిస్థితులు నెలకొనగా.. అంతర్జాతీయంగా అన్ని దేశాలపై దీని ప్రభావం పడుతోంది. ఈ క్రమంలో సౌదీ అరేబియా, కువైట్, ఖతార్, యునైటెట్ అరబ్ ఎమిరేట్స్‌తో పాటు మరికొన్ని గల్ఫ్ దేశాలు సంచలన నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమవుతున్నాయి. అమెరికాతో తమ పెట్టుబడి, కాంట్రాక్టులు, ఒప్పందాలను వెనక్కి తీసుకోవాలని భావిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

## మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

- ఆరోగ్యంగా ఉంటేనే జీవితంలో అన్ని సాధించగలరు
- ఉమెన్ వెల్‌నెస్ సమ్మిట్‌లో మంత్రి సీతక్క




మహిళలు ఆరోగ్యం పై శ్రద్ధ పెట్టాలని, వారు ఆరోగ్యంగా ఉంటేనే జీవితంలో అన్నీ సాధించగలరని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా.ధనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. హైదరాబాద్ మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఒమేగా హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఉమెన్ వెల్నెస్ సమ్మిట్--2026" కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు

## రాష్ట్రపతిని అవమానించడం బాధాకరం

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ తీరుపై సీఎం చంద్రబాబు తీవ్ర విమర్శలు
ద్రౌపది ముర్ముకు ప్రోటోకాల్ ఇవ్వకపోవడాన్ని ఖండించిన ఏపీ సీఎం
రాజ్యాంగ పదవుల పట్ల గౌరవం తప్పనిసరి అని సూచన
ద్రౌపది ముర్ము ఆవేదన ఆందోళన కలిగించింది - డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

భారత రాష్ట్రపతి పదవి అనేది దేశంలోనే అత్యున్నత రాజ్యాంగ పదవి అని, ఆ పదవికి, ఆ వ్యవస్థకు ఎల్లప్పుడూ అత్యున్నత గౌరవం దక్కాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. రాష్ట్రపతి పర్యటన అంటే ఎంతో హుందాగా, పకడ్బందీగా జరగాలని, అది ఆయా రాష్ట్రాల అధికార యంత్రాంగం బాధ్యత అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. రాష్ట్రపతి పర్యటనలో ప్రొటోకాల్, మర్యాదలకు భంగం వాటిల్లడం సరికాదు అని పవన్ కల్యాణ్ హితవు పలికారు.



2 లో




# మహిళల శక్తి సమాజాన్ని మార్చగలదు

● వారికి ఆరోగ్యం, ఆర్థిక స్వావలంబన కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం ● మంత్రులు సీతక్క, దామోదర




తెలంగాణ బ్యూరో(ప్రతినిధి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని కుమరం భీం ఆదివాసి భవన్‌లో ఆదివారం ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు దామోదర రాజనర్సింహ, సీతక్క ముఖ్య అతిథులుగా హాజరై పలు మహిళా సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ డయాగ్నస్టిక్స్ ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు 30 రకాల ఉచిత ఆరోగ్య పరీక్షలను మంత్రులు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మంత్రులు స్వయంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న విధానాన్ని పరిశీలించారు. అలాగే బస్ స్టేషన్లు, రద్దీ ప్రాంతాల్లో శిశువులకు పాలిచ్చేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు. ఈ గదుల నమూనాను మంత్రులు సీతక్క, దామోదర రాజనర్సింహ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం కౌమార బాలికలకు హెచ్‌పీవీ టీకా వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్కడ బాలికలకు ధైర్యం చెప్పి మంత్రులు స్వయంగా టీకాలు వేయించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ఆన్‌లైన్ పోర్టల్ "మహిళా వసతి" ను మంత్రులు సీతక్క, దామోదర రాజనర్సింహ ఆవిష్కరించారు. అలాగే "ఇందిరా మహిళా శక్తి అచీవ్మెంట్స్" పుస్తకాన్ని మంత్రి సీతక్క విడుదల చేశారు. కార్యక్రమంలో వినూత్న వ్యాపారాలతో రాణిస్తున్న 31 మంది మహిళలను మంత్రి సీతక్క ఘనంగా సన్మానించి, వారికి రూ.25,000 చొప్పున ఆర్థిక ప్రోత్సాహక చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, మహిళలే సమాజానికి మూలాధారం అని పేర్కొన్నారు. ఒకప్పుడు మహిళలకు ఓటు హక్కు కూడా లేకపోయినా పోరాటాల ద్వారా తమ హక్కులను సాధించుకున్నారని తెలిపారు. అవకాశం ఇస్తే మహిళలు పంట పొలాల నుంచి అంతరిక్షం వరకు అన్ని రంగాల్లో రాణిస్తారని అన్నారు. పంట పొలాల్లో 80 శాతం పనిని మహిళలే చేస్తారని పేర్కొంటూ, ప్రజా ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. మహిళలు అందరి గురించి ఆలోచిస్తారని కానీ తమ ఆరోగ్యం గురించి పట్టించుకునే సమయం ఉండదని, అందుకే మహిళా సంఘాల సభ్యులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని మంత్రి వివరించారు. ముందుగానే వ్యాధులను గుర్తించి వైద్య సదుపాయాలు అందించడమే లక్ష్యమని చెప్పారు. మహిళా సంఘాల ద్వారా లోన్లు అందించి పేదలకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. హైటెక్ సిటీలో వందల కోట్ల విలువైన మార్కెట్‌ను మహిళా సంఘాలకు అప్పగించినట్లు చెప్పారు. మహిళలు ఇప్పపువ్వు లడ్డూల నుంచి రైస్ మిల్లుల నిర్వహణ, సోలార్ ప్లాంట్ల వరకు వ్యాపారాల్లో ముందుకు వస్తున్నారని తెలిపారు. మేడారం జాతరలో 565 మహిళా సంఘాలకు దుకాణాలు ఏర్పాటు చేసి, రూ.6 కోట్ల పెట్టుబడితో రూ.3.5 కోట్లకు పైగా లాభాలు సాధించారని మంత్రి తెలిపారు. ఒకప్పుడు చిన్నచిన్న వ్యాపారాలు చేసిన మహిళలు ఇప్పుడు సంపద సృష్టికర్తలుగా ఎదుగుతున్నారని అన్నారు.

మహిళలు బాల్య వివాహాలను అడ్డుకోవాలని, అమ్మాయిలకు న్యాయం జరిగేలా మహిళా సంఘాలు ముందుండాలని పిలుపునిచ్చారు. వచ్చే మహిళా దినోత్సవానికి వేలాది మంది మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడం సమాజ అభివృద్ధికి కీలకమని అన్నారు. మహిళా సంఘాలపై బ్యాంకులకు ఎంతో విశ్వాసముందని, వారు తీసుకున్న రుణాలను 98 శాతం తిరిగి చెల్లిస్తున్నారని తెలిపారు. మహిళల ఆరోగ్యం బాగుండాలని ప్రభుత్వం భావిస్తోందని, అందుకే స్వయం సహాయక సంఘాల సభ్యులందరికీ 30 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

వచ్చే మూడు నెలల్లో ఈ పరీక్షలను పూర్తిచేసి, మహిళలకు డిజిటల్ ఆరోగ్య కార్డులను అందజేస్తామని వెల్లడించారు. అమ్మాయిల బంగారు భవిష్యత్తు కోసం హెచ్‌పీవీ టీకాను అందిస్తున్నామని, ప్రతి గ్రామంలో మహిళా సంఘాలు ఈ టీకా గురించి అవగాహన కల్పించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, క్రిస్టినా చోంగ్తు, అనితా రామచంద్రన్, దివ్య దేవరాజన్, శృతి ఓజా, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నరేంద్ర కుమార్, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు శుభవార్త

● యాంత్రీకరణ పథకంలో సబ్సిడీ సొమ్ము ఇక నేరుగా రైతుల ఖాతాల్లోకే..

● అధికారులను ఆదేశించిన మంత్రి తుమ్మల

తెలంగాణ బ్యూరో(ప్రతినిధి: తెలంగాణలో రాబోయే ఖరీఫ్ సీజన్ సన్నద్ధతపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక సమీక్ష నిర్వహించారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పలు రకాలు చర్యలు తీసుకుంటోంది. దీనిలో గతంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రైతులు కొనుగోలు చేసే ట్రాక్టర్లు, ఇతర యంత్రాలపై వచ్చే 40 శాతం సబ్సిడీ నేరుగా కంపెనీలకు వెళ్లేది. దీనివల్ల నిధుల వినియోగంలో పారదర్శకత లోపిస్తోందని భావించిన ప్రభుత్వం, ఇకపై ఆ సబ్సిడీ మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకే (డిబిటి) జమ చేయాలని నిర్ణయించింది. దీనివల్ల రైతులకు తమకు నచ్చిన నాణ్యమైన పనిముట్లను ఎంచుకునే స్వేచ్ఛ కలగడమే కాకుండా... దళారుల ప్రమేయం తగ్గుతుంది. రాబోయే వానాకాలం (ఖరీఫ్) సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 60.60 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. సాగు విస్తీర్ణం పెరగనున్న నేపథ్యంలో.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

విత్తనాలు వేసే సమయానికి ఎరువుల కొరత రాకుండా, ఇప్పటి నుంచే బఫర్ స్టాక్‌ను జిల్లాల వారీగా సిద్ధం చేయాలని సూచించారు. నేల సారాన్ని పెంచేందుకు రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలను ఏప్రిల్ నెలాఖరులోపు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ ఆధునీకరణలో భాగంగా ప్రతి గ్రామంలోని రైతు వేదికల ద్వారా రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు సిద్ధం అవుతున్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు నేరుగా పొలాల్లోకి వెళ్లి రైతులకు సలహాలు ఇచ్చేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే.. డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా ఏ పంట ఎంత విస్తీర్ణంలో ఉందో ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించి, దానికి అనుగుణంగా మార్కెటింగ్ సదుపాయాలను కల్పించనున్నారు.

ఈ వినూత్న మార్పుల ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే కాకుండా.. ప్రభుత్వ రాయితీలు అర్హులైన ప్రతి రైతుకూ సక్రమంగా అందేలా మంత్రి తుమ్మల పటిష్టమైన యంత్రాంగాన్ని సిద్ధం చేస్తున్నారు.

# జనగణనకై ఢిల్లీలో ఉద్యమం

● జాతి జనగణనలో బీసీ కుల గణన చేపట్టాలనీ ఈనెల 23న బీసీల చలో ఢిల్లీ

● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి; ఏప్రిల్ ఒకటో తేదీ నుండి దేశవ్యాప్తంగా మొదలుకానున్న జాతి జనగణన లో బీసీ కులగనన పట్టాలనీ, తెలంగాణ రాష్ట్రంలో చేసిన బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని పార్లమెంట్ లో ఆమోదించాలనే ప్రధాన డిమాండ్ తో మార్చ్ (ఈనెల) 23న బీసీల చలో ఢిల్లీ చేపట్టినట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీల చలో ఢిల్లీ సందర్భంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఒక రోజు భారీ ధర్నా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. కొన్ని దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా సమగ్ర కులగలను చేపట్టాలని బీసీలు ఉద్యమాలు చేపడితే కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి ఏప్రిల్ 30,2025న జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో జాతీ జన గణనలో సమగ్ర కులగన చేపడతామని ప్రకటించిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం తాము ప్రకటించినట్లు గాని వచ్చే నెల ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి దేశవ్యాప్తంగా జాతీయ చేపడుతుందని మొదటి దపాలో కుటుంబ ఇంటి లెక్కలు తీస్తుందని, ఇందులో 33 ప్రశ్నలను రూపొందించి అందులో ఎస్సీ ఎస్టీ కుటుంబాలు ఎన్ని అడిగిన కేంద్ర ప్రభుత్వం బీసీ కుటుంబాల సంఖ్యను విస్మరించడం చాలా బాధాకరమన్నారు ఇండ్ల లెక్కింపులో కూడా బీసీ ఇండ్లను లెక్కించాలని ఆయన డిమాండ్ చేశారు.

అలాగే బీసీలకు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లు పెంచదు తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో చేసిన చట్టం నీ కేంద్ర ప్రభుత్వానికి పంపించి సంవత్సరాల కాలం గడిచినప్పటికీ ఇంతవరకు బీసీ రిజర్వేషన్ల బిల్లు పార్లమెంటులో ఆమోదించలేదని తక్షణమే ఈ బడ్జెట్ పార్లమెంట్ సమస్యలలో బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ తరపున పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రైవేటు బిల్లును ప్రవేశపెట్టి కేంద్ర ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంటింటి లెక్కింపులో బీసీ కుటుంబాల లెక్కింపు బీసీ రిజర్వేషన్ల పెంపు పోయి జరుగుతున్న ఈ భారీ ధర్నాకు దేశంలోని 29 రాష్ట్రాల నుండి బీసీలంతా పెద్ద ఎత్తున కదిలి వచ్చి విజయవంతం చేయాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు.

# యుద్ధం మూలంగా భారత్‌కు నష్టం ఏమి జరగదు

● ప్రపంచ వ్యాప్తంగా భారత్‌కు తగిన గుర్తింపు ఉంది ● రాష్ట్రంలో బీజేపీ ఏ పార్టీతో పొత్తు పెట్టుకోదు

● భారత్‌లో ముడి చరుకుల నిల్వ ఉంది ● కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ప్రజలను మోసం చేశాయి

● రాబోయే రోజుల్లో ప్రజలు రాష్ట్రంలో బీజేపీని ఆశీర్వదిస్తారు ● బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచందర్ రావు



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి; బీజేపీ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోదు, తెలంగాణలో ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారు. గతంలో బీఆర్ఎస్‌కు ప్రజలు అవకాశం ఇచ్చారు. ఇప్పుడు కాంగ్రెస్‌కు ఇచ్చారు. ఈ రెండు పార్టీలు ప్రజలను మోసం చేశాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచందర్ రావు అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ నాయకులు బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు సమక్షంలో భారతీయ జనతా పార్టీలోకి పెద్ద ఎత్తున చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి బీజేపీ రాష్ట్ర రథసారథి రాంచందర్ రావు పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్‌ను వీడి పెద్ద ఎత్తున బీజేపీలో చేరిన వారందరికీ హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు. బీజేపీలో చేరిన వారందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోదు. తెలంగాణలో ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారు. గతంలో బీఆర్ఎస్‌కు ప్రజలు అవకాశం ఇచ్చారు. ఇప్పుడు కాంగ్రెస్‌కు ఇచ్చారు. ఈ రెండు పార్టీలు ప్రజలను మోసం చేశాయి. అందుకే ఈసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని నేను ప్రజలను కోరుతున్నాను. ప్రస్తుతం ఇరాన్--ఇజ్రాయిల్ యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజల్లో అనవసరమైన భయాందోళనలు సృష్టించే ప్రయత్నం చేస్తోందన్నారు. ఇరాన్, యూఎస్, ఇజ్రాయిల్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఉన్నప్పటికీ భారతదేశంలో ఎక్కడా క్రూడ్ ఆయిల్ కొరత లేదన్నారు. ఒకే దేశంపై ఆధారపడకుండా వ్యూహాత్మకంగా అనేక దేశాల నుంచి భారత్ ఆయిల్ సరఫరా పొందుతోందన్నారు. యూపీఏ హయాంలో భారత్ కేవలం 16 దేశాల నుంచి మాత్రమే ఆయిల్ దిగుమతి చేసుకునేది. కానీ ప్రధాని నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో ఆ సంఖ్యను 40 దేశాలకు పెంచాము. ఇది పూర్తిగా వ్యూహాత్మక నిర్ణయం అని అన్నారు. 2025 నాటికి భారత్ తన ఆయిల్ సరఫరా దేశాలను 27 దేశాల నుంచి 40 దేశాలకు విస్తరించిందని అన్నారు. మహిళలకు గ్యాస్ సిలిండర్ ధరలపై ఎటువంటి ప్రభావం ఉండదు. దేశంలో తగినంత బఫర్ స్టాక్ ఉంది. ఇంపోర్ట్ కవరేజ్ కూడా పెరిగిందన్నారు. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజల్లో భయాన్ని సృష్టిస్తోందన్నారు. డిసెంబర్ 2025లో ముడి చమురు దిగుమతులు గత ఏడాదితో పోలిస్తే 6.9 శాతం పెరిగి 20.20 మిలియన్ టన్నులకు చేరాయి. ఇది ఎన్డీఏ ప్రభుత్వ సరఫరా వ్యవస్థ బలంగా ఉందని చూపిస్తోందన్నారు. 2014కు ముందు భారత్ కేవలం సుమారు 16 దేశాల నుంచే ముడి చమురు దిగుమతి చేసుకునేది. అయితే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 2014 తర్వాత భారత్ తన చమురు దిగుమతులను విస్తరించి ఇప్పుడు సుమారు 47 దేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. ఎలాంటి అంతర్జాతీయ యుద్ధం జరిగినా భారతదేశ చమురు నిల్వలు, సరఫరా లేదా దిగుమతులపై ప్రభావం ఉండదు. దేశంలో ఎలాంటి చమురు కొరత రాదన్నారు.. బ్రెంట్ క్రూడ్ ధరలు 9 శాతం కంటే ఎక్కువ పెరిగినా కూడా దేశంలో ఇంధన ధరల సంక్షోభం ఏర్పడలేదు. ఇది ఎన్డీఏ ప్రభుత్వ వ్యూహం --- స్ట్రాటజిక్ నిల్వలు, విభిన్న సరఫరాదారులు, ముందస్తు ఒప్పందాల ఫలితం అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను గ్యాస్ సిలిండర్లు, ఇంధనం నిల్వ చేసుకోవాలని భయపెడుతూ తప్పుడు ప్రచారం చేస్తోంది. దేశంలో ఎక్కడా కొరత లేదన్నారు. చైనాతో రహస్య ఒప్పందాలు చేసినది కాంగ్రెస్ పార్టీనే. అటువంటి చర్యలు వారి ఉద్దేశాలపై అనుమానాలు కలిగిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ దేశానికి అనుకూలంగా మాట్లాడకపోయినా, కనీసం ప్రజల్లో భయాందోళనలు కలిగించే తప్పుడు ప్రచారం చేయకూడదన్నారు. దేశ రాష్ట్రపతిని గౌరవించకుండా, ప్రోటోకాల్ పాటించకుండా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోందన్నారు. 2012లో ఇరాన్ భారత్‌కు ఆయిల్ సరఫరా నిలిపివేసిందన్నారు. ఈ పరిస్థితికి పూర్తి బాధ్యత యూపీఏ ప్రభుత్వానిదే. కానీ ఇప్పుడు అదే కాంగ్రెస్ నాయకులు ఇరాన్‌కు అనుకూలంగా మాట్లాడుతున్నట్లు నటిస్తూ, భారతదేశంలో చమురు కొరత ఉందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం భారత్ వద్ద తగినంత క్రూడ్ ఆయిల్ మరియు ఫ్యూయల్ నిల్వలు ఉన్నాయి. భారత్ రష్యా, ఇజ్రాయిల్, యూఎస్ వంటి అనేక దేశాలతో మైత్రి సంబంధాలను కొనసాగిస్తోంది. కానీ యూపీఏ హయాంలో సరైన వ్యూహం లేకపోవడం వల్ల అనేక అంతర్జాతీయ సంబంధాలు దెబ్బతిన్నాయన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం మానుకోవాలి. అబద్ధాలు చెప్పి దేశ ప్రజలను భయాందోళనలకు గురి చేయకూడదన్నారు. అంతర్జాతీయంగా పెద్ద సంఘర్షణ పరిస్థితి ఉన్నప్పటికీ భారతదేశంలో ఎలాంటి భయం లేకుండా ఇంధన ధరలు స్థిరంగా ఉండటం ప్రధాని నరేంద్ర మోదీ గారి నాయకత్వానికి నిదర్శనం అని అన్నారు. దేశం ఈరోజు సురక్షితంగా ఉంది. చమురు, డీజిల్, పెట్రోల్ లేదా గ్యాస్ కొరత ఎక్కడా లేదన్నారు. ఈ అంశంపై రాహుల్ గాంధీ మరియు కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రకటనలు చేసి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ మల్టీ అలైన్‌మెంట్ డిప్లొమసీతో ప్రతి దేశంతో సంబంధాలు కొనసాగిస్తూ, సంక్షోభ సమయాల్లో కూడా దేశ ఇంధన భద్రతను కాపాడే బలమైన వ్యవస్థను నిర్మించిందన్నారు. ఇది దూరదృష్టి ఉన్న నాయకత్వానికి నిదర్శనం. ఇది బలమైన దౌత్యం. ఇది కొత్త భారత్. ఇవన్నీ వికసిత్ భారత్ వైపు వేగవంతమైన అడుగులు అని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఖజానా ఖాళీ అయిందంటూ ప్రతిరోజూ కథలు చెబుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం, అదే సమయంలో తెలంగాణ ప్రజల ధనంతో ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారం చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయం అని అన్నారు. కేరళలో జరుగుతున్న ఎన్నికల ప్రచారం కోసం ఫుల్‌పేజ్ కలర్ యాడ్స్ ఇస్తూ కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుబారా చేస్తున్నారన్నారు. తెలంగాణలో ఆరు గ్యారెంటీల అమలులో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, కేరళలో మాత్రం ఆర్భాట ప్రచారం చేయడం తెలంగాణ ప్రజలను అవమానించే చర్య అని ఆయన అన్నారు. అందుకే మహిళలు, యువత పెద్ద ఎత్తున బీజేపీలో చేరాలని ఆయన కోరారు.

# కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళలపై నేరాలు పెరిగాయి

● మహిళా దినోత్సవం రోజే కాదు.. రోజూ మహిళలను గౌరవించాలి ● తండ్రి, అన్న ఇలా అందరూ తక్కువ చేసేవారే

● జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళా దినోత్సవం రోజే కాదు.. రోజూ మహిళలను గౌరవించాలని అన్నారు. పెద్ద కులం, చిన్న కులం అనేవి ఏమీ లేవు.. మహిళలంతా సమానమే అని చెప్పారు. మహిళ ఏ ఇంట్లో పుట్టినా సరే.. వివక్ష కామన్‌గా కొనసాగుతూ వచ్చింది. తండ్రి, అన్న, భర్త ఇలా అందరూ మహిళలను తక్కువ చేసేవారే. మహిళలు లేకపోతే సృష్టే లేదు అని విషయాన్ని అందరు మర్చిపోయారు అని కవిత గుర్తుచేశారు. అంతెందుకు.. మహిళలు లేకుండా అసలు తెలంగాణ ఉద్యమమే లేదని కీలక వ్యాఖ్యలు చేశారు. సామాజిక తెలంగాణ సాధనలో మహిళల పాత్రే కీలకమని చెప్పారు. వయసుతో సంబంధం లేకుండా మహిళలు రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. మహిళలకు 33 శాతం సీట్ల రిజర్వేషన్ సాధనతో జాగృతి చరిత్ర సృష్టించిందని కొనియాడారు. అంతేకాదు.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలపై నేరాలు పెరిగాయని కవిత విమర్శించారు. మరోవైపు టీ20 ప్రపంచకప్ ప్రారంభం కానుండగా.. భారతజట్టు ఫైనల్‌లో గెలవాలంటూ కల్వకుంట్ల కవిత ఆకాక్షించారు. టీమిండియాకు ఆల్ ద బెస్ట్ చెబుతూ వీడియో రిలీజ్ చేశారు. టూ టీమ్స్, వన్ హార్ట్‌బీట్ అంటే.. ఆ రెండూ జట్లు, భారత్, న్యూజిలాండ్ అని అనుకుంటే పొరబాటే. ప్రపంచకప్ ఫైనల్ ఆడుతున్న భారత క్రికెట్ జట్టుతో పాటుగా.. భారత మహిళల హాకీ జట్టుకు కూడా కవిత ఆల్ ద బెస్ట్ చెప్పారు. భారత క్రికెటర్లు తమ ప్రపంచకప్ టైటిల్ నిలబెట్టుకోవాలని.. అలాగే ప్రపంచకప్ క్వాలిఫయర్స్ ఆడుతున్న భారత మహిళల హాకీ జట్టు కూడా విజయం సాధించాలని కవిత ఆకాంక్షించారు.

## పండిట్, పీఈటీ పోస్ట్‌లను వెంటనే ఉన్నతీకరించాలి

● కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్లను రెగ్యులరైజ్ చేయాలి

● 10న టీపీటీఎఫ్ నిరసన ప్రదర్శన

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో నిర్వహింపబడుతున్న పాఠశాలలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల, పాఠశాలల మరియు విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 10న హైదరాబాద్ లోని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నామని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి లు తెలిపారు. ఉపాధ్యాయులు అధికసంఖ్యలో కదిలిరావాలని పిలుపునిచ్చారు. మూడు దశల పోరాట కార్యక్రమాలను పొందుపరుస్తూ, ప్రత్యక్ష చర్య నోటీసును ఇవ్వడం జరిగింది. మొదటి దశలో రాష్ట్రవ్యాప్తంగా 2025 నవంబర్ 12, 13 తేదీలలో గిరిజన సంక్షేమ పాఠశాలల ముందు ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శనలు నిర్వహించడం జరిగింది. రెండవ దశ ది.26.02.2026న జిల్లా కలెక్టర్/ఐటీడీఏ ప్రాజెక్టు అధికారుల కార్యాలయాల ముందు నిరసన తెలిపి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించాము. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పండిట్, పీఈటీ పోస్టులను స్కూల్ అసిస్టెంట్ లుగా ఉన్నతీకరించి, వెంటనే పదోన్నతులు కల్పించాలి. కాంట్రాక్టు రెసిడెంట్ టీచర్లను రెగ్యులరైజ్ చేసి, టైం స్కేళ్లను వర్తింపజేసి, మొదటి తేదీన వేతనాలు చెల్లించాలి. బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలి. కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలను 10వ తరగతి వరకు అప్ గ్రేడ్ చేయాలి. అన్ని సబ్ జెక్టుల టీచర్లను నియమించాలి. ప్యాటర్న్ ప్రకారం ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేయాలి. ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి. అన్ని జిల్లాల్లో ఒకే విధమైన పరిపాలన, పర్యవేక్షణ, అకడమిక్ విధానం అమలు చేయాలి. పాఠశాలల్లో సర్వీస్ పర్సన్లను నియమించాలి. వసతి గృహాలకు హాస్టల్ వెల్ఫేర్ అధికారుల పోస్టులు మంజూరు చేయాలి. గిరిజన సంక్షేమ శాఖ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు పీఎస్ హెచ్ ఎం పోస్టులు మంజూరు చేయాలని కోరుతూ ఈ నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నామని తెలిపారు.

## సింగరేణిని రాజకీయ కమీషన్లకు అడ్డాగా మార్చితే చూస్తూ ఊరుకోం

● బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు


● సింగరేణి ఓబీ టెండర్లలో కాంగ్రెస్ సిండికేట్ గుట్టు రట్టయిందని విమర్శ ● శ్రీరాంపూర్ టెండర్ పరిణామాలను ఉదహరించిన హరీష్ రావు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : సింగరేణి ఓవర్ బర్డెన్ (ఓబి) టెండర్లలో రేవంత్ రెడ్డి సర్కార్ సాగిస్తున్న దోపిడీని ఆధారాలతో సహా బట్టబయలు చేసి.. 'సైట్ విజిట్ సర్టిఫికెట్' ముసుగులో కాంట్రాక్టర్ల రింగ్ ఏర్పాటు చేసి, తెలంగాణ ప్రజల ఆస్తి సింగరేణిని ఎలా లూటీ చేస్తున్నారో బీఆర్ఎస్ పోరాటంతో కాంగ్రెస్ గుట్టు రట్టయిందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. బీఆర్ఎస్ అడుగడుగునా నిలదీయడంతోనే శ్రీరాంపూర్ ఎస్ఆర్‌పీ ఓసీ -2 టెండర్ ఫైనాన్షియల్ బిడ్ల అసలు బాగోతం బయటపడిందని టెక్నికల్ బిడ్ అయిన తర్వాత కూడా ఫైనాన్షియల్ బిడ్ ను దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏడుసార్లు ఎందుకు వాయిదా వేశారని నిలదీసి సింగరేణి కార్మిక లోకాన్ని బీఆర్ఎస్ పార్టీ చైతన్యపరిచిందన్నారు. ఆ నిరంతర ఒత్తిడికి తలొగ్గి, ఎట్టకేలకు సిండికేట్ ప్రమేయం లేకుండా పారదర్శకంగా బిడ్లు తెరిచేసరికి.. ఈ టెండర్ ఏకంగా మైనస్ 12 శాతం (-12%) కు క్లోజ్ అయిందన్నారు. ఈ మేరకు హరీశ్ రావు ఆదివారం ఓ ప్రటన విడుదల చేశారు. కొత్త నిబంధనలు తెచ్చాక సింగరేణిలో నమోదైన తొలి నెగెటివ్ బిడ్ ఇదేనని ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి సిండికేట్?ను బద్దలు కొడితే అసలైన పోటీ ఎలా ఉంటుందో, ధరలు ఎలా దిగి వస్తాయో ఈ ఒక్క టెండర్ నిరూపించిందన్నారు. గతంలో సింగరేణిలో ఓబి టెండర్లు పారదర్శకంగా ఆన్‌లైన్‌లో జరిగేవని అప్పట్లో -7% నుంచి -20% తక్కువకే పనులు పూర్తయ్యి, సంస్థకు వందలాది కోట్లు ఆదా అయ్యేవని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బావమరిది సృజన్ రెడ్డి కనుసన్నల్లో ఈ దోపిడీకి స్కెచ్ గీశారని ఆరోపించారు. ఆన్‌లైన్ టెండర్ల పారదర్శకతను దెబ్బతీయడానికే కావాలని 'సైట్ విజిట్ సర్టిఫికెట్' నిబంధన తెచ్చారని హరీశ్ రావు తెలిపారు. టెండర్ వేయకముందే అధికారుల దగ్గర ఈ సర్టిఫికెట్ తీసుకోవాలనే నిబంధన పెట్టడం వెనుక ఉన్న కుట్ర ఏంటంటే.. ఎవరెవరు టెండర్ వేస్తున్నారో అధికార పార్టీ నేతలకు ముందుగానే తెలిసిపోతుందన్నారు. దాంతో వాళ్లని బెదిరించి పోటీ లేకుండా చేసి తమకు కావాల్సిన వారికే టెండర్లు దక్కేలా సిండికేట్ ఏర్పాటు చేయడానికి ఇది బ్రహ్మాస్త్రంగా మారిందన్నారు. కాంగ్రెస్ సిండికేట్ పుణ్యమా అని తక్కువకు పోవాల్సిన టెండర్లన్నీ ०7% నుంచి ०10% ఎక్కువకు ఖరారవుతూ సింగరేణి ఖజానాకు భారీ గండి కొట్టాయని ఈ --12% బిడ్ చూశాక.. గతంలో ०10% అదనంగా కోట్ చేస్తూ దక్కించుకున్న టెండర్లలో కమిషన్ల కోసం ఎంత దారుణమైన కుమ్మక్కు జరిగిందో స్పష్టమవుతోందని హరీశ్ రావు తెలిపారు. ఈ సిండికేట్ దందా కేవలం టెండర్లకే పరిమితం కాలేదు, రాష్ట్ర విద్యుత్ వ్యవస్థను, సామాన్యుడి జేబును కూడా గుల్ల చేస్తోందన్నారు. ఈ కమీషన్ల కక్కుర్తి వల్ల ఓబీ పనుల్లో తీవ్ర జాప్యం జరిగి సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి పడిపోయిందన్నారు. బొగ్గు లేక జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి తగ్గించి, అనివార్యంగా బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కరెంటు కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు.

బొగ్గు ఉత్పత్తి తగ్గి సింగరేణికి ఆదాయం గండి పడుతోందని ఎక్కువ రేటుకు కరెంటు కొని జెన్‌కోకు నష్టం కలిగించి అంతిమంగా ఈ భారం అంతా విద్యుత్ చార్జీల రూపంలో సామాన్య ప్రజల నెత్తిన పడుతోందని హరీశ్ రావు అన్నారు. మరోవైపు బొగ్గు ఉత్పత్తి తగ్గి, సంస్థ లాభాలు పడిపోతుండటంతో.. బొగ్గు గని కార్మికులు ప్రాణాలు పణంగా పెట్టి పనిచేస్తూ ప్రతి ఏటా ఎంతో ఆశగా ఎదురుచూసే దసరా బోనస్ లాభాల వాటా శాతానికి కోత పడే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకుల వాటాలు, ముఖ్యమంత్రి బంధువుల కమిషన్ల కోసం కాకుండా ప్రజల ప్రయోజనాల కోసం, తెలంగాణ సంపదను కాపాడే విధంగా పనిచేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## పునరుద్ధరించిన శాసనమండలి భవనాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : అసెంబ్లీ ప్రాంగణంలో పునరుద్ధరించిన శాసనమండలి భవనాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం నాడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్, శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, అజరుద్దీన్, దామోదర్ రాజ నర్సింహా, జూపల్లి కృష్ణా రావు, వివేక్ వెంకటస్వామి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు, ప్రభుత్వ విప్ లు,ఎంఎల్సీలు,ఎంఎల్ ఏ లు,అసెంబ్లీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కాగా, ఈ సందర్భంగా శాసనమండలి లోని తన ఛాంబర్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూజ చేశారు.




### రియల్ రంగం అభివృద్ధికి

# ప్రభుత్వం పూర్తి సహకారం

**ప్రాపర్టీ పల్స్ న్యూస్ పేపర్ ఆవిష్కరణలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ప్రభుత్వం తీసుకుంటున్న విప్లవాత్మకమైన నిర్ణయాల వల్ల రియల్ రంగం గణనీయంగా అభివృద్ధి చెందుతోందని రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అదివారం సచివాలయంలో ఆయన ప్రాపర్టీ పల్స్ అనే ఆంగ్ల రియల్ ఎస్టేట్ వీక్లీ న్యూస్ పేపర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లను ఆకర్షించడంలో హైదరాబాద్ మిగతా నగరాల కంటే ముందంజలో ఉందన్నారు. తెలంగాణ నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వ సరికొత్త నిర్ణయాల్ని తీసుకుంటుందని తెలిపారు. ఫ్యూచర్ సిటీతో హైదరాబాద్ కు అంతర్జాతీయ ఖ్యాతినార్జించిందని.. అనేక దేశ, విదేశీ సంస్థలు హైదరాబాద్‌లో పెట్టుబడుల్ని పెట్టేందుకు ముందుకొస్తున్నాయని అన్నారు. నగరానికే తలమానికమైన మెట్రో సెకండ్ ఫేజ్, రతన్ టాటా గ్రీన్ ఫీల్డ్ రోడ్డు వంటివి అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. దేశంలోనే మొట్టమొదటి రియల్ ఎస్టేట్ వీక్లీ పేపర్ హైదరాబాద్ నుంచి ఆరంభం కావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రాపర్టీ పల్స్ ఎడిటర్ కింగ్ జాన్సన్ కొయ్యడకి శుభాకాంక్షలు తెలిపారు. ఎడిటర్ కార్యక్రమంలో పట్లోళ్ల కిరణ్, గొట్టేటి రాజేష్, ప్రెస్ క్లబ్ జాయింట్ సెక్రటరీ చిలుకూరి హరిప్రసాద్, ఈసీ సభ్యులు అమిత్ బట్టు, వనం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాజెక్టుల భూ సేకరణ కోసం రూ.5 వేల కోట్లు

- ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టులపై సమీక్ష




తెలంగాణ బ్యూరో ప్రతినిధి : రాష్ట్రవ్యాప్తంగా నిర్మించ తలపెట్టిన వివిధ ప్రాజెక్టుల భూసేకరణకు జూన్2 లోపు నిధులు కేటాయిస్తామని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ భూసేకరణ కోసం రూ. 5వేల కోట్లు ఖర్చు చేస్తామన్నారు. ఆదివారం హైదరాబాద్ జలసౌధలో ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. మంత్రులు జూపల్లి, శ్రీహరి, ఎంపీలు మల్లు రవి, డీకే అరుణ, సంబంధిత అధికారులు, ఇంజినీర్లు, కలెక్టర్లు హాజరైన ఈ సమీక్షలో పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్, జూరాల, నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టులపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి.. కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయిల్ సాగర్ ను కేసీఆర్ పదేళ్లు పట్టించుకోలేదని విమర్శించారు.

**సోర్సును మార్చి రాష్ట్రానికి తీవ్ర అన్యాయం**

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు నీటి సోర్సును శ్రీశైలనానికి మార్చివేశారని, నీటి సోర్సును మార్చి రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారన్నారు. కాళేశ్వరంలో చేసిన పొరపాటే.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో చేశారని విమర్శించారు. ఎంత ఖర్చయినా సరే ఉమ్మడి మహబూబ్?నగర్ జిల్లా ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్నారు. వచ్చే రెండేళ్లలో ప్రాజెక్టులపై రూ.22 వేల కోట్లు ఖర్చు చేస్తామని డిండి ఎత్తిపోతల, ఎస్ఎల్?బీసీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయిల్ సాగర్ పూర్తి చేస్తామన్నారు. కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు.

# బమ్మక్ ఉద్దౌలా చెరువును ప్రారంభించిన

**సీఎం రేవంత్**



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: బతుకమ్మ కుంటను పునరుద్ధరించి అందరి ప్రశంసలు పొందిన తెలంగాణ ప్రభుత్వం మరో చెరువుకు జీవం పోసింది. ఓల్డ్ సిటీలోని బమ్మక్ ఉద్దౌలా చెరువును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ చెరువు ఓల్డ్ సిటీకి తలమానికంగా ఉంది. అలానే 450 ఏళ్ల చరిత్రను కలిగి ఉంది. ఈ చెరువును రూ.9 కోట్లతో పూర్తి చేశారు. 30 ఎకరాల విస్తీర్ణంలో బమ్మక్ ఉద్దౌలా చెరువును తెలంగాణ అభివృద్ధి చేసింది. చెరువు చుట్టూ ఇన్‌లెట్లు, ఔట్‌లెట్లు సహా కీలక నిర్మాణాలు చెపట్టింది. ఈ చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్‌లు, లైటింగ్, పిల్లల ప్లే ఏరియాలు, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. అలానే ఈ ప్రాంతంలో భద్రత కోసం ఏర్పాటు చేస్తున్న సీసీటీవీ కెమెరాల ద్వారా హైడ్రా ప్రధాన కార్యాలయం నుంచి నిరంతరం మానిటరింగ్ జరుగనుంది. 1770లో నిజాం ప్రధాని నవాబ్ రుక్న్ ఉద్దౌలా ఈ చెరువును నిర్మించారు. అప్పట్లో ఈ చెరువు 100 ఎకరాలకు పైగా విస్తరించి ఉండేది. ఈ చెరువులోని నీటిని ఒకప్పుడు సుగంధ ద్రవ్యాల తయారీకి ఉపయోగించేవారని స్థానికులు చెబుతున్నారు. గడిచిన 50 ఏళ్లలో ఆక్రమణలతో ఈ చెరువు రూపు రేఖలు కోల్పోయింది. ఈ చెరువు కబ్జాకు గురై.. భారీగా నిర్మాణాలు.. కొత్తగా కాలనీలు వెలిశాయి. రెండేళ్ల క్రితం హైడ్రా ఈ చెరువు ప్రాంతంలో ఆక్రమణలు తొలగించి సుందరీకరణ పనులు ప్రారంభించింది.

# ఉక్కు మహిళ సోనియాగాంధీ సంకల్పంతోనే తెలంగాణ వచ్చింది

- మహిళల ఆర్థిక శక్తిని పెంచాలనేదే మా లక్ష్యం.. ● విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు ఇస్తాం ● దేశంలో ఏ పదవైనా మహిళలకు ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ ● దేశంలో మహిళల శ్రమకు గుర్తింపు, తగిన ఫలితం లేదు ● మహిళల ఆర్థిక శక్తి పెరిగినప్పుడే ఆ దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుంది ● ప్రజాభవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ఉక్కు మహిళ సోనియాగాంధీ సంకల్పంతోనే తెలంగాణ వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మహిళలకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఆదివారం ప్రజాభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తో పాటు పలువురు మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలకు ఎప్పుడూ గుర్తింపు ఇవ్వాలన్నదే తమ లక్ష్యమని చెప్పుకొచ్చారు. దేశంలో ఏ పదవైనా మహిళలకు ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ అని తెలిపారు. కీలకమైన శాఖలను మహిళా అధికారులు సమర్థంగా నడిపిస్తున్నారని ప్రశంసించారు.వెయ్యి బస్సులకు మహిళలు యజమానులుగా ఉన్నారని ప్రస్తావించారు.తెలంగాణ మహిళలు తయారు చేస్తున్న వస్తువులను అమెజాన్‌లో పెట్టి ప్రపంచానికి అందిస్తున్నామని చెప్పుకొచ్చారు.మహిళా జర్నలిస్టులకు ప్రత్యేక గుర్తింపు ఇస్తున్నామని స్పష్టం చేశారు. ఇటీవల మావోయిస్టుల లొంగుబాటులోనూ మహిళా అధికారులే కీలకమని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. తమ ప్రభుత్వం ఇచ్చే అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించామని, నిర్వహణ బాధ్యతలూ అప్పగించామని వ్యాఖ్యానించారు. దేశంలో మహిళల శ్రమకు గుర్తింపు, తగిన ఫలితం లేదన్నారు. మహిళ ఆర్థిక శక్తి పెరిగినప్పుడే ఆ దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని వివరించారు. దేశంలో కుల, జెండర్ వివక్ష ఉందని తెలిపారు. అమెరికాలో కూడా వివక్ష ఉంది.. కానీ అక్కడ కష్టానికి గుర్తింపు ఉంటుందన్నారు. ఇక్కడ మాత్రం కష్టపడేవారికి గుర్తింపు ఉండదని చెప్పుకొచ్చారు. కష్టపడేవారికి గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఎంతో ఉందని తెలిపారు. మహిళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత అన్ని సంస్థలపైనా ఉంటుందన్నారు. అదే ఐడియాలజీతో యుద్ధం చేస్తే మంచి ఫలితాలు వస్తాయని వెల్లడించారు.

**మహిళల ఆర్థిక శక్తిని పెంచాలనేదే మా లక్ష్యం..**

మహిళల ఆర్థిక శక్తిని పెంచాలనేదే ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ ఎదగాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను పెంచే ప్రణాళికలను తయారు చేశామని వివరించారు. హైదరాబాద్‌ను పొల్యూషన్ ఫ్రీ నగరంగా మార్చాలని సూచించారు. చంద్రబాబు, వైఎస్సార్ హైదరాబాద్‌ను అభివృద్ధి చేశారని అన్నారు. రెడ్, ఆరెంజ్ కేటగిరి పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్డు బయటకు పంపిస్తామని తెలిపారు. మూసీ ప్రక్షాళన చేయాలంటూనే.. ప్రభుత్వాన్ని ఆ పని చేయనివ్వడం లేదని అన్నారు. ఇటీవల ఓ అపార్ట్‌మెంట్ విషయంలో రాద్ధాంతం చేస్తున్నారని బీఆర్ఎస్‌నుద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు.

**డిసెంబర్ నాటికి పూర్తిగా ఇక ఎలక్ట్రిక్ బస్సులే**

2026 డిసెంబర్ నాటికి పూర్తిగా ఎలక్ట్రిక్ బస్సులు తీసుకువస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పెట్రోల్, డీజిల్ లతో నడిచే ఆటోలనూ ఎలక్ట్రిక్‌గా మార్చుతామని అన్నారు. విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు ఇస్తామని హామీ ఇచ్చారు. గాంధీ విగ్రహం కట్టడానికి రూ.500కోట్లు అని ప్రతిపక్షాల నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహించారు. గాంధీ విగ్రహానికి రూ.70కోట్లే ఖర్చవుతుందని స్పష్టం చేశారు. ఈ విగ్రహం దగ్గర విజ్ఞాన కేంద్రానికి రూ.100కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. మహిళలకు రక్షణ మాత్రమే కాదని.. అవకాశాలు కూడా కల్పిస్తామని వివరించారు. సోషల్ మీడియాలో అవాస్తవాల ప్రచారంపై ఫిర్యాదులు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. హైదరాబాద్‌లో కాలుష్యం, దోమలు ఎక్కువగా ఉన్నాయంటున్నారన్నారు. మూసీని ప్రక్షాళన చేస్తామంటే ప్రతిపక్షాల నేతలు ఎందుకు అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు. ఇటీవల ఓ అపార్ట్‌మెంట్ విషయంలో రాద్ధాంతం చేశారని దుయ్యబట్టారు. మూసీ ప్రక్షాళన వద్దంటున్నారా..? , తొలగింపులు వద్దంటున్నారా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు.

**నాన్‌లివింగ్ సిటీగా మారే ప్రమాదం..**

కాలుష్యంతో హైదరాబాద్ నాన్ లివింగ్ సిటీగా మారే ప్రమాదం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. అలాంటి పరిస్థితులు రాకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. నదుల బఫర్ జోన్లలో ఎలాంటి కట్టడాలకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. అలాంటి చోట నిర్మాణాలు చేపట్టినా తొలగించాల్సి వస్తుందని తేల్చిచెప్పారు. బఫర్ జోన్ల పరిధిలో 50మీటర్ల లోపల ఉంటే ఇళ్లకు విలువ ఉండదని తెలిపారు. ఇలాంటి అంశాల్లో రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. నష్ట పరిహారం ఇచ్చే బఫర్ జోన్‌లోని ఇళ్లను తొలగిస్తామని స్పష్టం చేశారు.

నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపిస్తామని భరోసా కల్పించారు. మూసీ నిర్వాసితులకు ఏం కావాలో చర్చిస్తే బాగుంటుందని అన్నారు. ఈనెల 13వ తేదీన మూసీ పునరుజ్జీవంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇస్తామని చెప్పుకొచ్చారు. డీపీఆర్ కూడా ప్రెజెంట్ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**మహిళా జర్నలిస్టులకు సన్మానం**

రాష్ట్రంలో మహిళా జర్నలిస్టులకు ప్రత్యేక గుర్తింపునిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా.. ప్రజాభవన్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలు, మహిళా జర్నలిస్టులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలకు సరైన గుర్తింపునివ్వాలని ప్రజాప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మహిళలు ఎక్కడున్నా రాణిస్తున్నారని కొనియాడారు.

హైదరాబాద్ కలెక్టర్ గా మహిళ బాధ్యత వహిస్తున్నారని గుర్తుచేశారు. అలాగే ఎస్ఐబీ అధిపతిగా కూడా మహిళనే పెట్టామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1000 బస్సులకు మహిళలే యజమానులుగా ఉన్నారన్నారు. అలాగే 1000 మెగావాట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తి చేసేవారిగా స్వయం సహాయక బృందాలను తయారు చేశామని తెలిపారు.

# మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

- ఆరోగ్యంగా ఉంటేనే జీవితంలో అన్ని సాధించగలరు ● ఉమెన్ వెల్‌నెస్ సమ్మిట్‌లో మంత్రి సీతక్క




తెలంగాణ బ్యూరోప్రతినిధిః మహిళలు ఆరోగ్యం పై శ్రద్ధ పెట్టాలని, వారు ఆరోగ్యంగా ఉంటేనే జీవితంలో అన్నీ సాధించగలరని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా.ధనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. హైదరాబాద్ మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఒమేగా హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఉమెన్ వెల్నెస్ సమ్మిట్--2026" కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే జీవితంలో అన్ని సాధించగలరని, అందుకే ప్రతి మహిళ తన ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.గ్రామీణ ప్రాంతాల మహిళలు, ఉద్యోగాలు చేసే మహిళలు రోజువారి జీవన పోరాటంలో తమ ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా కష్టపడుతూ ఉంటారని, ఈ నిర్లక్ష్యం వల్ల చాలామంది మహిళలు క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు . ప్రపంచంలో క్యాన్సర్ కేసుల నమోదులో భారతదేశం మూడో స్థానంలో ఉండటం ఆందోళనకరమైన విషయమన్నారు. గత పది సంవత్సరాల్లో తెలంగాణలో సుమారు 12 వేల కొత్త క్యాన్సర్ కేసులు నమోదయ్యాయని, ప్రతి సంవత్సరం సగటున వెయ్యి నుంచి 1200 కేసులు నమోదవుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్ వంటి నగరాల్లో ముఖ్యంగా బ్రెస్ట్ క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయి ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్యం, ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్పులు, పని ఒత్తిడి, కల్తీ ఆహారం వంటి కారణాల వల్ల అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయని చెప్పారు. మహిళల ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు ఒమేగా హాస్పిటల్స్ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని మంత్రి సీతక్క అన్నారు. మహిళలకు అవగాహన కల్పించడం కోసం ఎంత బిజీగా ఉన్నా ఈ కార్యక్రమానికి హాజరయ్యానని చెప్పారు.

ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని " గివ్ టు గెయిన్" అనే ప్రత్యేక థీమ్‌తో నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తే.. సమాజానికి ఎంతో ప్రయోజనం చేకూర్చిన వారవుతారని తెలిపారు.మా ప్రభుత్వం తరఫున గ్రామీణ ప్రాంత మహిళల కోసం ఉచితంగా 30 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, వ్యాధులను ముందుగానే గుర్తించి వారికి సరైన చికిత్స అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఇదే అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి మనం చేసే నిజమైన కృషి అని అన్నారు. క్యాన్సర్ వంటి వ్యాధులు చాలా కుటుంబాల ఆశలను ఆవిరి చేస్తాయని, అందువల్ల బాధితులకు ధైర్యం చెప్పి, సరైన వైద్యం అందించి వారిని బతికించడం వైద్యుల బాధ్యత అని మంత్రి చెప్పారు. ప్రస్తుతం వైద్య రంగంలో సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందినందున అనేక రోగాలను నయం చేయగలుగుతున్నామని, అయినప్పటికీ అన్న భావనతో ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.మన దేశం వ్యవసాయంపై ఆధారపడి ఉన్న దేశమని, వ్యవసాయ రంగంలో సుమారు 80 శాతం మంది మహిళలు పని చేస్తున్నారని మంత్రి తెలిపారు. కాబట్టి వారి ఆరోగ్య సంరక్షణ కోసం వైద్య రంగం తమ వంతు సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వంగా కూడా అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. మహిళలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాండ్ విత్ హర్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు.

మన ఇంట్లో ఆడబిడ్డకు ఎలా అండగా ఉంటామో, అదే విధంగా సమాజంలోని ఇతర మహిళలకు కూడా అండగా నిలిస్తే వారు మరింత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగగలరని మంత్రి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం చరిత్రను ప్రస్తావిస్తూ, ఒకప్పుడు ఇది శ్రామిక వర్గ మహిళలు తమ హక్కుల కోసం జరుపుకునే రోజు అని, కర్మాగార కార్మికులు, పంట పొలాల్లో పనిచేసే మహిళలు తమ శ్రమకు గుర్తింపుగా ఈ దినోత్సవాన్ని జరుపుకునేవారని చెప్పారు.

అనంతరం ఐక్యరాజ్యసమితి 1975 నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా గుర్తించింది అని వివరించారు. అయినప్పటికీ ఇప్పటికీ అనేక పని ప్రదేశాల్లో మహిళలు వివక్షను ఎదుర్కొంటున్నారని, మహిళలపై వేధింపుల రూపం మారినా స్వభావం మాత్రం మారలేదని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం అంటే కేవలం ఆటపాటల రోజు కాదని, అది మహిళల హక్కుల కోసం సాగిన పోరాటానికి ప్రతీక అని అన్నారు.


సమాన పనికి సమాన వేతనం కోసం సోషలిస్ట్ నాయకురాలు క్లారా జెట్కిన్ ప్రారంభించిన మహిళా దినోత్సవం ఈరోజు ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నామని, ఆమె వేసిన మొదటి అడుగును మన మహిళలంతా కొనసాగించాలని మంత్రి పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఒమేగా హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయ వేమూరి, ఆసుపత్రి ప్రతినిధులు, పెద్ద ఎత్తున వైద్యులు మరియు ఇతరులు పాల్గొన్నారు. వివిధ రంగాల్లో సమాజ ఉన్నతిని కృషి చేస్తున్న సునీత కృష్ణన్, లలితా రఘురాం మంచు లక్ష్మి, ఇతర ప్రముఖులను మంత్రి సీతక్క ఘనంగా సన్మానించారు.

# బదిలీపై వెళ్తున్న జిష్ణుదేవ్ వర్మతో సీఎం రేవంత్ భేటీ

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : మహారాష్ట్ర గవర్నర్‌గా బదిలీపై వెళ్తున్న జిష్ణుదేవ్ వర్మతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో సీఎం రేవంత్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలు వీరిద్దరి మధ్య చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. త్రిపురకు చెందిన జిష్ణుదేవ్ వర్మ.. 2024, జులై 27న తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. అయితే తాజాగా పలు రాష్ట్రాల గవర్నర్లను కేంద్రం బదిలీ చేసింది. ఈ నేపథ్యంలో జిష్ణుదేవ్ వర్మ మహారాష్ట్ర గవర్నర్‌గా బదిలీ అయ్యారు. ఇక జిష్ణుదేవ్ వర్మతో జరిగిన భేటీలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

మరోవైపు బదిలీపై వెళ్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఇప్పటికే వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు మర్యాద పూర్వకంగా కలిశారు.



ఇక తెలంగాణ గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా ఉన్నారు.

మరికొద్ది రోజుల్లో ఆయన రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.ఇక పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఆనంద్ బోస్.. తన పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిని కేంద్రం నియమించింది.

అయితే ఆకస్మాత్తుగా గవర్నర్ పదవికి రాజీనామా చేయడంపై ఆనంద్ బోస్ వివరణ ఇవ్వకపోవడం గమనార్హం. అదీకాక.. కేరళకు చెందిన ఆనంద్ బోస్.. తన ఓటును స్వరాష్ట్రం నుంచి పశ్చిమబెంగాల్ మార్చుకోవడం గమనార్హం. మరికొద్ది నెలల్లో పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. అలాంటి వేళ.. గవర్నర్ పదవికి ఆనంద్ బోస్ రాజీనామా హాట్ టాపిక్‌గా మారింది.

## లోక్ భవన్‌లో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ దంపతులను మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి సీతక్క

**ములుగు ప్రజలు విష్ణుదేవ్ వర్మను ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటారని తెలిపిన మంత్రి సీతక్క**



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో ప్రస్తుత తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ దంపతులను రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క మర్యాదపూర్వకంగా కలిశారు. మహారాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన సందర్భంగా గవర్నర్‌కు మంత్రి సీతక్క శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా గవర్నర్ దంపతుల యోగక్షేమాలను మంత్రి సీతక్క అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ నుంచి మహారాష్ట్ర గవర్నర్‌గా బదిలీ అవుతున్న వార్త తమకు ఆశ్చర్యం కలిగించిందని, ఇది తమను "షాక్"కు గురిచేసిందని మంత్రి గవర్నర్‌కు తెలిపారు.ములుగు జిల్లా పట్ల గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రత్యేక అభిమానం చూపించారని మంత్రి సీతక్క గుర్తుచేశారు. గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మూడు సార్లు ములుగు నియోజకవర్గంలో పర్యటించడం మాత్రమే కాకుండా, కొండపర్తి గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.తాను దత్తత తీసుకున్న గ్రామాల్లో మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం గవర్నర్ గారు ప్రత్యేక చర్యలు తీసుకున్నారని మంత్రి గుర్తు చేశారు. ముఖ్యంగా కారంపొడి మిల్లు, పసుపు మిల్లు ఏర్పాటు చేయడంతో పాటు గ్రామంలో పలు మౌలిక వసతులను కల్పించి మహిళలకు ఉపాధి అవకాశాలను పెంచారని, అందుకు ములుగు ప్రజలు రుణపడి ఉంటారని సీతక్క చెప్పారు.గవర్నర్ ఇచ్చిన ప్రోత్సాహంతో కొండపర్తి గ్రామ మహిళా సంఘం సభ్యులు "ఇప్పపువ్వు లడ్డూలు" తయారీని ఉపాధిగా చేపట్టారని మంత్రి తెలిపారు. ఇటీవల జరిగిన సమ్మక్క--సారలమ్మ జాతరలో ఈ లడ్డూలను విక్రయించి మహిళలు మంచి ఆదాయం పొందారని ఆమె వివరించారు.ములుగు నియోజకవర్గ ప్రజలు గవర్నర్ గారిని ఎంతో అభిమానంతో గుర్తుంచుకుంటారని, ఆయనను ఎంతో మిస్ అవుతారని మంత్రి సీతక్క పేర్కొన్నారు.ఈ సందర్భంగా తన అనుభవాలను మంత్రి సీతక్క వివరించగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ భావోద్వేగానికి లోనయ్యారు. దాదాపు అరగంటకు పైగా మంత్రి సీతక్కతో గవర్నర్ దంపతులు ఆసక్తిగా మాట్లాడి పలు విషయాలు పంచుకున్నారు.అయితే ఈ సందర్భంగా మంత్రి సీతక్క సేవలను గవర్నర్ ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆమెను "వెరీ ఆక్టివ్ లేడీ" అంటూ అభినందించారు. ఇదే విధంగా ప్రజలకు సేవ చేసే కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క గవర్నర్‌కు సమ్మక్క-సారలమ్మ జాతర జ్ఞాపికను అందజేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గవర్నర్ సతీమణికి తెలంగాణ సంప్రదాయ చీరను బహుకరించారు.

### భారత శాస్త్ర-సాంకేతిక

# ప్రతిభకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్

- మన దేశాన్ని బలోపేతం చేసేందుకు దాన్ని వినియోగించాలి
- పాన్ ఐఐటి సమ్మిట్ ప్రారంభించిన ఎంపీ ఈటల రాజేందర్

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : పాన్ ఐఐటీ హైదరాబాద్ సమ్మిట్ 2026 ఆదివారం హైదరాబాద్ లోని నిర్వహించిన ఈ సమ్మిట్‌ను లోక్‌సభ సభ్యుడు ఈటల రాజేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఐటీ వ్యవస్థ దేశవ్యాప్తంగా ఉన్నత ప్రమాణాల శాస్త్ర, సాంకేతిక విద్యను విస్తరించడంలో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఎకోసిస్టమ్‌లోని భాగస్వాములు మరియు పరిశోధన--అభివృద్ధి సంస్థల మధ్య సహకారం పెరిగితే ఆవిష్కరణల వాతావరణం మరింత బలపడుతుందని అన్నారు. భారత శాస్త్ర, సాంకేతిక ప్రతిభకు ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందని, ముఖ్యంగా అమెరికా సంయుక్త రాష్ట్రాల సాంకేతిక అభివృద్ధిలో భారతీయుల పాత్ర విశేషమని చెప్పారు. అయితే అదే దేశం కొన్ని రంగాల్లో ఇతర దేశాలపై ఆధిపత్యం ప్రదర్శించే ప్రయత్నం చేస్తున్నదని పేర్కొన్నారు. ముఖ్యంగా "భారత శాస్త్ర, సాంకేతిక ప్రతిభకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉందని, మన దేశాన్ని



బలోపేతం చేసేందుకు దాన్ని వినియోగించాలని అన్నారు. అలాగే దేశ అభివృద్ధి కోసం సాంకేతికతను ఉపయోగించాలని యువతకు పిలుపు నిచ్చారు.

"భారతదేశంలో ఆరోగ్య సంరక్షణలో మార్పులు" అనే అంశంపై కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సీఈఓ సునీల్ కుమార్ బర్న్వాల్ మాట్లాడుతూ నేషనల్ హెల్త్ అథారిటీ, విభజిత ఆరోగ్య వ్యవస్థల వల్ల ఏర్పడుతున్న సమస్యలను వివరించారు.

ఒకే పౌరుడికి అనేక ఆరోగ్య గుర్తింపులు ఉండటం, వ్యవస్థల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల పేషెంట్లు ఎక్కువగా స్వంత ఖర్చుతో వైద్య సేవలను పొందాల్సి వస్తోందని తెలిపారు. భారత ఆరోగ్య వ్యవస్థ ప్రస్తుతం గొప్ప మార్పును అనుభవిస్తోందని చెప్పారు.ఈ కార్యక్రమానికి కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సీఈఓ సునీల్ కుమార్ బర్న్వాల్ , విద్యుత్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ , పాన్‌ఐఐటీ అల్యూమినీ ఇండియా చైర్మన్ ప్రభాత్ కుమార్, ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్ తదితరులు హాజరయ్యారు.


**గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్** GHMC

సైబరాబాద్ మునిసిపల్ కర్పొరేషన్
EE-II, (56-కొంపల్లి, దుండిగల్ & 60-మేడ్చల్), కుత్బుల్లాపూర్ జోన్
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

నిట్ నెం.03/EE-56/, 02/EE-59, 03/EE-60/QBZ/CMC/2025-26, తేది: 07-03-2026

వివరాలను https:///tender.eprocurement.gov.in. లాగిన్ చేయడం ద్వారా చూడవచ్చు ఈవెంట్ తేదీ క్రింద వివరించబడింది:. **పని పేరు:** 1. వార్షిక పూడికతీక పనుల సంఖ్య: 4. అంచని వ్యయం లక్షలలో: 69.00 లక్షలు. 2. వార్షిక పూడికతీక పనుల సంఖ్య: 3. అంచని వ్యయం లక్షలలో: 19.90 లక్షలు. 3. వార్షిక పూడికతీక పనుల సంఖ్య: 3. అంచని వ్యయం లక్షలలో: 45.20 లక్షలు.
**బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది మరియు సమయం :** 09-03-2026 మ॥ 12.00 గం॥లకు. **బిడ్ సమర్పించుటకు ముగింపు తేది మరియు సమయం:** 16-03-2026 మ॥ 12.00 గం॥లకు. **అధికారి పేరు మరియు చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్ - 56, 59 & 60, CMC, కుత్బుల్లాపూర్, సెల్ నెం. 7995468066 / 7331181426. సంబంధిత **అధికారి చిరునామా** శ్రీ. సుబ్రహ్మణ్య SVRNRD, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, 56- కొంపల్లి, 59-దుండిగల్ & 60-మేడ్చల్, కుత్బుల్లాపూర్ జోన్, CMC.
మరిన్ని వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగాhttps//tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II సర్కిల్-56, 59 & 60, QBZ , CMC
DIPR.RO.No.16625-PP/CL/Advt/1/2025-26 , Dt: 08-03-2026

kotak Kotak Mahindra Bank కోటక్ మహీంద్రా బ్యాంక్

**నోటీసు**

**కింద పేర్కొన్న వ్యక్తి రోల్లా వెంకట పూనయ్య, చిరునామా: ప్లాట్ నం 15, ఆంధ్రా బ్యాంక్ కాలనీ, మోసారం బాగ్, దిల్సుఖ్ నగర్, హైదరాబాదు, తెలంగాణ, 500060, ఇండియా, ద్వారా కేటాయించబడిన లాకర్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ధంటోలి బ్రాంచ్, నాగపూర్ షాప్ బ్లాక్ నం 1, 2 & 3, గ్రౌండ్ ఫ్లోర్, మైల్‌స్టోన్, ప్లాట్ నం 12, శక్తి ప్రెస్ దగ్గర, లోక్మత్ స్క్వేర్, వార్ధా రోడ్, నాగపూర్ – 440012 లోని బ్రాంచ్ ద్వారా లభించే లాకర్ చివరి 10 సంవత్సరాలుగా ఉపయోగం చేయబడలేదు.వినతిగా, రోల్లా వెంకట పూనయ్యకు లాకర్ ఉపయోగం చేయమని మూడు 3 లేఖలు పంపినప్పటికీ అవి అందించబడలేదు మరియు ఆయన సంప్రదించలేరు.అందువలన, ఈ నోటీసు ద్వారా మూడు 3 నెలల కాలం లోపల, అంటే ఈ నోటీసు తేదీ నుండి 3 నెలల్లో, రోల్లా వెంకట పూనయ్య లాకర్‌ను ఉపయోగించకపోతే, 7 జూన్ 2026 న, సుమారు 11:00 AM కు ఆ లాకర్‌ను బ్యాంక్ అధికారం ద్వారా తెరిచే చర్య చేపడతామని అధికారికంగా తెలియజేస్తున్నాం.సూచన: ఈ చర్య పూర్తిగా న్యాయానుగుణంగా, రక్షిత విధానాల ప్రకారం తీసుకోబడుతుంది.**

**కింద పేర్కొన్న వ్యక్తి ప్రతాప్ రెడ్డి కల్లెం, చిరునామా: ఫ్లాట్ నం 303, ప్లాట్ నం 91, రోడ్ నం 3, డాక్టర్స్ కాలనీ, సాజ్ నిలయ, APTS సరోర్ అంగర్, హైదరాబాదు, తెలంగాణ, 500035, ఇండియా, ద్వారా కేటాయించబడిన లాకర్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ధంటోలి బ్రాంచ్, నాగపూర్ షాప్ బ్లాక్ నం 1,2 & 3, గ్రౌండ్ ఫ్లోర్, మైల్‌స్టోన్, ప్లాట్ నం 12, శక్తి ప్రెస్ దగ్గర, లోక్మత్ స్క్వేర్, వార్ధా రోడ్, నాగపూర్ – 440012 లోని బ్రాంచ్ ద్వారా లభించే లాకర్ చివరి 10 సంవత్సరాలుగా ఉపయోగం పొందలేదు.వినతిగా, ప్రతాప్ రెడ్డి కల్లెం కు లాకర్ ఉపయోగం చేయమని మూడు 3 లేఖలు పంపినప్పటికీ అవి అందించబడలేదు మరియు ఆయన సంప్రదించలేరు.అందువలన, ఈ నోటీసు ద్వారా మూడు 3 నెలల లోపల, అంటే ఈ నోటీసు తేదీ నుండి 3 నెలల్లో, ప్రతాప్ రెడ్డి కల్లెం లాకర్‌ను ఉపయోగించకపోతే, 7 జూన్ 2026 న, సుమారు 11:00 AM కు ఆ లాకర్‌ను బ్యాంక్ అధికారులచే తెరిచే చర్య చేపడతామని అధికారికంగా తెలియజేస్తున్నాం.సూచన: ఈ చర్య పూర్తిగా న్యాయానుగుణంగా, రక్షిత విధానాల ప్రకారం తీసుకోబడుతుంది.**

'సూర్య' సాహిత్య సాంస్కృతిక వేదిక
అక్షరం
4
సోమవారం 9 మార్చి 2026
suryaeditpage@gmail.com

## చారిత్రక మహాగీతం

అమ్మ దాచిన పోపులపెట్టె చిల్లర డబ్బులు
ఇద్దరం కలిస్తే చిన్నికృష్ణుని వెన్న దొంగతనాలు
అమ్మ కోపం,
మంచం దాపున నక్కిన చిలిపితనాలు
పాఠశాల మైదానం ఒ
సాయంకాలం పిలిచిన ఆటలు
ఒకరికి ఒకరం తోడు
ఇంటివైపు చీకటి తరిమిన పరుగులు...
పడుకునే వేళ దిండుల కరవాలాల పోరు
నాన్నకు ఒకరిపై ఒకరం గారాబాల పిర్యాదు
నాది నాకు నచ్చదు తమ్ముడిదే కావాలి
వానిది వానికి నచ్చదు నాదే బాగుంటుంది
అమ్మానాన్నల సర్దిచెప్పిన మందలింపు
ఇద్దరం ఒకటై
ఆట పాటలు కేరింతల కొనసాగింపు...
నిజానికి నేనే చిన్న, తమ్ముడు వచ్చేంత వరకు
ఇపుడు నేనే పెద్ద, తమ్మునికి సలహా ఇచ్చేందుకు
అమ్మా నాన్న తమ్ముడు నేను, మా చిన్ని ఇల్లు
ఓ ఆనందాల పొదరిల్లు సంతోషాల హరివిల్లు
ఎందుకో ఒక్కసారిగా దేవుని చిన్న చూపులు
కళ్ళముందు విధి రాసిన కాలం కన్నీటితెరలు...
ముప్కాలు దాటి ఆర్మూరు మీదుగా ఇందూరు
అమ్మానాన్నల ధైర్యం ఆగని కన్నీటి ప్రయాణం
చికిత్స మీద చికిత్స, తగ్గని తమ్ముని కడుపునొప్పి
పట్నం నిలోఫరు చేర్చిన ఆఖరి ఆశల విశ్వాసం
నాకక్కడ మిగిలిన తమ్ముని తడిమిన కడసారి
జ్ఞాపకం..
వైద్యుల ఆఖరి మాటలు
అద్దెకారులో కొడిగట్టిన ఆశలు
తిరుగుప్రయాణం,
ఏడ్చి ఏడ్చి ఎండిపోయిన కళ్ళు
అమ్మా ..నాకు చూపు మసకవుతుంది ఎందుకని
మధ్యదారిలో ఎక్కడో విసరబడిన యమపాశం
తమ్ముని హత్తుకున్న అమ్మా నాన్న
పెల్లుబికిన దుఃఖం...
మేనమామ ఇంటికి ఆలస్యంగా చేరిన ఆ కబురు
ఓరుగల్లు నుండి మెట్టుపల్లి బస్సుకిటికే తమ్ముని
స్పర్శ
తరగని కన్నీటిధారలు నోచుకొని చివరిచూపులు
నవారు మంచం కోడు పట్టుకుని వెక్కి వెక్కి
ఏడ్చిన క్షణాలు
తమ్ముని అడుగుల ప్రతిధ్వనులు చీకటి ఇంట
నిశ్శబ్దపు
ఏడుపులు
ముసిరిన జ్ఞాపకాలు కన్నీటి బాల్యస్మృతులు
మిగిలిన జీవితాలు దుఃఖపు అంతర్ముఖాలు...

**అశోక్ గుంటుక**
**9908144099**

# శ్రీకృష్ణుడి మహిమను తెలుసుకున్న నారద మహర్షి



**వనం జ్వాలా నరసింహారావు**
**80081 37012**

**కం॥ చదివెడిది భాగవతమిది,**
**చదివించును కృష్ణు, దమృతఝరి పోతనయున్**
**చదివినను ముక్తి కలుగును,**
**చదివెద నిర్విఘ్నరీతి 'జ్వాలా' మతినై**



## శ్రీ మహాభాగవత కథ-76

శ్రీకృష్ణుడు నరకాసురుడిని సంహరించి ఆయన భవనంలో వున్న పదహార–ువేలమంది కన్యలను వివాహం చేసుకున్నాడన్న వార్త నారద మహర్షి విన్నాడు. ఆ కన్యలందరికీ, ఒక్కొక్కరికి, ఒక్కో రూపంలో దర్శనం ఇచ్చి సంతోషపరిచాడన్న విషయం కూడా విని, శ్రీకృష్ణుడి వైభవాన్ని స్వయంగా చూడాలని ద్వారకానగారానికి వచ్చాడు నారదుడు. ఆయన చూసిన ద్వారక శ్రీకృష్ణుడి నివాసం కావడంతో, అది, ఇంద్రుడి అమరావతీ నగరంలా శోభాయమానంగా మెరిసిపోతున్నది. ద్వారకానగరంలో ప్రవేశించిన నారద మహర్షి విశ్వకర్మ నిర్మితమైన పదహారు వేల మేడలను చూశాడు. స్ఫటిక స్తంబాలతో కట్టబడి, మళ్లీ మళ్లీ చూడాలనిపించే బహుసుందరంగా వున్న ఆ సౌధాలను నారదుడు తనివితీరా చూశాడు.

ఒకానొక సౌధంలో ప్రవేశించిన నారదుడికి స్వర్ణసింహాసనం మీద కూర్చుని, క్రై వున్న శ్రీకృష్ణుడు ఆయన్ను చూసి ఎదురు వెళ్లాడు. శ్రీకృష్ణుడు దేవర్షికి నమస్కరించి తన సింహాసనం మీద ఆ దేవర్షిని కూచోబెట్టాడు. నారద మహర్షి పాద తీర్థాన్ని తన శిరస్సు మీద ధరించాడు. నారదుడిని, తానేం చేయాలో ఆనతి ఇవ్వమన్నాడు. శ్రీకృష్ణుడి పాదపద్మాల మీదే తన ధ్యాస సదా నిలిపే విధంగా వరమియ్యమని కోరాడు నారదుడు. నారదుడి మాటలకు శ్రీకృష్ణుడు ప్రసన్నమయ్యాడు.

శ్రీకృష్ణుడి యోగమాయా ప్రభావాన్ని తెలుసుకోవడానికి నారదుడు అక్కడి నుండి ఇంకొక మందిరానికి పోయాడు. అక్కడ ఉద్ధవుడితో జూదం ఆడుతూ కనిపించిన శ్రీకృష్ణుడిని చూసి ఆశ్చర్యపోయాడు. అక్కడ కూడా శ్రీకృష్ణుడి సత్కారాలను పొందాడు. వేరొక మందిరానికి పోయిన నారదుడికి శ్రీకృష్ణుడు ఆయన పుత్రులతో కలిసి ఆనందిస్తున్న దృశ్యం కనిపించింది. మరొక మందిరంలో కూడా శ్రీకృష్ణుడిని చూశాడు. మరొక మందిరం ఉద్యానవనంలో పత్నీ సమేతుడై విహరిస్తున్న కృష్ణుడిని చూశాడు. ఇంకో ఇంట్లో ధ్యాన నిష్ఠలో వున్నట్లు కనిపించాడు. ఒకచోట సంధ్యావందనం చేస్తున్నాడు. మరొక చోట పురాణం చదువుకుంటున్నాడు. ఇంకో చోట పంచ యజ్ఞాచేస్తున్నాడు. ఇంకో ప్రియురాలి ఇంట్లో బలరాముడితో సమాలోచన చేస్తూ కనిపించాడు. ఒక చోట గోదానాచేస్తున్నాడు.

నారదుడు అలా తిరుగుతూనే వున్నాడు. వేదస్వరూపుడు, సాక్షాత్తు పరమాత్ముడు అయిన శ్రీకృష్ణుడి మహిమలకు నారదుడు ఆశ్చర్యపోయాడు. పరాత్పరుడైన శ్రీకృష్ణుడిని చూసి నారదుడు పరమానందభరితుడయ్యాడు. ఆయన్ను ఒక ఇంట్లో కలిసి, ఆయన మహిమతెలుసుకోవడం ఎవరి తరం కాదన్నాడు. శ్రీకృష్ణుడి దివ్య చరిత్రను కీర్తిస్తూ అందరికీ తెలియపరుస్తానని అంటూ, నారాయణ నామస్మరణ చేసుకుంటూ వెళ్లిపోయాడు.

శ్రీకృష్ణుడు ప్రతిరోజూ రాజ కార్యాలను నిర్వహిస్తూ వుండగా, ఒకనాడు, ఒక బ్రాహ్మణుడు ఆయన దగ్గరికి వచ్చాడు. తన విన్నపం వినమని ప్రార్థించాడు. చెప్పడం ప్రారంభించాడు. 'జరాసంధుడు అనే రాజు గిరివ్రజపురం రాజధానిగా చేసుకుని, తనను ఎదిరించిన ఇతర రాజులను బందీగా చేసి, తన రాజధాని నగరంలో బంధించాడు. అలా బంధించబడిన రాజుసుమారు ఇరవై వేలమంది వుంటారు'. వారంతా తనను శ్రీకృష్ణుడి దగ్గరికి పంపారన్నాడు. తమని కాపాడమని వారు ప్రార్థిస్తున్నారని చెప్పాడు. ఇలా ఆ బ్రాహ్మణుడు చెపుతున్న సమయంలో నారద మహర్షి సభలోకి ప్రవేశించాడు.

తనను దర్శించుకోవడానికి వచ్చిన నారద మహర్షిని పాండవుల విషయం అడిగాడు శ్రీకృష్ణుడు. ధర్మరాజు ధర్మ చింతనతో రాజసూయ యాగం చేయాలని సంకల్పించాడని, అతడు చేయబోతున్న యజ్ఞాన్ని శ్రీకృష్ణుడు రక్షించాలని, వీచూసుకుని ఆయన దగ్గరికి వెళ్లి విజయం చేకూర్చాలని నారదుడు బదులిచ్చాడు. ఇది విన్న శ్రీకృష్ణుడు అక్కడే వున్న ఉద్ధవుడి వైపు చూసి ఏంచేద్దాం అని సలహా అడిగాడు. ధర్మరాజు యజ్ఞానికి పూనుకోవడం హర్షనీయమైనదని,ఇదే అవకాశంగా తీసుకుని భీముడితో పోయి జరాసంధుడిని వధించవచ్చని, ఆయన దగ్గరికి బ్రాహ్మణ వేషంలో పోయి ఏది అడిగినా యిస్తాడు కాబట్టి యుద్ధ బిక్ష వేడడం మంచిదని, ధర్మరాజు రాజసూయ యాగాన్ని రక్షించే బాధ్యత శ్రీకృష్ణుడి మీదే వున్నదని ఉద్ధవుడు చెప్పాడు.

నారదుడి మాట, ఉద్ధవుడి మాటవిన్న శ్రీకృష్ణుడు ఇంద్రప్రస్థ నగరానికి రథం ఎక్కి బయల్దేరాడు. ద్వారకను దాటాడు. దానికి ముందు నారదుడిని సత్కరించి సాగనంపాడు. మధ్యలో ఒక ఉద్యానవనంలో విడిది చేశాడు. జరాసంధుడి చెరసాలలో వున్న రాజుపంపిన బ్రాహ్మణ దూతతో, తాను వారిని కాపాడుతానని అభయమిచ్చాడు. ఆ తరువాత ధర్మరాజు దగ్గరికి భార్యలతో, కొడుకులతో, బంధువులతో, స్నేహితులతో కలిసి బయల్దేరాడు.

ఇంద్రప్రస్థపురాన్ని చేరుకున్న శ్రీకృష్ణుడు నగరానికి సమీపంలో వున్న ఉద్యానవనంలో బసచేశాడు.

**(బమ్మెర పోతన శ్రీమహాభాగవతం, రామకృష్ణ మఠం ప్రచురణ ఆధారంగా)**

## భూభారతి


భరతమాత శ్రేయస్సును..
నిరంతరం ఉచ్ఛ్వాసిస్తూ..
ఆమెకు హానిని తలపెట్టే..
దురాక్రమణలను నిశ్వాసిస్తూ..
ఆమె నుదిటి సింధూర శోభలకు..
అనునిత్యం ఆరాటపడుతూ..
ఆమె దేహాన పారే నదీజలాల్లో..
పంటరాసుల దిగుబడిని దర్శిస్తూ..
నేలతల్లిపై వీచే గాల్లో ప్రాణవాయువై
భూమాత సిగలో మల్లెల సుగంధమై..
ఆమె నుదుట చిరునవ్వుల పువ్వునై..
మట్టిమాత ఒడిలో మెరిసే చిన్నారినై..
తల్లి గుండెల్ని పిండేసే కాలుష్య కోరల్ని..
నిర్దాక్షిణ్యంగా తెగనరికే పదునైన కత్తినై..



ఆమె సుతిమెత్తని దివ్య పాదాలకు..
సదా సురక్షను కల్పించే పాదరక్షనై..
ఆమె ముద్దు బిడ్డల్లో నేనొకడినై..
భూమాత శిరస్సుపై పొదిగిన కిరీటంలో..
అద్వితీయ వజ్రపు ధగధగనై..
ఆమె ఆనంద జ్యోతులకు ఇంధనమై..
భరతమాత సంతోష విందులకు..
తానే స్వయం సిద్ధ అమృతాహారమై..
సకల జీవకోటి ఉత్సాహానికి..
తానే అంతులేని ఆరాట పోరాటమై..
భూభారతి ధరించిన హరిత చీరపై..
తానే ఒక పచ్చటి బాపూ బొమ్మయై..
ఆమె దివ్యశక్తికి తానే మూలమై..
భరతమాత గుండెల్లో ప్రవహించే..
రుధిర ప్రవాహ సముద్రమవుతా !

**మధుపాళీ**
**9949700037**

## నా కంటే ముందే



నా ఒంటికి సరిపడా
అందం నాకూ ఉంది.
వాడు ఇంటితో పోటీగా
సుఖం నాకూ ఉంది.
ఐతే జరుగుతున్న ద్రోహమొకటి.
పిచ్చిపట్టిన భయం
గుడ్డలు చించుకున్న సహనంతో
నా కంటే ముందే
ఈర్ష్య రూపంలో
నా ముందు పడలేని అహం
శత్రుత్వాన్ని దాచి నటిస్తుంది...
నా కంటే ముందే
నా వెనుకే గోతులు స్తుంటుంది.
ఎప్పుడూ ఇంతే
ఎవడో ఒకడు ఉంటూనేఉన్నాడు
నా కంటే ముందే
ఏదో ఒక వికృత రూపంలో...
ఎప్పుడూ ఇంతేగా
మళ్ళీ ఇప్పుడు ఇంకొకడు.
వాడు నేను ఒకటేనన్న
బలాన్ని తట్టుకోలేని
పిరికితనం వాడిది.
వాడు ఆస్వాదించే రుచి....
నేను ఆదరించే రుచి ఒకటే
వాడు నడిచే దారిలోనే
నా మార్గం...నా గమ్యం.
వాడి గొంతుకు సమానమే
నా స్వరం కూడా
వాడు పక్కనున్నా
నా హుందాతనం తక్కువ కాదు.

**... చందలూరి నారాయణరావు**
**9704437247**

## ప్రేమ కవిత

పక్కన నువ్వుంటే
ఉన్నట్టే తెలీదు
ఊపిరిలా....
లేకుంటే,
లేనట్టే తెలీదు
నేనంటూ ఉంటేగా...
ఎదుట నేనుంటే
చేయి విడువనంటావు
గొడవ పడుతుంటావు
ఘడియ కనబడకుంటే
గాయమై పోతావు
విషాద గేయమై పోతావు.

**డా.డి.వి.జి. శంకరరావు,**
**9440836931.**

## చేధించరానిది...

పలుకడానికి
పెదవే కావాలా
సముద్ర ఘోషకు
పెదవి ఎక్కడిది!
కోకిలకు
ఏ సంగీతం తెలుసు
అనురాగానికి ం
ాగం అవసరమా!
ఎదురుచూపుకు
నిద్దుర ఉంటుందా
నిద్దుర లేని ప్రయత్నం
విజయం దరి చేర్చదా!
శోధించేవాడికి
చేధించరానిది ఉంటుందా!?

**జగ్గయ్య.జి**
**984952580**

## కొండమెట్లు.. ఇదీ (ఒక విజేత) ఆత్మకథ

సి ఆర్ నాయుడు గారి ఆత్మకథ ఇది. వ్రాసింది తానే అయినా రాయడానికిపురికొల్పింది– వారి శ్రీమతి శశికళ. "అలా రాస్తే మన పిల్లలు వాళ్ళ పిల్లలు రాబోయే తరాల వాళ్ళు– వెనుక తరాలను చూసుకొని ఆనందపడతారు కదా! అన్న మాటలే కారణం.అయితే రచయిత ఎంచుకొని ఎరుకపరచిన విషయాలు కేవలం తమ వ్యక్తిగత కుటుంబ విషయాలు మాత్రమే కాదు ప్రస్ఫుటంగా కనబడే ఇతరులకూ ఉపయోగపడేవే. చేరెడ్డి రామచంద్ర నాయుడు అనే పల్లెటూరు పిలగాడు స్వయంకృషితో ఎలా చదువుకుని ఉద్యోగం సంపాదించుకొని దానిని ఎలా నిర్వహించారో, ఇంకా రెండేళ్ల సర్వీస్ ఉండగానే వీఆర్ఎస్ తీసుకొని మందుల పరిశ్రమ లోకి ఎందుకు, ఎలా ప్రవేశించారో, స్టాక్ మార్కెట్లోకి దిగి నాలుగు రాళ్లు వెనకేసుకున్న తీరు, పల్లె జీవితం నుంచి తాను మహానగరంలో నిలదొక్కుకున్న తీరును రాసుకుంటూ పోతే.. అది లికొండ మెట్లులి ఆత్మకథ అయింది. జీవితం అందరికీ వడ్డించిన విస్తరి కాదు. దైవ దర్శనం కావాలంటే ఏడుకొండల మెట్లు ఎక్కి వెళితే అది భక్తి యాత్ర. నిజ జీవిత సోపానం మీద విజేతగా మెట్టు మెట్టును అధిగమిస్తూ పోతే అప్పుడు అందరి దృష్టిని ఆ విజేత జీవన యానం ఆకర్షిస్తుంది. ప్రచార ఆర్భాటం లేకుండా, పారదర్శకంగా నిజాయితీగా ఉద్యోగ జీవితంలోనూ నిజజీవితంలోనూ పాటించిన విలువలు.. ఇతరులకూ ఆదర్శప్రాయం అవుతుంది. అలా తామూ తమ జీవితంలో విజేతలు కావడానికి మార్గదర్శకం అవుతుంది ఈ పుస్తకం.


లికొండమెట్లులి ఆత్మ కథలో తన బాల్యాన్ని, విద్యార్థి దశలో చదువు, అప్పుడే రాజకీయ కార్యక్రమాలు, తనపై గురువుల ప్రభావం, అదే క్రమంలో ఆయన మీద వారి అమ్మానాన్నల ప్రభావమే కాదు తన జీవితంలో రెండవ మలుపు ఐన వివాహం, ఉద్యోగం ఆ తరువాత వ్యాపార నిర్వహణ చివరగా వర్తమానంలో తన జీవన కార్యకలాపాల గురించి సాగిన కథనం ఇది.

చదువుకున్న మహిళ చరిత్రను తిరగరాస్తుందం టారు. అలా శ్రీమతి శశికళ తన భర్త పురోగమంలో నీడలా ఉంటూ కుటుంబ జీవనంలో గృహిణిగా తన బాధ్యతలు సక్ర మంగా నిర్వహిస్తూనే ఆమె కూడా పిల్లల చదువులు శ్రీవారి జీవితంలో అడుగడుగునా తన వంతు సహకారాన్ని అందిస్తూ, ఒక దశలో వ్యాపారంగంలోకి కూడా దిగి కుటుంబ జీవనాన్ని వంటావార్పుకే పరిమితం చేయకుండా శ్రీవారు చేసే మంచి పనులకు కొంత సహాయం చేయడం, కొత్త కొత్త దేశాలు, ప్రదేశాలు తిరుగుతూ లైఫ్ ని సెలబ్రేట్ చేసుకోవడంలో సమన్వయ, సమతూకాన్ని ఎలా పాటించారో కూడా చెప్పకుండా చెప్పినట్లు మనకు అర్థమవుతుంది. ఈ ఆత్మకథ రాయడంలో కూడా ఆమె పరోక్ష పాత్ర ఎలాంటిదంటే, ఎప్పటికప్పుడు న్యూస్ రిపోర్టులు ఫోటోలు కట్ చేసి ఫైల్ చేస్తూ రావడం వల్ల ఇందులో ఎన్నో గడిచిపోయిన విషయాలలోని వాస్తవాలు చోటుచేసుకుని పాఠకులను ఆసక్తితో చదివిస్తాయి. మరీ ముఖ్యంగా చెప్పుకోవాల్సింది– రచయిత భాష, వ్యక్తీకరణ శైలి. ప్రధానంగా ఆయన రచయిత కాకపోయినా సెల్ఫ్ ఎడిటింగ్‌తో సగటు వ్యక్తులకు సాధ్యం కాని, సాంకేతిక విషయాలను పారిభాషిక పదాలను, సంక్షిప్త (యాక్రనిమ్స్)పదాల వివరణ, సరళంగా.. ఏ విషయాన్ని అయినా శుబోధకంగా ఆసక్తికరంగా చదవడానికి ఎంతగానో దోహదపడింది.

కొండ మెట్లు ఆత్మకథలో చదువు పరిశ్రమ కుటుంబం స్టాక్ మార్కెట్ విశ్రాంతి అన్న మెట్లు, అధ్యాయాలుగా ఉన్నాయి. ఎక్కడా అచ్చుతప్పులు లేని 195 పేజీలలో అందమైన ముద్రణ, కొన్ని ముఖ్య ఘట్టాలను మనకు దృశ్యమానం చేసే దాచి పెట్టిన వర్ణచిత్రాల కూర్పుతో రచయితగా కూడా తన ఆత్మ కథను మరో మెట్టు ఎక్కించారు సిఆర్ నాయుడు గారు. (వెల₹150. ఈ పుస్తకం ప్రగతి ప్రింటర్స్ అచ్చువేయ గా నవోదయ బుక్ హౌస్ హైదరాబాదులో దొరుకుతుంది) రచయిత ఈ పుస్తకాన్ని మా 'డైమండ్ శశికళ కి' అంటూ అంకితం చేశారు.

రచయిత 9వ తరగతి చదువుతుండగా తన తల్లిని చికిత్స కోసం చిత్తూరు జిల్లా దామల్ చెరువు సమీపంలోని తమ, కొమ్మేపల్లి గ్రామం నుండి రాయవెల్లూరుకు తీసుకు వెళ్లడంతో ప్రారంభమవుతుంది. చదువురాని తండ్రి, ఆడ దిక్కులేని కుటుంబాన్ని, అక్క మేనమామలు, కృష్ణాపురం తీసుకెళ్లిపోతారు. విద్యార్థి నాయకుడిగా 'సినయ్యవారు' గా తరగతి గదిలోనూ,స్కూలులోనూ పేరు పడ్డారు. భారతంలోని ఆదిపర్వం పుస్తకం చదివి టీకా తాత్పర్యాలు చెబుతుంటే దగ్గర బంధువులు కూడా చేరి వినడానికి కూర్చున్నవారే. నాగలి పట్టి కొంద్ర వేయడంలోనూ, చెరుకుగానుగాడించి బెల్లం తయారు చేయడంలోనూ, తాళ్లు పగ్గాలు పేనడంలోనూ నేర్పరి. బాల్యంలోనే సూక్ష్మ ఏకసంథాగ్రహి కావడం వల్ల,ఒక ఉపాధ్యాయుడి ప్రోత్సాహంతో రాసిన వ్యాసరచన పోటీలో మొదటి స్థానంలో నిలపగా ఆ తెంపు తెగువ తన జీవితాంతం అండగా నిలబడ్డాయి అంటారు రచయిత. చంగల్ రాయుడు అనే టీచర్ 'నీకు ఆ కెపాసిటీ ఉంది, సివిల్స్ రాయమని ఆ దశలోనే టార్గెట్ పెట్టడంతో తనకు గురి కుదిరింది' అని రాస్తారు. మొదటినుండి విద్యార్థి నాయకుడిగా విద్యార్థి రాజకీయాల్లో పాల్గొన్న నాయుడు గారు, పాఠ్య గ్రంథాలనే కాకుండా రిఫరెన్స్ పుస్తకాలు చదవడం వల్ల అవి తన విశ్లేషణా సామర్థ్యాలు పెంచాయని చెబుతారు.

అందుకు గ్రంథాలయంలో ఎక్కువ సమయం అంటిపెట్టుకొని ఉండటం వల్ల అదే ఆయన క్యాం పస్‌లో కేరాఫ్ అడ్రస్ గా మారింది. అప్పట్లో ఎస్వీయూ లోనే డిగ్రీ కోర్సులు ఉండడం చేత బి.ఎ చదువుతూ ఉండగానే ఫైనల్ ఇయర్ లో సివిల్స్ రాస్తే, ఇంటర్వ్యూ దాకా వెళ్లారు. అప్పటికి ఆయనే క్యాంపస్లో అలాంటి విజయం సాధించిన మొదటి వ్యక్తి. 1975లో రెండవ సారి కూడా ఇంటర్వ్యూలో ఫెయిల్ కావడంతోలెక్చరర్ కావాలని సోషియాలజీ లో యం. ఏ. చదివిన ఆయన రెసిడెంట్ ట్యూటర్‌గా ఉద్యోగం చేశారు. అప్పుడు చంద్రబాబు నాయుడు గారు తనకు ఒక సంవత్సరం జూనియర్. అప్పుడే గ్రూప్ వన్ ప్రకటన రావడం, అందులో డీఎస్పి గా ఎంపిక కావడంతో ఈ అధ్యాయం ముగుస్తుంది. ఉద్యోగపర్వంలో పోలీసు శిక్షణ, అది పూర్తయ్యాక గుంటూరు రూరల్ డిఎస్పీగా జాయిన్ అయినప్పుడు, అది వారి పెళ్లయి ఏడవ రోజు.వివిధ పోలీస్ విభాగాల్లో పనిచేస్తున్న సందర్భంలో టైగర్ నాగేశ్వరరావు ఎన్కౌంటర్, తొలినాళ్ల తెలుగు దేశం, చంద్రబాబు తిరుగుబాటు మొదలైన ముఖ్య




ఘట్టాలతో పాటు నాయుడు గారి పెట్ ప్రాజెక్ట్స్ పోలీస్ కళ్యాణ మండపం, పోలీస్ ఆసుపత్రి నిర్మాణం పనులు, 1990లో ఐపీఎస్ కు ప్రమోషన్, కోబాన్ అనే పోలీసు విధానం, (చైల్డ్ అండ్ పోలీస్ ప్రాజెక్టు) (పోలీస్ అండ్ పబ్లిక్ అసోసి యేషన్) హోమ్స్, ఇండియన్ పోలీస్ మెడల్ అప్పటి ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ద్వారా అందుకోవడం, ాజు (స్టూడెం ట్ ట్రాఫిక్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం), జిల్లా స్థాయిలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్స్, డి– అడిక్షన్ సెంటర్స్ నడప డం, ఐజీగా ఉన్నప్పుడు అఖిలభారత పోలీస్ బ్యాండ్ పోటీల ను మొదటి సారిగా రాష్ట్రంలో నిర్వహించడం, ప్రివెంటివ్ డిటెన్షన్ మీద పుస్తకం రాస్తే అది ఏ.పీ పోలీస్ అకాడమీ ప్రచురించడం మొదలైనవి సర్వీస్ ముఖ్య ఘట్టాలు ఈ అధ్యా యంలో ఉన్నా యి. చివరిగా జాయింట్ డైరెక్టర్ జనరల్ గా చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థకు బదిలీ కావడం, ఆ తర్వాత 2007లో 27 నెలల సర్వీస్ ఉండగానే వీఆర్ఎస్ తీసుకో వడంతో ముగుస్తుంది .


పరిశ్రమ అన్న అధ్యాయంలో తాను ఆర్థికంగా ఎదగడం.. "రిచ్ డాడ్– పూర్ డాడ్" పుస్తకం చదివాకే ఉద్యోగం వదిలి వ్యాపార రంగంలోకి వచ్చి త్రికరణశుద్ధిగా తాను అధ్యయనం చేసిన పుస్తకాల సారాన్ని ప్రాక్టికల్‌గా ఆచరణలో పెట్టడం ద్వారా లక్ష రూపాయలు జీతం వచ్చే ఉద్యోగాన్ని వదులుకొని ఐదు లక్షల జీతం పొందే ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్థాయికి ఎదిగిన క్రమం ఉంది. పరిశ్రమలు రియల్ ఎస్టేట్ రంగంలో కన్సల్టెన్సీ సర్వీసులు మ్యాన్ పవర్ మేనేజ్మెంట్ మొదలైన రంగాలలో ఆయన ఆరితేరిన విధానం.. చదువుతూ మధ్యలో పక్కన పెట్టగలిగే సాహసం పాఠకులెవరూ చేయలేరు. ఇలాంటి 'గోల్డెన్ రూల్స్' రహస్యాలు– రిపోర్టుల అధ్యయనం సంబంధిత ప్రముఖమైన పుస్తకాలను చదవడం, వ్యాపారంగంలో "నలుగురితో నారాయణ" అనేలా ఉండడం వెనుక రహస్యాలు ఆయనకూ, మనకు అర్థం అవుతాయి.

కుటుంబం అనేఅధ్యాయంలో తమ ఇద్దరు కుమారులు విదేశీ ఉన్నత విద్యను అభ్యసించి తిరిగి ఇండియాకు వచ్చి స్వరాష్ట్రం అంటే అప్పటి హైదరాబాదులోనే వ్యాపార, స్టాక్ మార్కెట్ రంగంలో అనుభవజ్ఞులుగా రూపాంతరం చెందినవిధం, ఇద్దరు కోడళ్ళు కూడా ఉద్యోగాల్లో కాకుండా వ్యాపార రంగంలోనే తమ నైపుణ్యాలను సాధించిన వారు కావడం.. అలా కుటుంబం మొత్తం ఒక 'బంగారు కుటుంబం' అని మనకు అనిపిస్తుంది.అటుతర్వాత శ్రీమతి అండ్ శ్రీ నాయుడు గార్లది స్టాక్ మార్కెట్ పై అందె వేసిన చేయి కావడం మొదలైన విషయాలు ఉన్నాయి. స్టాక్ మార్కెట్లో నిలదొక్కుకొని లాభాలు కళ్ల చూడాలంటే ఏ విదేశీ పుస్తకాలనో కాకుండా తెలుగు వాళ్ళు, ఈ అధ్యాయాన్ని చదివితే చాలు, అందులో కీలకమైన వజ్రాలలాంటి అనుభవ పూర్వకమైన మాటలు.. ముఖ్యంగా మన దేశ కాలమాన పరిస్థితులకు అనువైనవి– ఏ బిజినెస్ స్కూల్ కు వెళ్లకుండా. వ్యాపార మనస్తత్వం కలవాళ్లకు పెద్దబాలశిక్ష లాంటి అధ్యాయం ఇది. కుటుంబ సభ్యులందరూ కూడా జీవితానికి, వ్యాపార సామర్థ్యాలను పెంచుకునే పుస్తకాలు చదివిన వాళ్లే,. ఇచ్చుపుచ్చుకొని మరీ. అలాంటి వాటిలో–ఇంటలిజెంట్ ఇన్వెస్టర్, థింకింగ్ ఫాస్ట్ అండ్ స్లో, బెస్ట్ వర్డ్స్ ఇన్ బెస్ట్ ఆర్డర్ మొదలైనవి ఉన్నాయి. స్టాక్ మార్కెట్ అనే అధ్యాయంలో కూడా ఆ రంగంలోని ఎగుడు దిగుళ్లు ఎందులో ఎప్పుడు ఎంత ఇన్వెస్ట్ చేయాలో అర్థం అయ్యేలా తమ అనుభవం ద్వారా రచయిత చెప్పారు. ఇందులో కూడా కొన్ని మంచి పుస్తకాలు గురించి వన్ అప్ ఆన్ వాల్ స్ట్రీట్ లాంటివి ఉన్నాయి.అలాగే త్రిబుల్ సి– C C C, HONEY FACTS DIAMOND MUD LESSONS CROWN అనే సంక్షిప్త నామాల పూర్తి వివరణ చదివి స్టాక్ మార్కెట్ పై అవగాహన ఈ ఆత్మ కథ పుస్తకం ద్వారా పొందడం మనకు ఊహించని బహుమతి.

చివరగా లివిశ్రాంతిలి అన్న అధ్యాయంలో తను వీఆర్ఎస్ తీసుకున్నది ఇంట్లో ఖాళీగా కూర్చోవడానికి కాదు, వచ్చిన పనిని నచ్చిన వారితో చేయడం' ప్రపంచంలోని వింతలు వినోదాలు చూడటం, కుటుంబానికి సమాజానికి వీలైనంత మేలు చేయడానికి, దర్జాగా బతకడానికని కుండబద్దలు కొట్టి చెబుతూ 'నిత్యం ఖాళీగా ఉంటూనే అనునిత్యం బిజీగా ఉండదల్చుకొన్నానని చెప్పారు. నిత్య విద్యార్థికి నిత్యము గెలుపే! అని చెప్పడానికి ఉదాహరణ 'గోల్ఫ్ మై వే 'అన్న పుస్తకాన్ని ఆ ఆటలో తాను పరిణతి సాధించడానికి ఉపయోగపడిందని చెబుతూ తన దిన చర్య 'పక్షుల ఆహ్లాదకర సంగీతాలాపనలతో మొదలై, నిద్రపోయే ముందు ఒక పుస్తకం చదవడం లేక హరిప్రసాద్ చౌరసియ ఫ్లూట్ సంగీతాన్ని వింటూ నిద్రలోకి జారిపోవడం' తన అలవాటుగా చెబుతారు. డబ్బుకి నిద్రకూ పొంతన కుదరదని మనం వింటుంటాం. కానీ అది అబద్ధమని, అదెలాగో ఒక్కొక్క మెట్టు ఎక్కి శిఖరారోహణము శిఖర దర్శనము, స్వామి దర్శనము చేసుకున్న వారిని విజయము, విజయలక్ష్మి ఎలా వరిస్తుందో, అలాగే తృప్తితో కూడిన జీవితాన్ని అనుభవించే వారికి నిద్ర దేవత కూడా ఇలా పిలిస్తే అలా కళ్ళపై వచ్చి వాలుతుందని మనకు అర్థమవుతుంది.

**మల్లేశ్వరరావు ఆకుల, 79818 72655**

## పుస్తకాల తోటలో (80) డా: అమ్మిన @ 77298 83223




తెలుగు బాల సాహిత్యం తెలంగాణలో వికసిస్తున్న తీరు తెలుగు రాష్ట్రాలకు ఆదర్శనీయంగా వుంది .సిద్దిపేట కేంద్రంగా నేటి ఆధునిక తెలుగు బాలసాహిత్యం అన్ని ప్రక్రియల్లో విరాజిల్లడం ఆ ప్రాంత వాసులకే కాదు యావత్ తెలుగు బాల సాహితీవేత్తలకు గర్వకారణం.

ఆధునిక బాల సాహితి ద్రోణాచార్యుడు అనడానికి అక్షరాల అర్హతలు గల బాలసాహితీవేత్త భైతి దుర్గం గారి సంపాదకత్వంలో జక్కాపూర్ బడి పిల్లలు రాసిన కవితల సంకలనం మధుర పద్మాలు దీనిలో మొత్తం 74 కవితలు పొందుపరచబడ్డాయి, అన్ని కవితలు సమకాలీన అంశాలే వస్తువులుగా సూచించడం విశేషం ఈ చిన్నారి కవులు అంతా 7,8,9,10, తరగతులు చదివే వారు కావడం మరో విశేషం.

సాధారణంగా రాజులూ రానులు అంటే రాజ్యాలు కోటలు అని మాత్రమే మనకు తెలుసు కానీ నేటి ఆధునిక కాలంలో వీరి విధులను మార్చి సరికొత్త మహారాజు, మహారాణులను, తీర్చిదిద్దింది మట్టే ప్రసన్న తను రాసిన నేనే మహారాణి అనే కవితలో, అలాగే సూర శ్రేయ అనే మరో చిన్నారి పల్లెటూర్లలో ఉండే అందాలు ఆత్మీయతల గురించి ఆనవాళ్లు కవిత లో... అత్యద్భుతంగా స్పృశించింది, మనం ఎంత ఎదిగిన మన మూలాలైన మనం పుట్టిన పల్లెలను ఎప్పుడు మరవద్దు అనే చక్కని సందేశం మనం ఇందులో గమనించవచ్చు.

రైతు యొక్క గొప్పతనాన్ని గొప్ప శక్తి కవితలో చిన్నారి శ్రీనిధి చెబుతూ.... చలికి వణుకుతూ/ ఎండకు ఎండుతూ/, వానకు తడుస్తూ/ , రైతు పడే కష్టం/ మన అందరి కోసమే! కదా /.. అంటూ ఈ దేశానికి గొప్ప శక్తి రైతే అంటుంది, కరికే నితీష్ కుమార్ అనే ప్రకృతి ప్రేమికుడైన బాలకవి పర్యావరణ పరిరక్షణను పుణ్యకార్యంతో పోలుస్తూ... చెట్లు లేని మానవ జీవితం వృధా అంటాడు, ఇదే వర్గానికి చెందిన మరో కవి సాయినాథ్ కాలుష్య రహిత నవ సమాజం ను కోరుకుంటూ... జాతిపిత కల స్వచ్ఛభారత్ నెరవేర్చడమే యువభారత్ జీవిత లక్ష్యం అంటాడు, మనిషి పుట్టుకకు ఆధారమైన అమ్మ గొప్పతనం మన అందరికీ తెలిసిందే...!

కానీ ఈ జక్కాపూర్ బడి పిల్లలు జీవన రథచక్రాలైన అమ్మానాన్నల్లోని నాన్న అవసరాన్ని అందంగా అక్షరీకరించారు, నాన్న అన్న పిలుపు రక్తం పంచి జన్మనిచ్చిన ఒక్క తండ్రికే సొంతం అంటుంది ఏదుల్ల రిష, నాన్నే ప్రత్యేకం కవితలలో నిర్గొండ పూజిత నాన్న అందించే భరోసా గురించి ఓ నాన్న కవితలో చక్కగా విశ్లేషించింది.

మిద్దె సాయి నాన్న పెంపకంలో కఠినత్వం కనిపించినా భవితకు అదే పునాది, అంటాడు మంచి నాన్న కవితలో ... గొడుగు వంశీ అనే మరో బాల కవి జీవిత గమనానికి నాన్నే తొలి అడుగు అంటూ అభివర్ణించాడు తన అనుబంధం కవిత ద్వారా,

ఇలా జక్కాపూర్ బడి పిల్లలు నాన్న అమ్మల గొప్పతనంతో పాటు ఆటలను, జీవన పోరాటాలుగా వర్ణించారు, అతి డబ్బు యావలోని అనర్థాన్ని, సంక్రాంతి, దీపావళి, పండుగలు జరుపుకోవడంలోని ఆనందాలను అందంగా అక్షరీకరించారు.

అదేవిధంగా విద్యాప్రదాతలైన గురువుల గురించి కనిపించే దైవాలుగాను, దేశాభివృద్ధికి ప్రధాన బాధ్యులైన రైతు, జవాన్ల,ను దేశానికి సూర్యచంద్రులుగా అన్వయించారు. అలాగే ప్రజాస్వామ్య ప్రభుత్వాల పరిరక్షణకు అత్యవసరమైన ఓటు దారులైన ఓటర్ల కర్తవ్యాన్ని గుర్తు చేశారు, అలాగే సెల్ ఫోన్ అతి వల్ల అనర్థం గురించి ...పావురం, బడి, బస్సు, డబ్బు, స్నేహం, సైకిల్, యొక్క ఔన్నత్యాలను చక్కని సృజనాత్మకంగా కవిత్వీకరించిన భావి సృజన కారులైన ఈ బాల బాలికలు అందరూ బంగారు రచనా భవిత కలవారు అనిపిస్తుంది ఈ కవితలు చదువుతుంటే...!

చక్కని కవితలు వ్రాసిన చిన్నారులతోపాటు.. వారిని ప్రోత్సహించి ఈ మధురమైన కవన పద్మాలను ఏ ర్చికూర్చిన సంపాదకులు బైతి దుర్గయ్య గారు... సదా అభినందనీయులు.

మధుర పద్మాలు కవితా సంకలనం పేజీలు: 64, వెల:60/– రూ,

## చింత చేను - చింతల చేను ఎలా అయ్యింది?

సుప్రసిద్ధ కథారచయిత ఆర్సీ కృష్ణస్వామి రాజు గారు వ్రాసిన 22వ పుస్తకం 'చింతల చేను'. ఇది ఒక నవల. గ్రామీణ ప్రాంత రైతాంగ సమస్యలను నవలా వస్తువుగా ఎంచుకొని రాజుగారు సాగించిన రచన ఆద్యంతం ఆసక్తిదాయకం. గ్రామ సీమల పొలాల నడుమ పల్లెటూరులో చింత తోపుల వెంబడి, చింత మాకుల మధ్యన పాఠకులను రచయిత నడిపిస్తాడు. సినీ దర్శకుడు సినిమాను విశ్రాంతి సమయం వరకు హాస్యంతో చతురోక్తులతో నడిపించి, అటుపిమ్మట విరామం తర్వాత ప్రేక్షకుల హృదయాలను ద్రవింపజేసినట్లుగా రాజుగారు కూడా తన నవలలో మొదటంతా సరదాగా నడిపిస్తాడు. ఉత్తరార్థంలో 'గుణశేఖరుడి' పాత్రను కష్టాలు, కడగండ్లు, నిరాశ, నిస్పృహ, నిర్వేదం వెంబడి నడిపించి పాఠకుల నయనాలను సజలపూరితం చేస్తాడు.ర్యాపిడో ప్రయాణం, చైనా వరి సేద్యం, పశువులకు ఫలదీకరణ, వివిధ దేశస్తుల మాంసాహారంగా ఎలాంటి జంతువులను తింటారు... లాంటి అంశాలను నవలలో చొప్పించి, ఆధునికత వైపు ప్రపంచం ఎలా పరిగెడుతోందో వివరిస్తాడు.

ట్రాక్టర్ కొనుగోలు కోసం అప్పు ఇచ్చిన సిద్ధిరాజు పాత్రను, పాత సినిమాల్లో విలనిజంను విలక్షణంగా పండించిన నటుడు నాగభూషణం గారితో పోలుస్తాడు. తంజావూరు సుబ్రహ్మణ్యం పొలం దున్నటానికి వెళ్లిన ట్రాక్టర్ పల్టీ కొట్టి రిపేరు బిల్లు 40 వేలు అయితే సుబ్రహ్మణ్యం కేవలం ఐదు వేలు గుణశేఖరుడి చేతిలో పెట్టి వెళ్లిపోతాడు. అప్పుడు చిన్నగా చినుకులు మొదలవుతాయి. 'ట్రాక్టర్ రిపేర్ బిల్లు తడి చింది వాన చినుకులకో లేక గుణశేఖరుడి కన్నీళ్ళత...' అనే వాక్యం రచయిత రచనా శైలిని ఆవిష్కరిస్తుంది.రాశి ఫలాల గురించి ఒకే రాశి వారికి ఒక్కో పత్రికలో ఒక్కో విధంగా రాయడంతోమొదటి వార ఫలం నమ్మాలా, రెండో వార ఫలం నమ్మాలా అని గుణశేఖరుడు సందిగ్ధంలో పడతాడు. 'ఏది ఏమైనా ఆ బ్రహ్మ రాతను ఆ దేవదేవుడు కూడా మార్చలేడు కదా' అని సమాధానపడతాడు.

మాంసం ముక్క కోసం వాసిపోయిన తన బిడ్డ బాలాజీ గాడి కోసం పొట్టేలు కూర అమ్మే పొట్టి చెంగన్న దగ్గరకు వెళితే పాత బాకీ అడుగుతాడని వెనక్కి తిరిగి వచ్చేస్తాడు గుణశేఖరుడు. మాంసం కొనలేని తన దుస్థితిని తలుచుకొని చివరికి కుక్క మాంసం అయితే ఉచితంగా దొరుకుతుందని భావిస్తాడు. 'కొరియా వారు కుక్కలను తింటారు కదా, మనం కూడా తింటే తప్పేంటి?' అని తలపోస్తాడు. ఒక ఇంటి ముందర జరిగే విందుకు వెళ్లి బంతిలో కూర్చున్న గుణశేఖరుడిని పిలవని పేరంటానికి వచ్చిన పరాయి వాడిగా గుర్తిస్తాడు వడ్డించే వ్యక్తి . 'సిగ్గు లేకుండా తినిపోవడానికి వచ్చిన పరమ దరిద్రుడుగా' మాట్లాడి అవమానిస్తే, ఆ మాటలు కొరడాతో కొట్టినట్లు అనిపించి బంతి నుండి లేచిపోతాడు

గుణశేఖరుడు. తన దీనస్థితిని తలుచుకుని కుమిలిపోతాడు. ఈ సన్నివేశంను చదివిన ఎంతటి కర్కోటక మానవుడికైనా కనులు చెమగిల్లక మానవు. ఇలాంటి బాధాకర సన్నివేశాలతో పాటు రచయిత హాస్యాన్ని కూడా ఈ నవలలో చక్కగా వండి వార్చినాడు. ఎల్ఐసి ఏజెంట్ వెంకటముని 'ఏ వయసు వారికి ఎలాంటి పాలసీలు ఉపయుక్తంగా ఉంటాయి?' అని పేర్కొంటూ, ఎవరూ ముందుకు రాకపోతే 'వృద్ధుల తోనైనా, బాలలతో నైనా పాలసీ కట్టండి' అని చతురతతో మాట్లాడిన మాటలు పాఠకుల హృదయాలలో హాస్యపు జల్లులు చిలకరిస్తాయి. చింతల చేను నవల నిండా రచయిత తెలుగుజాతీయాలను, తెలుగు సామెతలను విరివిగా ఉపయోగించి తెలుగు భాషా సౌందర్యాన్ని పాఠకులకు సాక్షాత్కరింపజేసినాడు. రచయిత ప్రతినెల ఏకాదశి రోజున రైతుల సమస్యలను ఏకరువు పెట్టాడు. ఒక ఏకాదశి రోజున కర్నూలు జిల్లాలో ఉల్లికి గిట్టుబాటు ధర లేక కన్నీటి పర్యంతమైన రైతుల వ్యథను వివరిస్తాడు. మరో ఏకాదశి పర్వదినాన కడప జిల్లా కర్షకులు అరటికి ధర లేక ఆర్తనాదాలు పట్టిన వైనాన్ని వర్ణిస్తాడు.

పూలు పండిస్తే బ్రతుకు పూల బాటలా సాగుతుందని భావించిన చిత్తూరు జిల్లా రైతుల చింతలను చిత్రీకరిస్తాడు రచయిత. అనంత పురం జిల్లా వేరుశనగ రైతుల వేదనలను తన నవలలో ప్రస్తావిస్తారు రాజుగారు. ఇక నవల క్లైమాక్స్‌లో గుణశేఖరుడి స్నేహితుడు శ్రీనివాసుల రెడ్డి గారి రెండు ఆవులు పక్కానికి రాని లేత జొన్న గడ్డి తిని మరణించడం, ఆ ఆవు లపై పడి, రెడ్డి గారు హృదయ విదారకంగా విలపిం చడం చూచి గుణశేఖరుడు శోకసంద్రంలో మునిగి పోతాడు.




'దరిద్రుడు చేనికి రాళ్ళవాన' చందాన, తిరుచానూరు వద్ద స్నేహితులిద్దరూ కలసి కొన్న ఇంటి స్థలం కబ్జాకు గురైందని తెలుసుకొని ఇద్దరు హతాశులవుతారు.

ఎట్టకేలకు రచయిత పాఠకులను నిరాశ పరచకుండా చివరగా శుభం కార్డుతో నవలకు భరత వాక్యం పలుకుతాడు. సోషల్ టీచర్ ప్రేరణతో బాలాజీ గాడు చక్కగా ఐఐటీలో చదువుకొని మెకానికల్ ఇంజనీర్ అవుతాడు. తాను కొన్న సిక్స్ సీటర్ మహేంద్ర కారులో తిరుమల బాలాజీ దర్శనానికి బయలుదేరడం, శుక్రవారం స్వామి వారికి జరిగే మేల్ చాట్ వస్త్ర సేవలో కుటుంబ సభ్యుల, శ్రేయో భిలాషుల తోడుగా, ఆలయ మేళతాళాలతో స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించడానికి బయలుదేరడం కొసమెరుపు. తిరుచానూరు ఇంటి స్థలం వివాదాల నుండి బయ టపడి తిరిగి స్వాధీనం కావడం, సిద్ధిరాజుకి అప్పు చెల్లించి ట్రాక్టర్ని ఇంటికి తీసుకురావడం లాంటి ఆనందకర, మంగళకర సన్నివేశాలతో నవలాకారుడు నవలకు ముక్తాయింపు ఇస్తూ, అంతవరకు హృదయ భారంతో నవలను చదివిన పాఠకులను చివరి అంకంలో ఆనంద డోలికలలో ఓలలాడిస్తాడు రచయిత.

రాజుగారు ఒక చేయి తిరిగిన రచయిత కాబట్టి నవల ఎత్తుగడలో, కొనసాగింపులో, ముగింపులో తనదైన శైలిని ప్రదర్శించి పాఠక దేవుళ్లకు చక్కటి నవలను అందించి నవారైనారు.

**'చింతల చేను' నవల, రచన : ఆర్సీ కృష్ణ స్వామి రాజు**
**వెల : 100: పేజీలు :142ప్రతులకు : 939366 2821**

# బిజినెస్

## మహిళా దక్షత సమితి విద్యాసంస్థలు -మహిళా శక్తి వేడుకలు



మహిళా దక్షత సమితి విద్యాసంస్థలు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి వివిధ రంగాల్లో విశేషంగా సేవలందిస్తున్న మహిళా నాయకులను సత్కరించాయి. ముఖ్య అతిథిగా శాంతా సిన్హా పాల్గొని బాలల హక్కులు, విద్య ప్రాధాన్యం గురించి ప్రేరణాత్మకంగా మాట్లాడారు. సరోజ్ తపాడియా, మోనిషా వేమవరపు, పద్మాక్షి నగరాజ్ వంటి ప్రముఖులు తమ అనుభవాలను పంచుకుని విద్యార్థినులను ధైర్యంగా లక్ష్యాలను సాధించమని ప్రోత్సహించారు. మహిళలకు సమాన అవకాశాలు, నాయకత్వం మరియు విద్య ద్వారా సాధికారత కల్పించడం అవసరమని వక్తలు తెలియజేశారు. యువతులు విద్య, విలువలు, ధైర్యంతో సమాజంలో మార్పు తీసుకురాగల నాయకులుగా ఎదగాలని ఈ కార్యక్రమం సందేశం ఇచ్చింది.

## కిమ్స్ బెంగళూరులో రెండు ఆసుపత్రుల ప్రారంభం



కిమ్స్ ఆసుపత్రులు కర్ణాటక రాష్ట్రంలో సేవలను విస్తరించుతూ బెంగళూరులో మహాదేవపుర మరియు ఎలక్ట్రానిక్ నగర ప్రాంతాల్లో రెండు అత్యాధునిక బహుళ ప్రత్యేక వైద్యసేవల ఆసుపత్రులను ప్రారంభించాయి. ఈ కార్యక్రమాన్ని ప్రముఖ సినీనటుడు ఎన్టీఆర్ ప్రారంభించారు. మహాదేవపుర కేంద్రంలో 450కు పైగా పడకలు, ఎలక్ట్రానిక్ నగర కేంద్రంలో 350 పడకలు ఏర్పాటు చేయబడగా, అనేక శస్త్రచికిత్స గదులు మరియు బాహ్య రోగుల చికిత్స గదులు అందుబాటులో ఉన్నాయి. హృదయ, నాడీ, కేన్సర్, శిశు, ఎముకలు, స్త్రీరోగాలు వంటి అనేక వైద్య విభాగాల్లో సమగ్ర వైద్యసేవలు ఇక్కడ అందించబడనున్నాయి. ప్రజలకు సమయానుకూలంగా నాణ్యమైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా ఈ ఆసుపత్రులు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో బెంగళూరులో మరిన్ని మూడు ఆసుపత్రులను ప్రారంభించేందుకు సంస్థ ప్రణాళిక రూపొందించిందని కూడా వెల్లడించారు.

## ఋతు మార్పుల్లో కంటి ఆరోగ్య రక్షణ సూచనలు




ఫిబ్రవరి నుండి మార్చి మధ్య జరిగే ఋతు మార్పుల సమయంలో ఉష్ణోగ్రత, తేమ స్థాయిల మార్పులు, గాలిలో పరాగకణాలు మరియు ధూళి పెరగడం వల్ల కళ్లలో దురద, ఎర్రదనం, మంట, నీరు కారడం, పొడిబారడం వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. ఈ సమయంలో కళ్లను రక్షించేందుకు బయటకు వెళ్లేటప్పుడు రక్షణ కళ్లద్దాలు ధరించడం, చేతులతో కళ్లను రుద్దకుండా ఉండడం, బయట నుంచి వచ్చాక ముఖం మరియు కళ్ల చుట్టుపక్కల శుభ్రంగా కడగడం, కంటి రెప్పల శుభ్రతను పాటించడం, అవసరమైనప్పుడు కంటి తేమను కాపాడే చుక్కలు వాడడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. గాలి, ధూళి, బలమైన కాంతి నుండి కళ్లను దూరంగా ఉంచడం, తగినంత నీరు తాగడం మరియు పోషకాహారం తీసుకోవడం కూడా కంటి ఆరోగ్యాన్ని కాపాడటానికి సహాయపడుతుంది. ఎర్రదనం, నొప్పి, వాపు, చూపు మసకబారడం వంటి లక్షణాలు కొనసాగితే వెంటనే నేత్ర వైద్యుని సంప్రదించడం అవసరం.

## భారత మహిళల్లో కృత్రిమ మేధస్సుపై పెరుగుతున్న నమ్మకం




భారతదేశంలో ఉద్యోగ రంగంలో కృత్రిమ మేధస్సు వినియోగంపై మహిళలు పురుషుల కంటే ఎక్కువ నమ్మకం చూపుతున్నారని లింక్డ్ఇన్ సంస్థ చేసిన పరిశోధన తెలియజేస్తోంది. దేశంలోని ఉద్యోగ మహిళల్లో దాదాపు పది మందిలో తొమ్మిది మంది కృత్రిమ మేధస్సు ఆధారిత సాధనాలను పనిలో ఉపయోగించడంలో విశ్వాసం వ్యక్తం చేయగా, పురుషుల్లో ఈ శాతం కొంత తక్కువగా ఉంది. అలాగే మహిళలు తమ ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుచుకునేందుకు కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడంలో కూడా ముందుండుతున్నారు. వ్యాపార రంగంలో మహిళా వ్యవస్థాపకులు తమ సంస్థల భవిష్యత్ అభివృద్ధిపై అధిక ఆశాభావం వ్యక్తం చేస్తూ, స్వయంచాలక ప్రక్రియలు, సమర్థమైన పనితీరు విధానాలు మరియు సమాచార ఆధారిత నిర్ణయాలను ప్రాధాన్యంగా తీసుకుంటున్నారు. అయితే దేశంలో మహిళల ఉద్యోగ పాల్గొనడం ఇంకా తక్కువగానే ఉన్నందున, మరింత మంది మహిళలకు అవకాశాలు కల్పించడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

## సందేశ సేవలోనే పెట్టుబడి వివరాల వీక్షణ సౌకర్యం

Zerodha Fund House

జెరోధా మ్యూచువల్ ఫండ్ సంస్థ పెట్టుబడిదారులకు మరింత సౌకర్యం కల్పించేందుకు కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ సదుపాయం ద్వారా పెట్టుబడిదారులు తమ మ్యూచువల్ ఫండ్లు మరియు మారకద్రవ్య మార్కెట్‌లో కొనుగోలు చేసే నిధుల వివరాలను ఒకే సందేశ సేవలో సులభంగా చూడగలుగుతారు. ముందుగా ఈ వివరాలను తెలుసుకోవడానికి వేర్వేరు దరఖాస్తు కార్యక్రమాలు లేదా ఖాతాలలో ప్రవేశించాల్సి ఉండేది. ఇప్పుడు ఒకే చోట మొత్తం పెట్టుబడి స్థితిని పరిశీలించడం, అవసరమైతే కొనుగోలు లేదా అమ్మకం చర్యలను కూడా చేయడం సులభమవుతుంది. ఈ విధానం పెట్టుబడి నిర్వహణను సరళంగా మార్చి, పెట్టుబడిదారులు తమ ఆర్థిక ప్రగతిని త్వరగా గమనించేందుకు సహాయపడుతుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

## చెన్నై జట్టుతో గల్ఫ్ భాగస్వామ్యం కొనసాగింపు




గల్ఫ్ ఆయిల్ లూబ్రికెంట్స్ ఇండియా సంస్థ చెన్నై సూపర్ కింగ్స్ క్రికెట్ జట్టుతో ఉన్న దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని మరో నాలుగేళ్ల పాటు కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. గత పదమూడు సీజన్లుగా కొనసాగుతున్న ఈ అనుబంధం దేశంలోని ప్రముఖ ఇరవై ఓవర్ల క్రికెట్ పోటీల చరిత్రలో అత్యంత దీర్ఘకాలిక వ్యాపార భాగస్వామ్యాల్లో ఒకటిగా నిలిచింది. ఈ భాగస్వామ్యం ద్వారా గల్ఫ్ సంస్థ తన ఉత్పత్తుల గుర్తింపును పెంచుకోవడంతో పాటు కోట్లాది క్రికెట్ అభిమానులతో సన్నిహిత సంబంధాన్ని ఏర్పరుచుకుంది. కొత్త ఒప్పందంతో అభిమానులను ఆకట్టుకునే ప్రచార కార్యక్రమాలు, డిజిటల్ కార్యక్రమాలు మరియు అభిమానులతో అనుసంధానాన్ని బలోపేతం చేసే చర్యలను రెండు సంస్థలు కలిసి కొనసాగించనున్నాయి.

# బంగారంపై భారీ డిస్కౌంట్

### దుబాయ్‌లో నిలిచిపోయిన బంగారు షిప్‌మెంట్‌లు

### -ధరలు తగ్గించి అమ్ముతున్న వ్యాపారులు..

ఇరాన్-ఇజ్రాయెల్, యూఎస్ యుద్ధంతో పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.. అయితే, ఇది ప్రపంచ బంగారం మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా ఇరాన్, ఇజ్రాయెల్, యూఎస్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా అనేక దేశాల్లో దిగుమతి-ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడింది.. ఈ పరిస్థితుల ప్రభావం బంగారం వ్యాపారంపై కూడా పడింది. ప్రస్తుతం అనేక బంగారు షిప్‌మెంట్‌లు దుబాయ్‌లో నిలిచిపోయినట్లు అంతర్జాతీయ మీడియా నివేదికలు చెబుతున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వైమానిక ప్రాంతం కొంతకాలం మూసివేయబడటం వల్ల బంగారం రవాణా ఆలస్యం అవుతోంది. దీంతో అనేక ఎగుమతిదారులు తమ బంగారం సరుకులను సమయానికి పంపలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రవాణాలో జాప్యం కారణంగా నిల్వ ఖర్చులు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో నిలిచిపోయిన స్టాక్‌ను త్వరగా క్లియర్ చేయడానికి దుబాయ్ వ్యాపారులు బంగారాన్ని తక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. సమాచారం ప్రకారం, లండన్ బెంచ్‌మార్క్ ధర కంటే ఔన్సుకు సుమారు 30 డాలర్లు తక్కువగా బంగారం అమ్ముతున్నారు. ఇది భారతీయ కరెన్సీ ప్రకారం 10 గ్రాములకు దాదాపు రూ.900 వరకు తగ్గింపుగా భావించవచ్చు. కాగా, ప్రపంచ బంగారం వ్యాపారంలో దుబాయ్ కీలక పాత్ర పోషిస్తుంది. ఆసియా దేశాలకు బంగారం సరఫరా చేసే ప్రధాన కేంద్రంగా ఇది నిలిచింది. ముఖ్యంగా స్విట్జర్లాండ్, యునైటెడ్ కింగ్‌డమ్ మరియు కొన్ని ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే బంగారం ఇక్కడి నుంచి మళ్లీ ఇతర దేశాలకు ఎగుమతి అవుతుంది. అయితే ఇరాన్‌కు సంబంధించిన భద్రతా పరిస్థితులు మరియు గగనతల పరిమితులు ఈ రవాణా వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి.

ఇక, భారత్ విషయానికి వస్తే, దుబాయ్ నుంచి బంగారం దిగుమతి చేసుకునే ప్రధాన దేశాలలో భారత్ ఒకటి. అయితే ప్రస్తుతం దేశంలో తగినంత నిల్వలు ఉన్నందున తక్షణ ప్రభావం కనిపించకపోవచ్చని నిపుణులు చెబుతున్నారు. కానీ, ఈ పరిస్థితి మరికొన్ని నెలలు కొనసాగితే దిగుమతులపై ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు, దేశీయ మార్కెట్‌లో బంగారం మరియు వెండి ధరలు కూడా అధిక స్థాయిలోనే కొనసాగుతున్నాయి. 10 గ్రాముల బంగారం ధర సుమారు రూ.1.62 లక్షల వద్ద ఉండగా, ఒక కిలో వెండి ధర రూ.2.68 లక్షలకుపైగా ఉంది. ప్రస్తుతం ప్రపంచ మార్కెట్‌లో బంగారం ధరలు ఈ సంవత్సరం ప్రారంభం నుంచి దాదాపు 20 శాతం వరకు పెరిగాయి. అయితే డాలర్ బలపడటం మరియు యుద్ధ పరిస్థితుల వల్ల మార్కెట్‌లో కొంత అస్థిరత కొనసాగుతోంది.

సాధారణంగా బంగారాన్ని ప్రయాణికుల విమానాల్లోనే సురక్షితంగా తరలిస్తుంటారు. ప్రస్తుతం యూఏఈ విమానాల



రాకపోకలకు ఆటంకాలు కలగడంతో సౌదీ అరేబియా లేదా ఒమన్ వంటి పొరుగు దేశాల మీదుగా తరలించేందుకు ప్రయత్నిస్తున్నారు. కానీ అంతర్జాతీయంగా బంగారం ధర ఔన్సు 5,100 డాలర్లకు పైగా ఉండటంతో సరిహద్దులు దాటించే సమయంలో భద్రతా పరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో రవాణా సంస్థలు ఈ రిస్క్ తీసుకోవడానికి ఇంట్రెస్ట్ చూపడం లేదు. ప్రస్తుతం భారత్‌లో బంగారానికి గిరాకీ పెరిగింది. జనవరిలో పెద్ద మొత్తంలో దిగుమతులు జరగడం వల్ల ప్రస్తుతం తగినన్ని నిల్వలు అందుబాటులో ఉన్నాయి. దీంతో బంగారం డెలివరీ దుబాయ్ నుంచి ఆలస్యమైనా కూడా పెద్దగా ఇబ్బంది లేదని నిపుణులు చెబుతున్నారు. అయితే ముడి బంగారం సరఫరాలో మాత్రం కొన్ని ఆటంకాలు ఉన్నాయి. యుద్ధం కారణంగా ఇతర ప్రాంతాల నుంచి బంగారం తెప్పించుకోవడానికి రవాణా ఖర్చులు 60-70 శాతం వరకు అదనంగా అవుతున్నట్లు తెలుస్తోంది. అయితే యుద్ధం ముగిసే వరకు ఇలానే ఉంటుంది.



### రూ.20 వేలకే ఏసీ..

## సమ్మర్ సేల్‌లో అదిరిపోయిన ఆఫర్లు

సమ్మర్ రావడంతో ప్రస్తుతం చాలా మంది ఏసీ ల వైపు మొగ్గు చూపుతున్నారు. తప్పకుండా ఇప్పుడు ఏసీ కొనుగోలు చేయాలనుకునే వారికి అమెజాన్‌లో మంచి ఆఫర్లు ఉన్నాయి. సుమారు రూ.50 వేలు ఉండే ఏసీని ఈ సమ్మర్ సేల్‌లో కేవలం రూ.20 వేలకే లభిస్తోంది. దాదాపుగా 50 శాతం భారీ తగ్గింపుతో ఈ సేల్‌లో లభిస్తుంది. అయితే ఇంతకీ ఏ కంపెనీ మోడల్? ఫీచర్లు ఏంటి? పూర్తి వివరాలు తెలుసుకుందాం.

**బెస్ట్ ఫీచర్లతో ఏసీ..**

ఏసీ కొనుగోలు చేయాలనుకునే వారికి లాయిడ్ 0.8 టన్ 3 స్టార్ ఇన్వర్టర్ స్ప్లిట్ బెటర్ ఆప్షన్ అని చెప్పవచ్చు. ఈ ఏసీ అసలు ధర రూ. 47,990 ఉంది. అయితే సమ్మర్ సేల్‌లో భాగంగా అమెజాన్ సుమారు 50 శాతం భారీ తగ్గింపును అందిస్తోంది. బ్యాంక్ ఆఫర్లతో కలిపి దీనిని కేవలం రూ. 22 వేలకే మీరు సొంతం చేసుకోవచ్చు. దీనికి ఉచిత డెలివరీ, ఇన్‌స్టాలేషన్ సౌకర్యం, ఒక ఏడాది ప్రొడక్ట్ వారంటీ, 10 రోజుల రీప్లేస్‌మెంట్ పాలసీ కూడా ఇస్తున్నారు.

ఈ ఏసీలో 6-ఇన్-1 కన్వర్టిబుల్ ఫీచర్ ఉంది. దీని ద్వారా వినియోగదారులు తమ అవసరాన్ని బట్టి కూలింగ్ స్థాయిని 30% నుంచి 110% వరకు మార్చుకోవచ్చు. సుమారు 90 చదరపు అడుగుల వరకు ఉండే గదులకు ఇది సరిగ్గా సరిపోతుంది. ఇందులోని ఇన్వర్టర్ కంప్రెసర్ గది ఉష్ణోగ్రతను బట్టి తన వేగాన్ని ఆటోమేటిక్‌గా సర్దుబాటు చేసుకుంటుంది. దీనివల్ల గది త్వరగా చల్లబడుతుంది. అలాగే కరెంట్ బిల్లు కూడా తక్కువగా వస్తుంది. ఈ ఏసీ గోల్డెన్ ఫిన్ కాపర్ కాయిల్స్ వాడటం వల్ల వేడిని వేగంగా బయటకు పంపుతుంది. దీంతో ఏసీ మన్నికగా ఎక్కువ కాలం వస్తుంది. అలాగే ఇందులో అత్యాధునిక ఎయిర్ ప్యూరిఫికేషన్ వ్యవస్థ కూడా ఉంది. ఇందులోని యాంటీ-వైరల్, పిఎం 2.5 ఫిల్టర్లు గాలిలోని దుమ్ము, బ్యాక్టీరియా, వైరస్‌లను తొలగించి స్వచ్ఛమైన గాలిని అందిస్తాయి. అంతేకాకుండా దీనికి ప్రత్యేకంగా స్టెబిలైజర్ అవసరం లేదు. అలాగే 140వి నుంచి 280వి వరకు ఉండే వోల్టేజ్ హెచ్చుతగ్గులను ఇది సులభంగా తట్టుకోగలదు. హిడెన్ ఎల్ఈడి డిస్‌ప్లే, తక్కువ గ్యాస్ ఉన్నప్పుడు గుర్తించే సెన్సార్లు, టర్బో కూల్ మోడ్ వంటి స్మార్ట్ ఫీచర్లు ఇందులో ఉన్నాయి. -

బయట ఉష్ణోగ్రత 52ºజ ఉన్నా కూడా గదిని చల్లగా ఉంచగల సామర్థ్యం ఈ ఏసీకి ఉంది. ఇందులోని 4-వే స్వింగ్ ఫీచర్ గాలిని గదిలోని అన్ని మూలలకు సమానంగా పంపిస్తుంది. ఇన్‌స్టాలేషన్ సమయంలోనే 15 రకాల డయాగ్నొస్టిక్ పరీక్షలు నిర్వహించి ఏసీ సరిగ్గా పనిచేస్తుందో లేదో చెక్ చేస్తారు. అయితే ఇది ఏడాదికి సుమారు 549.06 యూనిట్ల విద్యుత్‌ను మాత్రమే వినియోగిస్తుంది. పనిచేస్తున్నప్పుడు కేవలం 32 డిబి శబ్దంతో చాలా నిశ్శబ్దంగా ఉంటుంది. హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ కార్డులతో కొనుగోలు చేస్తే 10 శాతం వరకు అదనపు తగ్గింపు లభిస్తుంది. పాత ఏసీని ఎక్స్‌ఛేంజ్ చేయడం ద్వారా రూ. 3,650 వరకు తగ్గించుకోవచ్చు. ఇలా మీరు రూ.22 వేలకే బెస్ట్ ఫీచర్లుతో ఉండే ఈ ఏసీని కొనుగోలు చేయవచ్చు. అలాగే ఈఎంఐ ఆప్షన్ కూడా ఉంది. ఒక్కసారి కొనుగోలు చేయలేని వారు ఈఎంఐని ఎంచుకోవచ్చు.

## మీషోకు ఆదాయ పన్ను శాఖ నోటీసులు..

### రూ.1500 కోట్ల చెల్లింపుపై వివాదం

ప్రముఖ ఈకామర్స్ సంస్థ మీషోకు ఆదాయ పన్ను శాఖ భారీ నోటీసులు జారీ చేసింది. 2023--24 మదింపు సంవత్సరానికి సంబంధించిన పన్నుల విషయమై సుమారు రూ.1500 కోట్లు చెల్లించాలని శాఖ ఆదేశించింది. వడ్డీలతో కలిపి ఈ మొత్తాన్ని చెల్లించాలని డిమాండ్ నోటీసులో పేర్కొన్నారు. ఈ పరిణామం కంపెనీపై ఆర్థికంగా పెద్ద ఒత్తిడిని కలిగించే అంశంగా మారింది. అయితే ఈ నోటీసులపై మీషో అధికారికంగా స్పందిస్తూ తమ వ్యాపార కార్యకలాపాలు అన్ని చట్టపరమైన నిబంధనల ప్రకారమే జరిగాయని స్పష్టం చేసింది.

కంపెనీ తెలిపిన వివరాల ప్రకారం, ఆదాయ పన్ను శాఖ చేసిన ఈ డిమాండ్లతో తాము ఏకీభవించడం లేదని వెల్లడించింది. పన్ను చెల్లింపులు, లావాదేవీలు అన్నీ సంబంధిత నిబంధనలకు అనుగుణంగానే ఉన్నాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో నోటీసులను చట్టపరంగా సవాలు చేయాలని నిర్ణయించినట్లు కంపెనీ తెలిపింది. కంపెనీ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని కూడా వెల్లడించింది.

ఈ విషయాన్ని కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలకు కూడా తెలియజేసింది. ఆదాయ పన్ను శాఖ నోటీసులు వచ్చినప్పటికీ, కంపెనీ ఆర్థిక కార్యకలాపాలు లేదా రోజువారీ వ్యాపార నిర్వహణపై పెద్దగా ప్రభావం ఉండదని మీషో పేర్కొంది. పెట్టుబడిదారుల నమ్మకాన్ని నిలబెట్టుకునే దిశగా సంస్థ తమ కార్యకలాపాలను యథావిధిగా కొనసాగిస్తామని స్పష్టం చేసింది.

ఇదిలా ఉండగా గతంలో కూడా 2022--23 మదింపు సంవత్సరానికి సంబంధించి మీషోకు ఆదాయ పన్ను శాఖ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆ కేసు ప్రస్తుతం కర్ణాటక హైకోర్టులో పెండింగులో ఉండగా, కోర్టు మధ్యంతర స్టే ఇచ్చింది. మరోవైపు ఆర్థిక ఫలితాల పరంగా చూస్తే డిసెంబర్ త్రైమాసికంలో కంపెనీ రూ.491 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. ఇది గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే సుమారు 12 శాతం పెరిగింది. అయితే కంపెనీ ఆదాయం మాత్రం 32 శాతం వృద్ధి చెంది రూ.3,517.6 కోట్లకు చేరింది.

## జియో ఐపీఓ లిస్టింగ్ ఆలస్యం.. నిబంధనల జాప్యం

Jio TRUE 5G

రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) డిజిటల్ సేవల కంపెనీ జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్‌ను పబ్లిక్ ఇష్యూకు తీసుకు రావడానికి సిద్ధమైనప్పటికీ, స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్ నిబంధనల సవరణలు ఇంకా అధికారిక గెజిట్ నోటిఫికేషన్ రూపంలో రాలేదనే కారణంతో ఈ ప్రక్రియ ఆలస్యమవుతోంది. గతేడాది ఆగస్టులో ఆర్ఐఎల్ చైర్మన్ ముకేశ్ అంబానీ 2026 తొలి అర్థభాగంలో జియోను లిస్టింగ్ చేసేందుకు లక్ష్యంగా పెట్టారని ప్రకటించారు. అయితే, సవరణలు ఇంకా అధికారికంగా ఆమోదం పొందకపోవడం వల్ల ఐపీఓకు తగిన వంతు సమయం లభించడం ఆలస్యమవుతోంది.

సెబీ గత సెప్టెంబరులో పబ్లిక్ ఇష్యూకు సంబంధించి నిబంధనలలో మార్పులు తీసుకురావాలని నిర్ణయించింది. మార్కెట్ విలువ రూ.5 లక్షల కోట్లను మించేటట్లయితే, ఐపీఓలో కంపెనీ 2.5% వాటాను మాత్రమే విక్రయించగలిగే అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. ఈ కొత్త సవరణకు ప్రభుత్వం నుండి తుది అనుమతులు ఇప్పటివరకు రాలేదు. కాబట్టి, ఆర్థిక శాఖ గెజిట్ ద్వారా అధికారిక ప్రకటనను చేయాల్సి ఉంది. నిబంధన సవరణ పూర్తి అయ్యాకే జియో ఐపీఓ కార్యరూపంలోకి వెళ్లగలదని నిపుణులు చెబుతున్నారు.

జియో ఐపీఓ దేశంలో అత్యంత పెద్ద పబ్లిక్ ఇష్యూలలో ఒకటిగా ఉండే అవకాశం ఉంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ గ్రూప్ నుంచి సుమారు 20 ఏళ్ల తర్వాత ఈ ఐపీఓ రాబోతోంది. కంపెనీ విలువను ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లు 170 బిలియన్ డాలర్లు (సుమారు రూ.15.50 లక్షల కోట్లు)గా అంచనా వేస్తున్నారు. ఐపీఓలో 2.5% వాటా విక్రయించినా సుమారు 4.3 బిలియన్ డాలర్లు (సుమారు రూ.40,000 కోట్లు) సమీకరించగలమని అంచనా ఉంది. ఈ భారీ ఐపీఓ దేశీయ మరియు అంతర్జాతీయ ఇన్వెస్టర్లలో తీవ్రమైన ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే, నిబంధనల పూర్తి సవరణ రాకపోవడం కారణంగా ఈ ప్రక్రియకు ఇంకా కొంత సమయం పట్టే అవకాశం ఉంది.

## ఎయిర్ ఇండియా 78 అదనపు విమానాలు ఆరంభం

మార్చి 10 నుండి 18 వరకు, ఎయిర్ ఇండియా 9 అంతర్జాతీయ మార్గాల్లో 78 అదనపు విమానాలను నడపనుందని ఎయిర్ ఇండియా ప్రకటించింది. ఈ నిర్ణయం మధ్యప్రాచ్య విభేదాల కారణంగా ఏర్పడిన అంతరాయాలను తగ్గించడం మరియు ప్రయాణికులకు మరిన్ని ఎంపికలు ఇవ్వడం కోసం తీసుకోవడం జరిగింది. అదనపు విమానాలు ప్రధానంగా ఢిల్లీ నుండి న్యూయార్క్, లండన్, ఫ్రాంక్‌ఫర్ట్, ఆమ్‌స్టర్‌డామ్, జ్యూరిచ్, పారిస్, కొలంబో మరియు మాలేకి సేవలను అందిస్తాయి. అదనంగా, ముంబై నుండి లండన్ మార్గంలో కూడా ప్రత్యేక సేవలను అందిస్తారు. న్యూయార్క్, మాలే మరియు కొలంబోకు మాత్రమే కాకుండా, ఇతర అంతర్జాతీయ రూట్లకు బి787-8 విమానాలను ఉపయోగించి సేవలు నడుపుతారు. మాలే మరియు కొలంబోకి ూ320అవశీ విమానాలు, న్యూయార్క్ కోసం బి777-300ఈఆర్ విమానాలను ఉపయోగించడానికి నియంత్రణ ఆమోదాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. ఎయిర్ ఇండియా ప్రకారం, ఈ అదనపు సేవలు యూరప్ మరియు ఉత్తర అమెరికా రూట్లలో షెడ్యూల్ చేసిన సేవలను కొనసాగించడంలో సహాయపడతాయి. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సురక్షితమైన కనెక్టివిటీని అందించడం ద్వారా, వివిధ అంతర్జాతీయ గేట్‌వేలకు ప్రయాణికులు సులభంగా చేరుకోవచ్చు. టాటా గ్రూప్ యాజమాన్యంలోని క్యారియర్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ నిపున్ అగర్వాల్ మాట్లాడుతూ, "ప్రయాణికులు ఈ అదనపు ఎంపికలను మరియు ఎయిర్ ఇండియా అందిస్తున్న విశ్వసనీయతను గౌరవిస్తారని మేము ఆశిస్తున్నాము" అని తెలిపారు. ఈ ప్రకటన ఎయిర్ ఇండియాకు వ్యూహాత్మకంగా ఉన్న ప్రయత్నాలను వివరించింది. ఫిబ్రవరి 28 నాటి ఇరాన్‌లో ఉమ్మడి దాడుల తర్వాత, ఇరాన్, యునైటెడ్ స్టేట్స్ మరియు ఇజ్రాయెల్ మధ్య సైనిక శత్రుత్వం కొనసాగుతోంది. టెహ్రాన్ గల్ఫ్ ప్రాంతాల్లోని




యుఎస్ మరియు ఇజ్రాయెల్ స్థావరాలపై దాడులు ప్రారంభించడంతో, పరిస్థితి మరింత విస్తరించింది. ఈ మధ్యప్రాచ్య ఉద్రిక్త పరిస్థితుల కారణంగా, 10 మిలియన్లకు పైగా భారతీయులు ఈ ప్రాంతంలో ఉన్నారని, ఇప్పటికే 52,000 మంది భారతీయులు దేశానికి తిరిగి వచ్చారని ప్రభుత్వ సమాచారం వెల్లడించింది.

## మహిళల పెట్టుబడులు 10 ఏళ్లలో జీడీపీకి 40 లక్షల కోట్లు



దీర్ఘకాలిక ఆర్థిక పెట్టుబడుల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగడం వల్ల రాబోయే 10 ఏళ్లలో భారత జీడీపీకి సుమారు రూ.40 లక్షల కోట్లను జతచేయగలిగిన అవకాశముంది. నిరుపయోగంగా ఉన్న మహిళల పొదుపు మొత్తాలను ఉత్పాదకత ఆధారిత, వృద్ధి ఆధారిత పెట్టుబడుల వైపు మళ్లిస్తే ఈ ప్రభావం సాధ్యమవుతుందని ఎల్ఎక్స్ఎంఈ మరియు ఈవై సంయుక్తంగా రూపొందించిన నివేదిక తెలిపింది.

నివేదిక ప్రకారం, అందరికీ ఆర్థిక సేవలను అందించడం విషయంపై మహిళలు ఇంకా దూరంగా ఉన్నారు. 2011లో మహిళల బ్యాంక్ ఖాతాలు 26 శాతమేరుకు మాత్రమే ఉండగా, 2024లో ఇవి 89 శాతానికి పెరిగాయి.

అయితే, ఈ ఖాతాలను మహిళలు ఎక్కువగా ప్రభుత్వ పథకాల నగదు బదిలీ, ఉపసంహరణల కోసం ఉపయోగిస్తున్నారు, పొదుపు కోసం తక్కువ వాడుతున్నారు. పదవీ విరమణానంతర సొమ్ము విషయంలోనూ పురుషులు, మహిళల మధ్య వ్యత్యాసం 40 శాతంగా ఉంది,

అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ వ్యత్యాసం 26 శాతమే. వృద్ధి ఆధారిత ఆర్థిక పథకాలలో మహిళల ప్రాతినిధ్యం పరిమితంగా ఉందని నివేదిక గుర్తించింది. మ్యూచువల్ ఫండ్ ఖాతాల్లో మహిళల వాటా 25 శాతం మాత్రమే, వ్యక్తిగత రుణ గ్రహీతల్లో 22 శాతం మాత్రమే, మరియు మొత్తం రుణాల విలువలో మహిళలకు ఇచ్చిన వాటా కేవలం 16 శాతం మాత్రమే. డిజిటల్ పరికరాల వినియోగంలోనూ పురుషులు, మహిళల మధ్య వ్యత్యాసం ఎక్కువ ఉంది.

స్మార్ట్‌ఫోన్లలో 36 శాతం మంది మహిళలు, 58 శాతం మంది పురుషులు మాత్రమే ఉపయోగిస్తున్నారు. సుమారు 60 శాతం మహిళలు కుటుంబ సభ్యుల ఫోన్లపై ఆధారపడుతున్నారు. దీని వల్ల మహిళలు స్వతంత్ర ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడంలో పరిమితులు ఎదుర్కొంటున్నారు.

ఫండింగ్ రౌండ్ల సంఖ్య 580 నుంచి 407కి తగ్గినా, మధ్యస్థాయి ఒప్పందాల సగటు పరిమాణం 2.4 మిలియన్ డాలర్ల నుండి 3.8 మిలియన్ డాలర్లకు పెరిగింది.

# సామాన్యులపై మరో పిడుగు..

### గ్యాస్ సిలిండర్ బాటలో వంట నూనె ధరలు..



ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం ఎఫెక్ట్ సామాన్యులపై పడింది. నిత్యావసర సురుకులు, వస్తువుల ధరలు పెరుగుతున్నాయి. ఇప్పటికే వంట గ్యాస్ సిలిండర్ ధరలు శనివారం పెరిగిన విషయం తెలిసిందే. సిలిండర్‌పై రూ.60 మేర పెరిగింది. ఇప్పుడు అదే బాటలో వంట నూనె ధరలు కూడా వెళ్తున్నాయి. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలపై పడుతోంది. సరుకు రవాణాకు అంతరాయం కలగడంతో ఎగుమతులు, దిగుమతులకు ఆటంకం కలుగుతుంది. దీని వల్ల పలు వస్తువుల ధరలు పెరుగుతున్నాయి. ఇక భారత్‌పై కూడా యుద్ధ ప్రభావం పడుతోంది. దేశంలో అనేక వస్తువుల ధరలు ఒక్కసారిగా పెరుగుతున్నాయి. ఇప్పటికే వంట గ్యాస్ ధరలు పెరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వంట గ్యాస్ బాటలో వంట నూనె ధరలు కూడా పెరిగి సామాన్యులకు మరో షాకిచ్చాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ కలిసి దాడులు చేపట్టడం, ప్రతీకార చర్యల్లో భాగంగా గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ క్షిపణులతో దాడులు చేపట్టడంతో పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్తకర పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పశ్చిమాసియా నుంచి భారత్‌కు దిగుమతి కావాల్సిన సరుకు రవాణాలో సమస్యలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో వంట గ్యాస్ ధరలు పెరగ్గా.. వంట నూనె ధరలు కూడా భారీగా పెరుగుతున్నాయి. సన్‌ఫ్లవర్ నుంచి పామాయిల్ వరకు అన్నీ ధరలు గణనీయంగా పెరిగాయి. గత 10 రోజుల క్రితం లీటర్ సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.150గా ఉండగా.. ఆదివారం నాటికి రూ.170కి చేరుకుంది. వారం రోజుల్లోనే రూ.20 మేర పెరిగింది. ఇక పామాయిల్ ధరలు కూడా అమాంతం పెరిగాయి. వీటి ధరలు లీటర్‌కు రూ.15 నుంచి రూ.20కి పెరిగాయి. భారత్ వంట నూనెలను ఎక్కువగా విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. యుద్ధం వల్ల ప్రపంచ సరుకు రవాణా వ్యవస్థ దెబ్బతినడం వల్ల ధరలపై ప్రభావం పడుతుంది. అయితే ధరలు పెరుగుతుండటంతో వినియోగదారులు వంట నూనెలను ముందుగానే కొనుగోలు చేసి స్టాక్ పెట్టుకుంటున్నారు. వంట నూనెకు డిమాండ్ బాగా పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ధరలు మరింత పెరుగుతాయనే ఆందోళనతో ప్రజలు ఒకేసారి పెద్ద మొత్తంలో టిన్‌లు, ప్యాకెట్లు కొనుగోలు చేస్తున్నారు. దీంతో సరఫరా తక్కువగా ఉండటం, డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ధరలు పెరుగుతున్నాయని అంటున్నారు. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశముందని అంటున్నారు.

## సైనిక కుటుంబ మహిళలకు వ్యాపార అవకాశాల విస్తరణ





అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అమెజాన్ ఇండియా సంస్థ సైనిక కుటుంబాలకు చెందిన మహిళలకు వ్యాపార అవకాశాలను విస్తరించేందుకు ఆర్మీ మహిళా సంక్షేమ సంఘంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యంతో సంఘంలో నమోదైన వందలాది మహిళా పారిశ్రామికవేత్తలు 2029 నాటికి అమెజాన్ ఆన్‌లైన్ వేదిక ద్వారా తమ వ్యాపారాలను ప్రారంభించి విస్తరించుకునే అవకాశం పొందుతారు. అమెజాన్ సహేలి కార్యక్రమం ద్వారా వారికి దేశవ్యాప్తంగా వినియోగదారులను చేరుకునే అవకాశం కల్పించడంతో పాటు వ్యాపార నమోదు, సరుకుల నిర్వహణ, ఉత్పత్తుల చిత్రీకరణ, వివరాల తయారీ మరియు విక్రయాలపై ప్రత్యేక శిక్షణ, మార్గదర్శకత్వం అందించనున్నారు. ఈ సహకారం ద్వారా సైనిక కుటుంబాలకు చెందిన మహిళలు స్థిరమైన ఆదాయ మార్గాలను ఏర్పరుచుకుని స్వయం ఉపాధిలో ముందుకు సాగేందుకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. వ్యాపారాలకు అవసరమైన మార్కెట్లను అందుబాటులోకి తీసుకురావడానికి మరియు ఆన్‌లైన్‌లో స్థిరమైన వ్యాపారాలను నిర్మించుకోవడానికి అవసరమైన మద్దతు ఇవ్వడానికి అమెజాన్ కట్టుబడి ఉంది. ఈ సహకారం ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలు అమెజాన్ వేదికను ఉపయోగించుకోవచ్చు. మరియు క్రమబద్ధమైన శిక్షణ, మార్గదర్శకత్వంతో తమ వ్యాపారాలను స్థాపించి వృద్ధి చేసుకోవడానికి ఇది దోహదపడుతుంది" అని వివరించారు.

## స్థిరంగా వెండి, బంగారం ధరలు..



అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ కారణాల నేపథ్యంలో ఇటీవల భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు ఆ తర్వాత స్థిరీకరణకు గురవుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల కారణంగా పెరిగిన ధరలు ప్రస్తుతం స్థిరంగా కొనసాగుతున్నాయి మార్చి 8న 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,63,640 దగ్గర ఉంది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,50,000 దగ్గర ఉంది. ఇక, దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ.1,63,800కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ.1,50,150కి చేరుకుంది. మరోవైపు వెండి ధర కూడా స్థిరంగా కొనసాగుతోంది. మూడు లక్షల రూపాయల మార్క్ దిగువకు వచ్చేసింది. ఈ నేపథ్యంలో ఈ రోజు పలు నగరాల్లో బంగారం, వెండి రేట్లు ఎలా ఉన్నాయో పరిశీలిద్దాం..దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు (10 గ్రాములకు) (24 క్యారెట్, 22 క్యారెట్)హైదరాబాద్‌లో రూ.1,63,640, రూ.1,50,000విజయవాడలో రూ.1,63,640, రూ.1,50,000ఢిల్లీలో రూ.1,63,800, రూ.1,50,150ముంబైలో రూ.1,63,640, రూ.1,50,000వడోదరలో రూ.1,63,700, రూ.1,50,050కోల్‌కతాలో రూ.1,63,640, రూ.1,50,000చెన్నైలో రూ.1,63,640, రూ.1,50,000బెంగళూరులో రూ.1,63,640, రూ.1,50,000కేరళలో రూ.1,63,640, రూ.1,50,000పుణెలో రూ.1,63,640, రూ.1,50,000.ప్రధాన నగరాల్లో వెండి ధరలు (కేజీకి)హైదరాబాద్‌లో రూ.2,90,000విజయవాడలో రూ.2,90,000ఢిల్లీలో రూ.2,85,000చెన్నైలో రూ.2,90,000కోల్‌కతాలో రూ.2,85,000కేరళలో రూ.2,90,000ముంబైలో రూ.2,85,000బెంగళూరులో రూ.2,85,000వడోదరలో రూ.2,85,000అహ్మదాబాద్‌లో రూ.2,85,000

## ఫ్లిప్‌కార్ట్‌లో లేఆఫ్.. వందలాది ఉద్యోగాలు ఖతం..




వరసగా టెక్ కంపెనీలు ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్నాయి. ఏఐ విస్తరిస్తుండటంతో కంపెనీలు దీనిపై పెట్టుబడులు పెడుతున్నాయి. ఏఐ ద్వారా ఉద్యోగుల్ని రీప్లేస్ చేసే పనిలో ఉన్నాయి. మరోవైపు, ఖర్చులు తగ్గించుకుని లాభాలు పెంచుకునే ప్రయత్నంలో సంస్థలు ఉన్నాయి. ఇప్పుడు "ఫ్లిప్‌కార్ట్" కూడా తన ఉద్యోగుల్ని తొలగించింది. వార్షిక పనితీరు సమీక్ష ఆధారంగా వందలాది మంది ఉద్యోగుల్ని తొలగించినట్లు వార్తలు వస్తున్నాయి. నివేదికల ప్రకారం కంపెనీ వర్క్‌ఫోర్స్‌లో 3 నుంచి 4 శాతం మందిని తొలగించనున్నారు. సుమారుగా 300 నుంచి 500 మంది ఉద్యోగులు కంపెనీ వదిలిపెట్టాల్సి వచ్చింది. ఇది సాధారణ పర్ఫామెన్స్ ఎవాల్యుయేషన్‌లో భాగమే అని చెబుతోంది. పనితీరు తక్కువగా ఉన్న ఉద్యోగులు, లో-రేటింగ్ పొందిన వారు ఉద్యోగాలు కోల్పోయారు. ప్రధానంగా ఫ్లిప్‌కార్ట్ కోర్ ఆపరేషన్‌లో లేఆఫ్స్ ప్రభావం ఎక్కువగా ఉంది. గతంలో 2024లో అప్రైజల్ సైకిల్‌లో కూడా సుమారు 1000 మంది ఉద్యోగుల్ని తొలగించింది. టెక్, స్టార్టప్ కంపెనీలు ఖర్చులు తగ్గించుకోవడం, లాభాలపై దృష్టిపెట్టడంతో ఉద్యోగాలు పోతున్నాయి. లిప్‌కార్ట్ త్వరలో స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అవ్వడానికి (ఖూూ) సిద్ధమవుతోంది. ఇది కూడా ఒక కారణంగా ఉంది.

## విద్యుత్తు కార్ల అమ్మకాలు 44 శాతం పెరిగాయ్: ఫాడా



దేశంలో విద్యుత్తు ప్రయాణికుల వాహనాల (కార్ల) రిటెయిల్ విక్రయాలు గత నెలలో 13,733కు చేరాయని వాహన డీలర్ల సమాఖ్య ఫాడా తెలిపింది. 2025 ఫిబ్రవరిలో అమ్ముడైన 9,505 వాహనాలతో పోలిస్తే, ఈ సంఖ్య 44% అధికం. దేశంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నమోదైన వాహనాల సమాచారం ఆధారంగా ఈ వివరాలను ఫాడా తెలిపింది. టాటా మోటార్స్ విక్రయాలు 4,020 నుంచి 38.5% పెరిగి 5,568కి చేరాయి. జేఎస్‌డబ్ల్యూ ఎంజీమోటార్ ఇండియా అమ్మకాలు 3,490 నుంచి 5% తగ్గి 3,312కు పరిమితమయ్యాయి. మహీంద్రా విక్రయాలు 508 నుంచి 2,913కు, విన్‌ఫాస్ట్ అమ్మకాలు 384కు, బీవైడీ ఇండియా విక్రయాలు 306కు చేరాయి. విద్యుత్తు ద్విచక్ర వాహనాలు ఈ ఏడాది ఫిబ్రవరిలో 1,11,709 అమ్ముడయ్యాయి. 2025 ఫిబ్రవరిలో విక్రయమైన 76,722 వాహనాల కంటే ఇవి 46% అధికం. టీవీఎస్ మోటార్ అమ్మకాలు 18,955 నుంచి 67% దూసుకెళ్లి 31,614కు చేరాయి. బజాజ్ ఆటో 25,328, ఏథర్ ఎనర్జీ 20,584, హీరో మోటోకార్ప్ 12,514, గ్రీవ్స్ ఎలక్ట్రిక్ 4,724 వాహనాలు విక్రయించాయి. ఓలా ఎలక్ట్రిక్ అమ్మకాలు 8,675 నుంచి 54% తగ్గి 3,968కు పరిమితమయ్యాయి. ఓలా ఎలక్ట్రిక్ అమ్మకాలు 8,675 నుంచి 54% తగ్గి 3,968కు పరిమితమయ్యాయి. ఈ గణాంకాలు దేశంలో విద్యుత్తు వాహనాల ప్రాముఖ్యత మరియు పెరుగుతున్న డిమాండ్‌ను స్పష్టం చేస్తున్నాయి. వాహన రంగంలో విద్యుత్తు కార్ల మరియు ద్విచక్ర వాహనాల విభాగంలో కొనసాగుతున్న పెరుగుదల, శుభ్రమైన, వాతావరణ హితమైన వాహనాలపై వినియోగదారుల ఆసక్తి పెరుగుతున్నట్లు సూచిస్తుంది. వినియోగదారులు తక్కువ ఇంధన ఖర్చు, తక్కువ ఉద్గారాలు, మరియు స్థిరమైన నిర్వహణతో విద్యుత్తు వాహనాలను ఎంపిక చేస్తున్నారు. మెగా నగరాల్లో మరియు మిడ్‌సైజ్ పట్టణాల్లో విద్యుత్తు వాహనాల మోషన్ మరింతగా పెరుగుతోంది. విద్యుత్తు ద్విచక్ర వాహనాల కోసం షార్ట్-డిస్టెన్స్, డెలివరీ సర్వీసులు, మరియు మైక్రో-మొబిలిటీ అవసరాలు ప్రధానంగా ఆధారపడుతున్నాయి. టాటా మోటార్స్, మహీంద్రా, జేఎస్‌డబ్ల్యూ వంటి పెద్ద బ్రాండ్లు మార్కెట్ షేర్ పెంచుతున్నాయి. ఏథర్ ఎనర్జీ, గ్రీవ్స్ ఎలక్ట్రిక్, ఓలా ఎలక్ట్రిక్ వంటి నూతన కంపెనీలు వినియోగదారులకు నూతన మోడల్స్, ఫీచర్లు, స్మార్ట్ కనెక్టివిటీని అందిస్తున్నాయి. ఇది కఠినమైన పోటీకి దారితీస్తూ, వినియోగదారులకు విస్తృత ఎంపికల్ని అందిస్తోంది.




# ఇరాన్ దెబ్బకు గల్ఫ్ దేశాలు అతలాకుతలం..

### సంచలన నిర్ణయం దిశగా అడుగులు..! -అమెరికా స్థావరాలపై ఇరాన్ నిర్విరామంగా దాడులు -ఆయిల్ ఎగుమతులు నిలిచిపోవడం తగ్గుతున్న ఆదాయం




న్యూఢిల్లీః ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న భీకర యుద్ధం రోజురోజుకి తీవ్రతరం అవుతోంది. అమెరికా కూడా ఈ యుద్ధంలో పాల్గొని ఇరాన్‌పై దాడులతో విరుచుకుపడుతుండగా.. పశ్చిమాసియా దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ క్షిపణులతో విజృంభిస్తోంది. ఈ క్రమంలో పశ్చిమాసియా దేశాల్లో తీవ్ర ఉద్రిక్తకర పరిస్థితులు నెలకొనగా.. అంతర్జాతీయంగా అన్ని దేశాలపై దీని ప్రభావం పడుతోంది. ఈ క్రమంలో సౌదీ అరేబియా, కువైట్, ఖతార్, యునైటెట్ అరబ్ ఎమిరేట్స్‌తో పాటు మరికొన్ని గల్ఫ్ దేశాలు సంచలన నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమవుతున్నాయి. అమెరికాతో తమ పెట్టుబడి, కాంట్రాక్టులు, ఒప్పందాలను వెనక్కి తీసుకోవాలని భావిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధం వల్ల తమ దేశాల ఆర్థిక వ్యవస్థలకు నష్టం జరుగుతుందనే కారణంతో అమెరికాతో చేసుకున్న కాంట్రాక్టులను ఉపసంహరించుకునేందుకు సిద్ధమవుతున్నాయి.

**తగ్గిన ఇంధన ఆదాయం**

ఇప్పటికే ఉన్న ఒప్పందాల్లో ఫోర్స్ మేజ్యూర్ నిబంధనలను అమలు చేసే అంశంపై అంతర్గతంగా గల్ఫ్ దేశాలు చర్చలు జరుపుతున్నాయి. ప్రస్తుత పెట్టుబడులతో పాటు భవిష్యత్ పెట్టుబడులపై కూడా సమీక్ష నిర్వహిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఇదే జరిగితే విదేశీ ప్రభుత్వాలు, కంపెనీలతో పెట్టుబడులు, క్రీడా స్పాన్సర్‌షిప్ డీల్స్, హోల్డింగ్స్ అమ్మకం వంటి వాటిపై ప్రభావితం పడనుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. యుద్ధం వల్ల గల్ఫ్ దేశాల ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుంది. యుద్ధం వల్ల ఆయిల్ ఎగుమతులకు అంతరాయం కలగడంతో వాటి నుంచి వచ్చే ఆదాయం భారీ స్థాయిలో తగ్గుతోంది. ప్రపంచంలో చమురు, గ్యాస్ సరఫరాలో ఐదో వంతు హార్ముజ్ జలసంధి ద్వారా జరుగుతోంది. అయితే ఉద్రిక్త పరిస్థితుల క్రమంలో అనేక ట్యాంకర్లు ఢీకొనడం, ఈ మార్గంలో సరుకు రవాణాకు ఆటంకం కలుగుతుంది. దీని వల్ల ఇంధన ఆదాయాలు తగ్గడంతో గల్ఫ్ దేశాలు నష్టపోతున్నాయి.

**ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి**

ఇక గల్ఫ్ దేశాల్లోని అమెరికా రాయబార కార్యాలయాలు, మౌలిక సదు–పాయాలు, స్థావరాలపై ఇరాన్ దాడులను కొనసాగిస్తోంది. దీని వల్ల విమానాలు రద్దు కావడం, టూరిస్టుల రాక తగ్గిపోవడంతో ఆదాయం తగ్గుతుంది. దీని వల్ల గల్ఫ్ దేశాల ప్రభుత్వ బడ్జెట్‌లపై ఒత్తిడి పడుతోంది. దీంతో విదేశీ పెట్టుబడులను వెనక్కి తీసుకోవాలని సమాలోచన చేస్తున్నాయి. గత ఏడాది అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గల్ఫ్ దేశాలను సందర్శించారు. అనంతరం అమెరికాలో బిలయన్ డాలర్ల పెట్టుబడులు పెట్టేందుకు గల్ఫ్ దేశాలు ముందుకొచ్చాయి. యుద్ధం వల్ల పెట్టుబడులపై అనిశ్చితి నెలకొంది. దీంతో దౌత్యపరమైన పరిష్కారం కోసం అమెరికాతో గల్ఫ్ దేశాలు చర్చలు జరిపేందుకు సిద్ధమవుతున్నాయి.

# హార్ముజ్ ఉద్రిక్తతల మధ్య భారత్‌కు ఖతార్ భరోసా

### మార్గం తెరుచుకున్న వెంటనే ఎల్‌ఎన్‌జీ సరఫరా-దేశంలో ఇంధన నిల్వలు సురక్షిత స్థితిలోనే ఉన్నాయని కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ : పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ ఇంధన సరఫరా వ్యవస్థలు ప్రభావితమవుతున్నాయి. ముఖ్యంగా ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ మధ్య పెరిగిన ఉద్రిక్తతల కారణంగా హార్ముజ్ జలసంధి ప్రాంతంలో నౌకాశ్రయం కార్యకలాపాలు దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితుల్లో భారత్‌కు సహజ వాయువు (ఎల్ఎన్‌జీ) సరఫరా విషయంపై ఖతార్ ప్రభుత్వం కీలక భరోసా ఇచ్చింది. హార్ముజ్ మార్గం తిరిగి ప్రారంభమైన వెంటనే భారత్‌కు ఎల్ఎన్‌జీ సరఫరాలను పునఃప్రారంభిస్తామని ఖతార్ తెలిపినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

ప్రస్తుతం దేశంలో ఇంధన నిల్వలు సంతృప్తికర స్థాయిలో ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. అందువల్ల తక్షణంలో పెట్రోల్, డీజిల్ ధరలను పెంచే ఆలోచన లేదని స్పష్టం చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో మార్పులు జరిగినా వినియోగదారులపై భారం పడకుండా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం చెబుతోంది. హార్ముజ్ జలసంధి ప్రపంచ ఇంధన రవాణాలో అత్యంత కీలక మార్గాల్లో ఒకటి. పర్షియన్ గల్ఫ్‌ను సముద్ర మార్గంతో అనుసంధానించే సన్నని మార్గం ద్వారా ప్రపంచంలోని గణనీయమైన చమురు, గ్యాస్ సరఫరాలు జరుగుతాయి. ప్రస్తుతం అక్కడ నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా కొంతకాలంగా నౌకాశ్రయం కార్యకలాపాలు అంతరాయం ఎదుర్కొన్నాయి.

**ఖతార్ స్పష్టంగా హామీ**

అయితే పరిస్థితులు త్వరలోనే మెరుగుపడే సూచనలు కనిపిస్తున్నాయని అధికారులు చెప్పారు. ఇరాన్ ఇటీవల చేసిన ప్రకటనల నేపథ్యంలో పరిస్థితి కొంత శాంతించవచ్చని అంచనా వేస్తున్నారు. తమపై దాడులు జరిగితే తప్ప పొరుగు దేశాలను లక్ష్యంగా చేసుకోబోమని ఇరాన్ ప్రకటించడంతో వాణిజ్య నౌకల రాకపోకలు మళ్లీ ప్రారంభమయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో భారత్‌కు సరఫరాలు నిలిచిపోతాయన్న ఆందోళన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మార్గం తిరిగి ప్రారంభమైన వెంటనే భారత్‌కు ఎల్ఎన్‌జీ సరఫరా మొదలుపెడతామని ఖతార్ స్పష్టంగా హామీ ఇచ్చిందని పేర్కొన్నారు.

**ఆ విషయంలో ఆందోళన అవసరం లేదు!**



అదే సమయంలో కేంద్ర పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరి దేశ ఇంధన దిగుమతులు ప్రస్తుతం నాన్– హార్ముజ్ మార్గాల నుంచి జరుగుతున్నాయని, పౌరుల అన్ని అవసరాలు తీర్చుతామని చెప్పారు. భారత్ సౌకర్యవంతమైన స్థితిలో ఉందని, ఆ విషయంలో ఆందోళన లేదా ఊహాగానాలకు అవకాశం లేదని చెప్పారు.

ఇదిలా ఉండగా భారత్‌కు ఇతర దేశాల నుంచి కూడా ఎల్ఎన్‌జీ సరఫరా చేసేందుకు ఆసక్తి వ్యక్తమవుతోందని అధికారులు చెప్పారు. ప్రస్తుతం దేశంలో ఎల్ఎన్‌జీ నిల్వలు సరిపడా ఉన్నాయని, అవసరమైతే ప్రత్యామ్నాయ సరఫరాదారుల నుంచి కొనుగోలు చేసే అవకాశాలు కూడా ఉన్నాయని వెల్లడించారు. గత కొన్ని సంవత్సరాలుగా భారత్ తన ఇంధన దిగుమతులను విభిన్న ప్రాంతాల నుంచి పొందే విధంగా వ్యూహాన్ని అమలు చేస్తోంది. ముఖ్యంగా హార్ముజ్ జలసంధిపై ఆధారాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంది. ఈ చర్యల ఫలితంగా ప్రస్తుతం హోర్ముజ్ మార్గం బయట ప్రాంతాల నుంచి వచ్చే చమురు దిగుమతులు పెరిగాయని అధికారులు తెలిపారు.

ఇంతకుముందు భారత్‌కు వచ్చే మొత్తం చమురు దిగుమతుల్లో సుమారు 60 శాతం హార్ముజ్ జలసంధి వెలుపలి మార్గాల నుంచే వచ్చేవి. ఇప్పుడు అది 70 శాతానికి పెరిగిందని చెప్పారు. అంటే ఈ మార్గంపై ఆధారపడే స్థాయి తగ్గిందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఇంధన భద్రతను మరింత బలోపేతం చేయడానికి అవసరమైతే రష్యా వంటి ఇతర దేశాల నుంచి కూడా అదనపు ఎల్ఎన్‌జీ కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. ఇప్పటికే పలుదేశాలు భారత్‌కు సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం అందిందని చెప్పారు.

**పెట్రోల్, డీజిల్ ధరలను పెంచే యోచన లేదు!**

ఇక చమురు సరఫరాల విషయంలో కూడా భారత్ ముందస్తు చర్యలు తీసుకుంటోంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సౌదీ అరేబియాలోని యాన్‌బూ నుంచి క్రూడ్ ఆయిల్ కార్గోలను ఇప్పటికే సురక్షితం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరగవచ్చన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచే యోచన లేదని అధికార వర్గాలు తెలిపారు. వినియోగదారులను అంతర్జాతీయ మార్కెట్ ఒడిదుడుకుల నుంచి రక్షించడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఇక ఎల్పీజీ ధరలపై వస్తున్న ఆరోపణలను కూడా ప్రభుత్వం ఖండించింది. ధరల స్థిరత్వం గురించి ఇచ్చిన హామీ పెట్రోల్, డీజిల్‌కే వర్తిస్తుందని, ఎల్పీజీకి సంబంధించలేదని అధికారులు తెలిపారు.

కొంతకాలం క్రితం ఎల్పీజీ నిల్వలపై ఆందోళన ఉన్నప్పటికీ ఇప్పుడు పరిస్థితి మెరుగుపడిందని చెప్పారు. తాజాగా గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధరను రూ.60 మాత్రమే పెంచినట్లు పేర్కొన్నారు. వాస్తవానికి మార్కెట్ పరిస్థితులను బట్టి సుమారు రూ.134 పెంపు అవసరమైందని లెక్కలు చూపించాయని తెలిపారు. అయితే వినియోగదారులపై భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం మిగిలిన మొత్తాన్ని భరించిందని వెల్లడించారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద అందుతున్న సబ్సిడీ కొనసాగుతుందని కూడా అధికారులు తెలిపారు.

# స్వదేశం వైపు భారతీయుల చూపు..

### దుబాయ్‌ను వదిలేస్తున్న ధనవంతులు

న్యూఢిల్లీః ఇరాన్ పై అమెరికా , ఇజ్రాయెల్ సాగిస్తున్న యుద్ధంతో పశ్చిమాసియా దేశాలు దద్దరిల్లుతున్నాయి. నిన్న మొన్నటి వరకు సేఫ్ కంట్రీస్‌గా పేరుపడ్డ దేశాలె యుద్ధ భయంతో వణికిపోతున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ తనపై సాగిస్తున్న యుద్ధానికి ప్రతిగా ఇరాన్ ప్రతిదాడులకు దిగుతుంది. అందులో భాగంగా సైనిక అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని బాంబుల వర్షం కురిపిస్తోంది. తన చుట్టూ ఉన్న గల్ఫ్ కంట్రీస్ పై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో దాడులకు దిగుతోంది. దీంతో దుబాయ్ వంటి దేశాల్లో వ్యాపరాలు నిర్వహిస్తున్న సంపన్నులు లబోదిబో మంటున్నారు. తమ ఆస్తుల భరోసాపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా దుబాయ్ పై వరుసగా క్షిపణులు, డ్రోన్ల దాడులు జరుగుతుండటంతో అక్కడ స్థిరపడిన పలువురు వ్యాపారులు, భారతీయ ధనవంతులు, ఇసియా దేశాల ధనవంతులు దుబాయ్‌ని వదిలేసేందుకు సిద్ధపడుతున్నారు. ఇన్నాళ్లు 'సేఫ్ హెవెన్'గా ఫేమస్ పేరుబడిన దుబాయ్ ప్రతిష్ఠ ఇరాన్ బాంబు దాడులతో మసకబారుతోంది. దీంతో పెట్టుబడిదారులు సింగపూర్, హాంకాంగ్ వైపు తరలిపోతున్నారని తాజా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

మరోవైపు భారతీయ ధనవంతులు దుబాయ్ వదిలేయడానికి సిద్ధమయ్యారు. ఇప్పటికే -- గల్ఫ్ దేశాల నుంచి 52,360 మంది భారతీయులు భారత్‌కు చేరుకున్నారని తెలుస్తోంది. వీరంతా -- ప్రత్యేక విమానాలు, ప్రత్యామ్నాయ రూట్లలో భారతదేశానికి తిరిగి వచ్చేసినట్లు పలు కథనాలు వెల్లడిస్తున్నాయి. అంతేకాక పలువురు -- ధనవంతులు దుబాయ్ నుంచి ఆస్తులు కూడా ట్రాన్స్‌ఫర్ చేసుకుంటున్నారని, దుబాయ్‌లో నివసిస్తున్న ఇద్దరు భారతీయ పారిశ్రామికవేత్తలు రిస్క్ తగ్గించుకోవడానికి తమ బ్యాంకు ఖాతాల నుండి ఒక్కొక్కరు లక్ష డాలర్ల కంటే ఎక్కువ మొత్తాన్ని సింగపూర్‌కు తరలించడానికి ప్రయత్నించినట్లు రాయిటర్స్ కథనం పేర్కొనడం గమనార్హం. వీరే కాక పలువురు ఇతర సంపన్నులు కూడా తమ ఆస్తులను గల్ఫ్ నుండి తరలించేందుకు న్యాయ నిపుణులను, ఆర్థిక సలహాదారులను సంప్రదిస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

50 మిలియన్ డాలర్ల కు మించి ఆస్తులు కలిగిన దుబాయ్ క్లయింట్లు చాలామంది వెంటనే తమ డబ్బులను సింగపూర్, హాంకాంగ్‌కు మార్చాలని ప్లాన్ చేస్తున్నారట. గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న అస్థిరత కారణంగా ఫ్యామిలీ ఆఫీసులు కూడా అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. ఇన్నాళ్లూ కేవలం పన్ను ప్రయోజనాల కోసమే దుబాయ్‌ను ఎంచుకున్న వారు.. ఇప్పుడు పన్నుల కంటే తమ ప్రాణాలకు, ఆస్తుల భద్రతకే మొదటి ప్రాధాన్యత అని భావిస్తున్నారట.దీంతో వారంతా -- దుబాయ్ నుంచి తమ ఆస్తులు ట్రాన్స్‌ఫర్ చేసుకునేందుకు సిద్ధపడుతున్నారు. ఒకవేళ యుద్ధం రేపు ముగిసినా.. విమానాల రాకపోకలు, భద్రతపై నమ్మకం కలగడం అంత ఈజీ వ్యవహారం కాదని నిపుణులు అంటున్నారు. అయితే ధనవంతుల భయాన్ని పసిగట్టిన యూఏఈ ప్రభుత్వం పెట్టుబడిదారుల విశ్వాసం దెబ్బతినకుండా ఉండేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ, యుద్ధ భయం మాత్రం సంపన్నులను వీడటం లేదు. దీంతో వారంతా తమ వ్యాపారాలను సింగపూర్ వంటి దేశాల వైపు మళ్లీంచడానికే ఆసక్తి చూపుతున్నారు.





# ఇరాన్లో తీవ్రస్థాయికి చేరిన మానవతా సంక్షోభం

### ఇరాన్లో 1,300 మందికిపైగా మృతి- 6నెలల వరకు యుద్ధం చేయగలమన్న ఐఆర్‌జిసి

న్యూఢిల్లీ : పశ్చిమాసియాలో ప్రస్తుతం కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు కారణంగా ఇరాన్లో మానవతా సంక్షోభం తీవ్రస్థాయికి చేరింది. గత వారం రోజులుగా జరుగుతున్న ఘర్షణల నేపథ్యంలో మరణాల సంఖ్య పెరుగుతుండగా, వేలాది మంది తమ ఇళ్లను విడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటి వరకు 1,300 మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారిక గణాంకాలు తెలిపాయి. మరోవైపు ఆరు నెలల పాటు తీవ్రమైన యుద్ధం చేయగలమని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ తెలిపారు.అమెరికా–ఇజ్రాయెల్ చేసిన సంయుక్త దాడుల్లో ఇప్పటి వరకు 1300 మంది మృతి చెందగా, భద్రత కోసం సుమారు లక్ష మంది ప్రజలు తమ నివాసాలను విడిచిపెట్టి ఇతర ప్రాంతాలకు తరలిపోయినట్లు గణంకాలు వెల్లడించాయి. దీంతో సహాయక చర్యలపై భారీ ఒత్తిడి ఏర్పడిందని అంతర్జాతీయ సంస్థలు తెలిపాయి. అత్యవసర సహాయం కోసం ఐక్యరాజ్యసమితి శరణార్థుల సంస్థకు పెద్ద సంఖ్యలో అభ్యర్థనలు వస్తున్నాయి.

**'ఆరు నెలల యద్ధం చేయగలం'**

అమెరికా–ఇజ్రాయెల్పై ఇరాన్ కనీసం ఆరు నెలల పాటు యుద్ధం చేయగలదని ఆదివారం ఐఆర్జీసీ ప్రతినిధి అలీ మహ్మద్ నైని ఓ వార్త సంస్థకు తెలిపారు. సాయుధ దళాలు ప్రస్తుతం ఉన్న సార్థ్యాలతో కనీసం ఆరు నెలల పాటు యుద్ధాన్ని కొనసాగించలమని చెప్పారు. ఇప్పటికే అమెరికా, ఇజ్రాయెల్ స్థావరాలు, ఆస్తులకు సంబంధించి 200 కంటే ఎక్కువ వాటిని లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నట్లు తెలిపారు.

**ఇజ్రాయెల్పై క్షిపణుల వర్షం**

మరోవైపు ఇజ్రాయెల్పై ఇరాన్ ప్రతికార దాడులను కొనసాగిస్తోంది. ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలు, ఎంబసీలే లక్ష్యంగా ఇరాన్ క్షిపణుల వర్షం కురిపిస్తోంది. గల్ఫ్‌దేశాలపై డ్రోన్లు, క్షిపణుల్తో విరుచుకుపడుతోంది. ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌లో ఐరన్‌డోమ్ గగనతల రక్షణ వ్యవస్థను తప్పించుకుని దూసుకొచ్చిన ఓ క్షిపణి విధ్వంసం సృష్టించింది. అక్కడ ఆస్తి, ప్రాణనష్టం గురించి ఇంకా తెలియరాలేదు.

**అమెరికా ఎంబసీలపై దాడులు**

దుబాయ్‌లోని 23 మెరీనా ఆకాశహర్మ్యంపై కూల్చివేసిన ఇరాన్ క్షిపణి శిథిలాలు పడి మంటలు చెలరేగాయి. ఈ దాడిలో స్వల్పనష్టం వాటిల్లినట్లు దుబాయ్ ప్రభుత్వం తెలిపింది. ఇరాన్ ప్రయోగించి 16 మిస్సైళ్లలో 15 కూల్చేశామని, 121 డ్రోన్లలో 119 ధ్వంసం చేశామని పేర్కొంది. ఇరాన్ డ్రోన్ దాడిలో ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయం దెబ్బతింది. నార్వే రాజధాని ఓస్లోలోని అమెరికా ఎంబసీ సమీపంలో పేలుళ్లు జరిగాయి. అయితే అది ఎవరు ప్రయోగించారు అన్న విషయంపై నార్వే ఇంకా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.బహ్రెయిన్‌లోని సల్మాన్ పోర్ట్‌లో ఇరాన్ ఆత్మాహుతి డ్రోన్ దాడిలో భారీగా మంటలు చెలరేగాయి. కువైట్‌లోని అమెరికా స్థావరంపై భారీ డ్రోన్ దాడి జరిగింది. అక్కడి ఆస్తి నష్టం గురించి వివరాలు తెలియాల్సి ఉంది. కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని ఇంధన ట్యాంకర్లు డ్రోన్ దాడిలో భగ్గుమన్నాయి. స్థానికంగా ఆకాశహర్మ్యం పూర్తిగా మంటల్లో దగ్ధమైపోయిన దృశ్యాలు వైరల్ అయ్యాయి. తమ ఇద్దరు సరిహద్దు భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు కువైట్ తెలిపింది.

**'బంధీలుగా అమెరికా సైనికులు'**

పలువురు అమెరికా సైనికులను బంధీలుగా చేసుకున్నామని ఇరాన్ జాతీయ భద్రతా అధికారి లారిజానీ తెలిపారు. అయితే ఎక్కడి నుంచి ఎంతమందిని అన్న వివరాలు మాత్రం వెల్లడించలేదు. తమ దాడిలో ఆరుగురే చనిపోయారని అమెరికా చెబుతోందని, అది అబద్ధమని పేర్కొన్నారు. వివిధ కారణాలతో ఆ సంఖ్యను క్రమంగా పెంచుతారని అంచనా వేశారు.

ఈ పరిణామాల నేపథ్యంలో పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. అక్కడ నివసిస్తున్న విదేశీ పౌరుల భద్రతపై కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఈ ప్రాంతంలో నివసిస్తున్న లక్షలాది భారతీ–యుల భద్రతపై అంతర్జాతీయంగా చర్చ జరుగుతోంది.

# తెలుగు రాష్ట్రాల్లో వందే భారత్ ప్రయాణ వేళలు మారాయ్



న్యూఢిల్లీ తెలుగు రాష్ట్రాల రైల్వే ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే కీలక ప్రకటన జారీ చేసింది. వందే భారత్ రైళ్ల షెడ్యూల్స్‌లో పలు మార్పులు చేస్తున్నట్లు ప్రకటించింది. రెండు వందే భారత్ రైళ్ల టైమింగ్స్‌ను మార్చింది. రైల్వే ప్రయాణికులు వీటి గురించి సమాచారం తెలుసుకుని ప్రయాణినికి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించింది. ఈ నెల 15వ తేదీ నుంచి కొత్త వేళలు అమల్లోకి రానున్నట్లు స్పష్టం చేసింది. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి రైల్వేశాఖకు సహకరించాలని, ప్రయాణికులు మెరుగైన సేవలు అందించేందుకు రైల్వేశాఖ ఎల్లప్పుడూ సిద్దంగా ఉంటుందని రైల్వేశాఖ తన ప్రకటనలో పేర్కొంది. ఏయే ట్రైన్ల షెడ్యూల్స్ మారాయి.. కొత్త టైమింగ్స్ ఏంటి? అనే పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.

**రెండు వందే భారత్ టైమింగ్స్‌లో మార్పులు**

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో అనేక వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయి. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం, తిరుపతి వైపు రైళ్లు నడుస్తున్నాయి. వీటిల్లో ప్రయాణికుల ఆక్యుపెన్సీ ఎక్కువగానే ఉంటుంది. వేగవంతంగా ప్రయాణం చేసే సౌకర్యంతో పాటు అత్యాధునిక సర్వీసులు అందుబాటులో ఉండటంతో వీటిల్లో ఎక్కువమంది ప్రయాణిస్తున్నారు. వీటిల్లో యశ్వంతపూర్–కాచిగూడ–యశ్వంతపూర్, కలబురగి–బెంగళూరు–కలబురగి వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లు ఉండగా.. వీటి టైమ్ షెడ్యూల్స్‌లో దక్షిణ మధ్య రైల్వే మార్పులు చేసింది. యశ్వంతపూర్ -- కాచిగూడ(20704) వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఇప్పటివరకు హిందూపూర్‌కు మధ్యాహ్నం 3.48 గంటలకు చేరుకుని.. 3.50కి బయల్దేరేది. మార్చి 15 నుంచి ఈ టైమింగ్స్‌ను సవరించారు. ఇక నుంచి మధ్యాహ్నం 3.55 గంటలకు చేరుకుని 3.57 గంటలకు బయల్దేరుతుంది.

**ప్రయాణికులకు సూచన**

ఇక కాచిగూడ–యశ్వంత్ పూర్ ఎక్స్‌ప్రెస్(20703) హిందూపూర్‌కు మధ్యాహ్నం 12.17 గంటలకు చేరుకుని 12.19కి బయల్దేరనుంది. గతంలో ఇది మధ్యాహ్నం 12.08 గంటలకు చేరుకుని 12.10 గంటలకు బయల్దేరేది. అటు కలబురగి -- బెంగళూరు వందేభారత్ ట్రైన్( 22231) గతంలో శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్‌కు ఉదయం 11 గంటలకు చేరుకుని 11.02 గంటలకు బయల్దేరేది. ఇక నుంచి 11.13 గంటలకు చేరుకుంటుంది. ఇక ఇదే రైలు యల్హంక రైల్వే స్టేషన్‌కు మధ్యాహ్నం 12.28 గంటలకు చేరుకునేది. ఇప్పుడు ఇది 12.30 గంటలకు వస్తుంది. అటు బెంగళూరు–కలబురగి వందే భారత్ (22232) యల్హంక స్టేషన్‌కు మధ్యాహ్నం 3.05 గంటలకు గతంలో వచ్చేది. అయితే ఇప్పుడు అది 3.09 గంటలకు చేరుకుంటుందని రైల్వేశాఖ ప్రకటించింది. ఇక శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం రైల్వేస్టేషన్‌కు సాయంత్రం 4.23 గంటలకు గంటలకు గతంలో చేరుకునేది. ఇప్పుడు ఇక సాయంత్రం 4.45 గంటలకు చేరుకుంటుంది. ప్రయాణికులు ఈ టైమింగ్స్ గురించి అవగాహన కలిగి ఉండాలని రైల్వేశాఖ సూచించింది.

# చమురు ధరలు భారీగా పెంచిన రష్యా



మిడిల్‌ఈస్ట్‌లో యుద్ధం నేపథ్యంలో ఇరాన్ హర్మూజ్ జలసంధిని మూసివేసిన సంగతి తెలిసిందే. దీంతో మార్గంలో చమురు రవాణా నిలిచిపోయింది. ఈ క్రమంలోనే తాజాగా రష్యా సంచలన నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు చౌకగా చమురు అందించిన పుతిన్ ప్రభుత్వం వాటి ధరలను పెంచింది. డిస్కౌంట్‌కు బదులుగా ప్రీమియం వసూలు చేయనున్నారు. ఉక్రెయిన్–రష్యా యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా బ్యారెల్‌కు 15 నుంచి 30 డాలర్ల వరకు తక్కువ ధరకే భారత్‌కు విక్రయించేది.

కానీ ఇప్పుడు అంతర్జాతీయ బ్రెంట్ క్రూడ్ ధర కంటే బ్యారెల్‌కు 2 నుంచి 5 డాలర్లు అదనంగా వసూలు చేస్తోంది. ప్రస్తుతం ఇంటర్నేషనల్ మార్కెట్‌లో చమురు ధర బ్యారెల్‌కు దాదాపు 90 డాలర్లు ఉంది. దీంతో రష్యా ఇకనుంచి భారత్‌కు సుమారు 92 నుంచి 95 డాలర్ల వరకు చమురును విక్రయించే ఛాన్స్ ఉంది. దీంతో ఇంధన ధరలు భారత్‌లో పెరగనున్నాయి.

ప్రస్తుతం మిడిల్‌ఈస్ట్‌లో యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో హర్మూజ్ జలసంధి గుండా జరిగే చమురు రవాణాకు ఆటంకం ఏర్పడింది. భారత్‌కు చమురు అవసరాల్లో దాదాపు 50 శాతం ఈ రూట్ నుంచే వస్తోంది . అయితే ఇప్పుడు ఆ సరఫరా ఆగిపోయింది. దీంతో ఇండియన్ రిఫైనరీలు ప్రత్యామ్నాయం కోసం రష్యా వైపు చూస్తున్నాయి. క్రమంగా చమురుకు డిమాండ్ విపరీతంగా పెరగుతోంది. అందుకే రష్యా తన పాత డిస్కౌంట్లను రద్దు చేసింది. వ్యూహాత్మకంగా మార్కెట్ ధర కంటే ఎక్కువ ధరకే చమురును విక్రయిస్తోంది.

దిగుమతి ఖర్చులు పెరగడం వల్ల భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగనున్నాయి. ఇప్పటికే వంట గ్యాస్ ధరలు కూడా 7 శాతం పెరిగాయి. చమురు ధరలు పెరిగితే రవాణా ఖర్చులు కూడా పెరుగుతాయి. చివరికి నిత్యావసర వస్తువుల ధరలు సైతం ఆకాశాన్ని తాకుతాయి. ప్రస్తుతం మిడిల్‌ఈస్ట్‌లో సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో ప్రపంచ దేశాలకు రష్యా నుంచి చమురు సేకరించే మార్గమే కనిపిస్తోంది.

రష్యాలోని బాల్టిక్ ఓడరేవులలో చమురు ధర కొంచెం చౌకగా ఉన్నప్పటికీ.. భారత్‌కు వచ్చే సమయానికి దాని ధర అమాంతం పెరుగుతుంది. యుద్ధం వల్ల.. చమురు నౌకలు 'కేప్ ఆఫ్ గుడ్ హోప్' ద్వారా అంటే ఆఫ్రికా కింద ఉన్న మార్గం ద్వారా చాలా దూరం ప్రయాణించాల్సి వస్తుంది. సముద్ర బీమా, సరుకు రవాణా ఖర్చులు కూడా పెరిగిపోయాయి.

# ఇరాన్‌కు మరిన్ని సర్‌ప్రైజ్‌లు ఇస్తాం

### ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు



న్యూఢిల్లీ : ఇరాన్‌పై భీకర దాడులు కొనసాగుతోన్న నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. ముందు ముందు ఇరాన్‌కు మరిన్ని సర్‌ప్రైజ్‌లు ఇస్తామన్నారు. ప్రజలు ఆ దేశంలోని ప్రభుత్వాన్ని పడగొట్టే క్షణం దగ్గరలో ఉందన్నారు. ఈ దాడులతో తాము ఇరాన్‌ను విభజించడానికి ప్రయత్నించట్లేదని.. నిరంకుశ పాలన నుంచి ఆ దేశానికి విముక్తి కలిగించడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఇరాన్ విషయంలో తమ ప్రణాళికలోని తదుపరి దశను త్వరలో చేరుకోబోతున్నామని నెతన్యాహు అన్నారు.

ఇజ్రాయెల్ చేస్తున్న దాడులతో కీలక నేతలను కోల్పోయి.. ఇరాన్ ప్రభుత్వం ఇప్పటికే తీవ్రంగా నష్టపోయిందని నెతన్యాహు అన్నారు. ఆ దేశంలోని ప్రస్తుత పాలనను అస్థిరపరచడానికి.. ప్రభుత్వంలో మార్పులు తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అక్కడి పాలక వర్గాన్ని గద్దె దించడానికి ఇదే సరైన సమయమని తెలిపారు. ఆ దేశ ప్రభుత్వాన్ని అక్కడి ప్రజలే స్వయంగా పడగొట్టాలన్నారు. అప్పుడే ఇరాన్–ఇజ్రాయెల్‌లలో శాంతి నెలకొంటుందని తెలిపారు.

# ట్రంప్‌ను వదిలిపెట్టం, మూల్యం చెల్లించుకోవాల్సిందే

### ఇరాన్ భద్రతా చీఫ్ అలీ లారిజాని వార్నింగ్



న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇరాన్ భారీ హెచ్చరిక జారీ చేసింది. "ట్రంప్‌ను వదిలిపెట్టేది లేదు" అని వార్నింగ్ ఇచ్చింది. తమ సుప్రీం లీడర్ అలీ ఖమేనీని చంపినందుకు అమెరికా అధ్యక్షుడు "మూల్యం చెల్లించుకోవాల్సిందే" అని ఇరాన్ భద్రతా చీఫ్ అలీ లారిజాని అన్నారు. ఫిబ్రవరి 28న అమెరికా మరియు ఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడుల్లో ఖమేనీ మరణించారు. దీంతో మధ్యప్రాచ్యంలో యుద్ధం తీవ్రమైంది.

"మా నాయకుడు, మా ప్రజల రక్తానికి ప్రతీకారం తీర్చుంటాము. ట్రంప్ మూల్యం చెల్లించాలి." అని ఖమేనీ అత్యంత సన్నిహిత సహాయకుడు లారిజాని ఆదివారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇదే కాకుండా, ఇరాన్ పొరగు దేశాలు అమెరికాకు సాయం చేయొద్దని, వారి భూభాగాలను అమెరికా ఉపయోగించకుండా నిరోధించాలి లేదా దానిని మనమే చేయడం తప్ప వేరే మార్గం లేదు అని అన్నారు. శత్రువులు ఈ ప్రాంతంలోని ఇతర దేశాల నుంచి దాడులు చేస్తే మేము తీవ్రంగా స్పందిస్తామని లారిజానీ స్పష్టం చేశారు.

ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ మాజీ కమాండర్ లారిజాని ప్రస్తుతం, ఇరాన్‌లో నిర్ణయాలు తీసుకునే కీలక వ్యక్తుల్లో ఒకరుగా ఉన్నారు. అమెరికా, ఇరాన్‌ను విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తోందని అన్నారు. వెనిజులాలో చేసినట్లు ఇరాన్‌లో చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

# ఇరాన్ అణు నిల్వలపై అమెరికా, ఇజ్రాయెల్ ఫోకస్

### సీజ్ చేసుకునేందుకు స్పెషల్ ఫోర్సెస్!



న్యూఢిల్లీ : ఇరాన్ అణు నిల్వలను స్వాధీనం చేసుకునేందుకు ప్రత్యేక బలగాలను ఆ దేశంలో మోహరించే అవకాశంపై అమెరికా–ఇజ్రాయెల్‌లు చర్చలు జరిపాయి. ఇరాన్ భారీగా శుద్ధి చేసిన సుసంపన్న యురేనియం నిల్వలను భద్రపరచాలని వాషింగ్టన్, జెరూసలేం భావిస్తున్నట్లు అమెరికన్ మీడియా తెలిపింది. యుద్ధం ముగిసిన తర్వాతే ఈ ఆపరేషన్ చేపట్టాలని అవగాహనకు వచ్చినట్లు పేర్కొంది.

ఇరాన్ అణు కార్యకలాపాలను శాశ్వతంగా నిర్వీర్యం చేయడంలో భాగంగానే ఈ ఆపరేషన్ చేపట్టనున్నట్లు సమాచారం. అమెరికా డెల్టా ఫోర్స్, ఇజ్రాయెల్ ఎలైట్ కమాండో యూనిట్లు ఇందులో పాల్గొనే అవకాశం ఉంది. ఇస్ఫహాన్, నటాంజ్, ఫోర్డో ప్రాంతాల్లోని అణు కేంద్రాలే ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. ఇరాన్ ఇప్పటికే 60శాతం వరకు యురేనియంను శుద్ధి చేసిందని, అణుబాంబు తయారీకి కావాల్సిన 90శాతం స్థాయికి చేరువలో ఉందని అమెరికా ఆరోపిస్తోంది. అయితే అది పౌర విద్యుత్ వంటి శాంతియుత కార్యక్రమాలకే వాడుతామని ఇరాన్ చెబుతూ వచ్చింది.

అమెరికన్లపై దాడి చేస్తే ఘోర పరిణామాలు: హెగ్‌సెత్ హెచ్చరిక

మరోవైపు ఈ వ్యూహాత్మక లక్ష్యాన్ని మరింత బలోపేతం చేస్తూ అమెరికా యుద్ధ శాఖ కార్యదర్శి పీట్ హెగ్సెత్ కొత్త హెచ్చరికలను జారీ చేశారు. అమెరికా పౌరులను లక్ష్యంగా చేసుకునే ఎవరైనా తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. అమెరికా జాతీయ భద్రత విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని అందులో పేర్కొంది.

'ప్రపంచంలో ఎక్కడైనా అమెరికన్లను మీరు చంపినా లేదా బెదిరించినా, మేం వదిలిపెట్టాం. ఎలాంటి క్షమాపణ, సందేహం లేకుండా మిమ్మల్ని వెంబడించి పట్టుకుని చంపుతాం' అని పీట్ హెగ్‌సెత్ హెచ్చరించారు. అంతేకాకుండా 21 సెకన్ల వీడియోను కూడా విడుదల చేశారు. అందులో సైనిక చర్యల సమయంలో వాహనాలు, భవనాలను అమెరికా దళాలు ధ్వంసం చేసిన అన్క్లాసిఫైడ్ దృశ్యాలు ఉన్నాయి

suryaeditpage@gmail.com



# కలర్స్

LIFE IS A RAINBOW

# భారతీయ బిలియనీర్లు



**ఈ సంవత్సరం భారతదేశంలో 24 మంది కొత్త బిలియనీర్లు చేరారు. హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ 2026 ప్రకారం.. భారతదేశంలో ఇప్పుడు 308 మంది బిలియనీర్లు ఉన్నారు. ఈ విషయంలో భారతదేశం ప్రపంచంలో చైనా, అమెరికా తర్వాత మూడవ స్థానంలో ఉంది. మొదటిసారిగా ప్రపంచవ్యాప్తంగా బిలియనీర్ల సంఖ్య 4,000 దాటింది. ఇప్పుడు 4,020 మంది బిలియనీర్లు ఉన్నారు. గత సంవత్సరం కంటే 578 మంది పెరుగుదల. ఆ నివేదిక ప్రకారం.. చైనాలో 1,110 మంది బిలియనీర్లు ఉండగా, అమెరికాలో 1,000 మంది ఉన్నారు. 308 మంది బిలియనీర్లతో భారతదేశం మూడవ స్థానంలో ఉంది. జర్మనీ, యునైటెడ్ కింగ్‌డమ్, స్విట్జర్లాండ్ వంటి దేశాలను అధిగమించింది. ఈ సంవత్సరం భారతదేశం 24 మంది కొత్త బిలియనీర్లను చేర్చుకుంది. 57 మంది కొత్త వ్యక్తులు మొదటిసారి జాబితాలో చేరారు. ఇది ఆరోగ్య సంరక్షణ, పారిశ్రామిక ఉత్పత్తులు, వినియోగ వస్తువులు వంటి రంగాలలో భారతదేశంలో వేగవంతమైన సంపద సృష్టిని సూచిస్తుంది. మరిన్ని వివరాలలోకి వెళితే...**

టెస్లా, స్పేస్ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ సంపద గతంతో పోలిస్తే 89% పెరిగి, 792 బిలియన్ డాలర్లకు (రూ.72 లక్షల కోట్లకు పైగా) చేరుకోగా వరుసగా ఆరేళ్లలో అయిదోసారి ఆయన ప్రపంచ అత్యంత సంపన్నుడిగా నిలిచాడు. 300 బిలియన్ డాలర్లతో రెండోస్థానంలో అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ నిలవగా ఆల్ఫాబెట్‌కు చెందిన లారీ పేజ్ 271 బిలియన్ డాలర్లతో మూడోస్థానంలో నిలిచారు. కృత్రిమ మేధతో ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ తొలిసారిగా ప్రపంచ కుబేరుల జాబితాలో టాప్-10 లో నిలిచారు. ఆయన సంపద 172 బిలియన్ డాలర్లుగా ఉంది.ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ (ఏఐ) విప్లవం అత్యంత వేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత తరుణంలో ఆయా రంగల్లో కొత్త బిలియనీర్లు వేగంగా పుట్టుకొస్తున్నారు. ప్రపంచ బిలియనీర్లలో కృత్రిమ మేధ (ఏఐ) కంపెనీలకు చెందిన వారు ఏకంగా114 మంది ఉన్నారంటే ఏఐ విప్లవం ఎంతగా వృద్ధి చెందితో అర్థం చేసుకోవచ్చు. ఏఐతో ప్రపంచ వ్యాప్తంగా సంపద సృష్టించే వారి సంఖ్య పెరగుతూనే ఉంది. చరిత్రలో తొలిసారిగా 1 బిలియన్ డాలర్ల (రూ.9100 కోట్ల)కు పైగా సంపద కలిగిన వారి సంఖ్య 4,020కు చేరుకుంది. ఇందులో భారతీయులు కుబేరుల సంఖ్య 308. అంతేకాదు మనదేశం నుంచి కుబేరులుగా ఎదిగిన వారిలో కొత్తగా 24 మంది ఈ జాబితాలో చేరారు. భారత కుబేరుల సంపద విలువ గత ఏడాదితో పోలిస్తే10% వృద్ధి చెంది రూ.112.6 లక్షల కోట్లకు చేరుకుంది.భారత దేశాం ఆర్థిక పరిస్థితుల గురించి వివరించాలని అనుకున్నపుడు కుబేరుల భారతం ఒక వైపు కటిక పేదల భారతం ఇంకో వైపు అని చెప్పాల్సి ఉంటుంది. ఈ దేశంలో కోట్లకు పడగెత్తిన వారు అంతా ఒక వైపు ఉంటే కూటికి లాటరీ కొట్టే వారు వేరొక వైపు ఉంటారు అందుకే రెండు భారత దేశాలు ఉన్నాయని చెబుతారు ఒకటి పేదల భారం మరొకటి ధనికుల భారతం. ఈ దేశం ఆర్థికంగా ఎదుగుతోంది, మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతోంది.


**ఫలితాలు కొందరికే :**


అది సంతోషమే కానీ ఆ అభివృద్ధి ఫలాలు మాత్రం నూటికి ఎనభై శాతం పైగా ఉన్న పేదలు దిగువ మధ్య తరగతి వర్గాలకు చేరడం లేదు అన్న విమర్శలు ఉన్నాయి. కేవలం పది శాతం మందికే ఆర్థిక సంస్కరణ ఫలితాలు దక్కాయన్నది నిష్టుర సత్యమని ఆర్థిక నిపుణులు చెబుతారు. గడచిన మూడున్నర దశాబ్దాలుగా అమలవుతున్న ఆర్థిక సంస్కరణలు నయా జమీందార్లను తయారు చేశాయన్నది వాస్తవం అంటారు. దానికి తగిన సాక్ష్యాలు కూడా అన్ని చోట్లా భారీ నంబర్ల రూపంలో కనిపిస్తున్నాయని ప్రసిద్ధి చెందిన ఎకనామిస్టులు గుర్తు చేస్తారు.


**బిలియనీర్లు మనవారే :**


ఇక ప్రపంచంలో చూస్తే అత్యధిక సంఖ్యలో ఉన్న బిలియనీర్లు భారతీయులే అని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దీంతో భారత్ బిలియనీర్ల జాబితాలో వరల్డ్ లోనే మూడో స్థానాన్ని దక్కించుని గ్రేట్ అనిపించుకుంటోంది. తాజాగా చూస్తే మరో 24 మంది అపర కుబేరులు భారత్ లో ఆవిర్భవించారు. కేవలం ఏడాది వ్యవధిలో వీరు బిలియనీర్లు అయ్యారు అన్న మాట. ఇక ఈ బిలియనీర్లలో ఆరోగ్య రంగం నుంచే ఎక్కువ మంది రావడం విశేషం.
















## మనవాళ్లేం తక్కువ కాదు


ప్రపంచ కుబేరుల జాబితాలో తెలుగువారేం తీసిపోలేదు.ఇందులో.. మురళి దివి (దివీస్ లేబొరేటరీస్) మొదటి స్థానంలో నిలవగా, పి.పిచ్చి రెడ్డి, పి.వి. కృష్ణా రెడ్డి (మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) రెండోస్థానంలో ఉన్నారు. ఇక వరుసగా, జీఎం రావు (జీఎంఆర్), బి.పార్థసారథి రెడ్డి (హెటిరో), పీవీ రామ్‌ప్రసాద్ రెడ్డి (అరబిందో ఫార్మా), సురేందర్ పాల్ సింగ్ సులజ (ప్రీమియర్ ఎనర్జీస్), ఎం.సత్యనారాయణ రెడ్డి (ఎంఎస్ఎన్ లేబొరేటరీస్), సి.వెంకటేశ్వర రెడ్డి, ఎస్.సుబ్రమణ్యం రెడ్డి (అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఎస్టేట్స్), రామేశ్వర రావు జూపల్లి (మైహోం ఇండస్ట్రీస్), కె.సతీష్ రెడ్డి (డాక్టర్ రెడ్డీస్), సి.సత్యనారాయణ (లారస్ ల్యాబ్స్), జీవీ ప్రసాద్ (డాక్టర్ రెడ్డీస్), మహిమా దాట్ల (బయోలాజికల్ ఇ.), జి.రవీంద్ర రావు (యశోదా హెల్త్‌కేర్ సర్వీసెస్), శ్రీనివాస్ బొమ్మడిదల (జీఎంఆర్), ప్రతాప్ రెడ్డి (అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్), ఎన్.విశ్వేశ్వర రెడ్డి (షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్), ఎ.అయోధ్య రామి రెడ్డి (రాంకీ గ్రూపు), వెంకటేశ్వర్లు జాస్తి (సువెన్ ఫార్మా), బి.భాస్కర రావు (కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)లు కుబేరుల జాబితాలో చోటు దక్కించుకున్నారు.














**ఆ రెండు దేశాల తరువాత :**

ఇక అపర కుబేరుల జాబితాను తాజాగా హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్-2026 విడుదల చేసింది. దాని ప్రకారం చూస్తే కనుక ప్రపంచంలో అమెరికా, చైనా తర్వాత బిలియనీర్లు ఉన్న దేశంగా భారత్ అరుదైన ఖ్యాతిని గడించింది. ఈ లెక్కన చూస్తే దేశంలో ప్రస్తుతం మొత్తం 308 మంది బిలియనీర్లు ఉన్నట్లుగా ఈ నివేదిక వెల్లడించింది. బిలియనీర్లు ఏ ఏటికి ఆ ఏడు పెరుగుతున్నారు అంటే భారత దేశంలో సంపద సృష్టి అన్నది పెద్ద ఎత్తున సాగుతోంది అని అంటున్నారు. అలాగే ఆర్థిక వృద్ధి రేటు సైతం బాగుందని గణాంకాల ద్వారా వెల్లడి అవుతున్నాయని అంటున్నారు.

**బిలియనీర్ల సంపద :**

దేశంలో ఉన్న మొత్తం 308 మంది బిలియనీర్ల మొత్తం సంపద ఎంత అంటే నోరు వెళ్లబెట్టేటంత అని జవాబు వస్తుంది. అచ్చంగా 112.6 లక్షల కోట్ల రూపాయల సంపద వీరి దగ్గర ఉంది అన్న మాట. అంటే 112.6 ట్రిలియన్లుగా కూడా చెప్పవచ్చు. ఇందులో కూడా 199 మంది సంపద పెద్ద ఎత్తున పెరిగింది. మిగిలిన 109 మంది సంపద స్థిరంగా ఉండటం జరుగుతోంది. అంటే ఈ అపర కుబేరుల మొత్తం సంపద మరో పది శాతం పెరిగింది అని లెక్కలు చెబుతున్నాయి.

**అన్ని రంగాల్లో కుబేరులు :**

ఇక ఈ నివేదిక ప్రకారం చూస్తే కనుక అన్ని రంగాలలో అపర కుబేరులు అవతరిస్తున్నారు అని అర్థం అవుతోంది. ఆరోగ్య రంగానికి చెందిన వారు 53 మంది బిలియనీర్లు గా ఉంటే ఇండస్ట్రియల్ గూడ్స్ నుంచి 36 మంది, కన్జ్యూమర్ గూడ్స్ నుంచి 31 మంది కొత్తగా అపర కుబేరుల జాబితాలో చేరిపోయారు. అదే విధంగా ఇంధన రంగంలో కూడా అపర కుబేరులు ఉన్నారు. ఎనిమిది మంది దాకా ఈ రంగంలో ఉంటే వీరి సంపద చూస్తే ఇంధన రంగం అత్యధిక సంపదను కలిగి 18.3 లక్షల కోట్ల రూపాయలు ఉండడం విశేషం.

**కుబేరుల నగరంగా :**

దేశంలో కుబేరుల నగరం ఏదీ అంటే ఎక్కువ మంది బిలియనీర్లు ఉన్నది దేశ ఆర్థిక రాజధాని ముంబైలో అని తెలుస్తోంది. అక్కడ 95 మంది బిలి యనీర్లు ఉన్నారు. ముంబైలో కొత్తగా 15 మంది బిలియనీర్లు జత కలిశారు. దాంతో న్యూయార్క్, లండన్ లను ముంబై ఈ విషయంలో అధిగమించింది అని అంటున్నారు.

**దేశంలో ఎవరెవరంటే?**

భారతీయ కుబేరుల జాబితా కేవలం ఐటీ, ఫార్మా, ఏఐ రంగాలకే పరిమతం కాలేదు. కాదేదీ సంపదకు అనర్హం అన్నట్లు అన్ని రంగాల్లోనూ కుబేరులు పెరిగారు. వారిలో బాలీవుడ్ హీరో షారుఖ్ ఖాన్ ఫిజిక్స్ వాలా వ్యవస్థాపకులు అలఖ్ పాండే, ప్రతీక్ మహేశ్వరి, మెరిల్ లైఫ్ సైన్సెస్‌కు చెందిన షాహిద్ బిలాఖియా, ఎం3ఎం ఇండియాకు బసంత్ బన్సాలు ఇలా పలు రంగాల వారు కుబేరులా జాబితాలో చేరారు. ముకేశ్ అంబానీ తర్వాత వరుసగా రూ.7.5 లక్షల కోట్లతో గౌతమ్ అదానీ ఫ్యామిలీ, రూ.3.2 లక్షల కోట్ల తో హెచ్‌సీఎల్ టెక్ చైర్మన్ రోష్నీ నాడార్ కుటుంబం వరుసగా 2,3 స్థానాల్లో ఉండగా సీరమ్ ఇన్‌స్టిట్యూట్ స్థాపకుడు సైరస్ పూనావాలా (రూ.3 లక్షల కోట్లు), ఆదిత్య బిర్లా గ్రూప్ అధిపతి కుమార మంగళం బిర్లా (రూ.2.5 లక్షల కోట్లు) లు తరువాతి స్థానం(4,5) లో ఉన్నారు. ఇక ఆ తరువాతి స్థానాల్లో సన్‌ఫార్మా దిలీప్ సంఘ్వీ, విప్రో వ్యవస్థాపకులు అజీమ్ ప్రేమ్‌జీ, నీరజ్ బజాజ్ ఫ్యామిలీ, ఆశోక్ హిందుజా కుటుంబం, డీమార్ట్ ఫౌండర్ రాధాకిషన్ దమానీ వరుసగా 6 నుంచి 10 వరకు స్థానాల్లో నిలిచారు.

హురున్ నివేదిక ప్రకారం గత ఒక సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా సంపద సృష్టి చాలా వేగంగా జరిగింది. దాదాపు ప్రతి రోజూ ఇద్దరు కొత్త బిలియనీర్‌లు ఏర్పడ్డారు.

## మహిళా కుబేరులు



కుబేరుడు అంటే పురుషుడే కావచ్చు. కానీ మహిళకు తాము ఏమీ తీసిపోమని ఆ వివక్ష అవసరం లేదని చాటి చెబుతున్నారు. ఆ విధంగా మొత్తం 308 బిలియనీర్లలో ఏడు శాతం అంటె 23 మంది మహిళా కుబేరులు ఉండడం విశేషం. వీరి వద్ద ఉన్న సంపద ఏకంగా 9.8న్ లక్షల కోట్లు ఉన్నట్లుగా హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్-2026 నివేదిక వెల్లడించింది. వయసుల వారీగా చూస్తే ప్రపంచ కుబేరుల సగటు వయసు 65గా ఉంది. అదే భారత్ లో మాత్రం సగటు కుబేరుల వయసు 67గా నమోదు అయింది. ఏది ఏమైనా భారత్ పేద దేశం అని ఎవరు అన్నారు అని వీరిని చూసినపుడు ప్రశ్న వేసుకోవాలి. అయితే సంపద సృష్టి ఇంతలా జరుగుతున్నా ఫలాలు మాత్రం అందరికీ సమానంగా దక్కడం లేదన్న వాదన మాత్రం ఎప్పటికీ సజీవంగా ఉంటోంది.

**దేశంలోనే అత్యంత ధనవంతురాలైన మహిళ:**

రోష్ని నాదర్ మల్హోత్రా రూ.3.2 ట్రిలియన్ల (1.2 ట్రిలియన్) నికర విలువతో మూడవ స్థానంలో నిలిచారు. భారతదేశంలోని టాప్ 10 ధనవంతులలో ఆమె ఏకైక మహిళ. సైరస్ ఎస్. పూనావాలా నాల్గవ స్థానానికి ఎగబాకారు.

గత 10 సంవత్సరాల్లో భారత్ ధనవంతుల జాబితాలో పెద్ద మార్పు జరిగింది. ప్రస్తుతం ఉన్న భారత బిలియనీర్‌లలో 80 శాతం మందికి పైగా 10 సంవత్సరాల క్రితం ఈ జాబితాలో లేరు. ఇది దేశంలో వేగంగా జరుగుతున్న ఆర్థిక మార్పులు, వ్యాపార ఆత్మవిశ్వాసం స్పష్టంగా చూపిస్తోంది. ముగింపుగా చూస్తే భారత్‌లో వ్యాపారాలు వేగంగా పెరుగుతున్నాయి. కొత్త రంగాలు అవకాశాలు సృష్టిస్తున్నాయి. యువ వ్యాపారవేత్తలు ముందుకు వస్తున్నారు. ఈ మార్పులు కొనసాగితే భవిష్యత్తులో ప్రపంచ సంపద సృష్టిలో భారత్ మరింత కీలక కేంద్రంగా మారే అవకాశం ఉంది

**వెంకటేశ్వరదాస్ – కల్చరల్ రిపోర్టర్,**
**విశాఖపట్నం – 99892 65111**

## అగ్రస్థానంలో ఆరు దేశాలు



ప్రపంచవ్యాప్తంగా బిలియనీర్ల సంఖ్య 2025 నాటికి కొత్త శిఖరాలను తాకింది. ఆర్థిక సంపద పెరుగుదల, సాంకేతిక ఆవిష్కరణలు, వ్యాపార విస్తరణలతో కొన్ని దేశాలు ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచాయి. 2025, ఏప్రిల్ 4 నాటి లెక్కల ప్రకారం, అమెరికా అత్యధిక బిలియనీర్లతో మొదటి స్థానంలో ఉండగా, చైనా, భారత్ వంటి దేశాలు కూడా ఈ జాబితాలో ముందువరుసలోనే నిలిచాయి. ఈ ఆరు దేశాలు ప్రపంచ సంపదలో సింహభాగాన్ని కలిగి ఉన్నాయి. సాధారణంగా ఒక బిలియన్ డాలర్‌కుపైగా సంపద ఉంటే వారిని బిలియనీర్ అంటారు. బిలియన్ డాలర్ అంటే ప్రస్తుతం భారత కరెన్సీలో రూ. 8,500 కోట్లకుపైగా ఉంది. ఇప్పుడు మనం 2025లో అత్యధిక బిలియనీర్స్ 6 దేశాల గురించి చూద్దాం.

**1. అమెరికా..** 902 మంది బిలియనీర్లతో ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో ధనవంతులకు నిలయంగా నిలిచింది అమెరికా. వీరి మొత్తం సంపద రూ. 6.8 ట్రిలియన్ డాలర్లుగా (సుమారు రూ. 570 లక్షల కోట్లు) ఉంది. టెస్లా, స్పేస్ఎక్స్ వంటి సంస్థలతో ఎలాన్ మస్క్ ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నారు.

**2. చైనా..** ఆసియా దిగ్గజం చైనా 450 బిలియనీర్లతో రెండవ స్థానంలో నిలిచింది. వీరి సంయుక్త సంపద రూ.1. 7 ట్రిలియన్ డాలర్లు (సుమారు రూ. 142 లక్షల కోట్లు). టిక్‌టాక్ యజమాని జాంగ్ యిమింగ్ చైనాలో అత్యంత ధనవంతుడిగా ఉన్నారు.

**3. భారతదేశం..** మన దేశంలో 200 కంటే ఎక్కువ బిలియనీర్లు ఉన్నారు. మొత్తంగా ఈ లిస్టులో మూడో స్థానంలో నిలిచింది. టెక్ స్టార్టప్‌లు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులతో ఈ సంఖ్య పెరిగింది. టాటా, రిలయన్స్, అదానీ గ్రూప్‌లు వంటి సంస్థలు భారత సంపన్నుల లెక్క పెరగడానికి కారణమయ్యాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ (92.5 బిలియన్ డాలర్లు) భారత్‌లోనే అత్యంత ధనవంతుడిగా నిలిచారు.

**4. జర్మనీ..** యూరప్‌లోని ఈ ఆర్థిక కేంద్రం 150 కంటే ఎక్కువ బిలియనీర్లతో నాల్గవ స్థానంలో ఉంది. ఆటోమోటివ్, ఫార్మాస్యూటికల్స్, రిటైల్ రంగాలు ఈ దేశంలో ధనవంతులను సృష్టిస్తున్నాయి.

**5. రష్యా..** 140 మంది బిలియనీర్లతో ఐదవ స్థానంలో నిలిచింది రష్యా. వీరి సంయుక్త సంపద 580 బిలియన్ డాలర్లు. (సుమారు రూ. 48 లక్షల కోట్లు). శక్తి, ఖనిజ రంగాలు ఇక్కడ ప్రధానంగా ధనవంతుల్ని సృష్టిస్తున్నాయని చెప్పొచ్చు. అందుకే ఇక్కడ ఆయిల్, గ్యాస్, మైనింగ్ రంగాల్లో భారీ స్థాయిలో వ్యాపారం చేస్తున్న బిలియనీర్‌లు అధికంగా ఉన్నారు.

**6. కెనడా..** ఉత్తర అమెరికా దేశం కెనడా 76 మంది బిలియనీర్లతో ఆరో స్థానంలో ఉంది. వీరి సంపద 359 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 30 లక్షల కోట్లు). బైనాన్స్ మాజీ సీఈఓ చాంగ్‌పెంగ్ జావో ఇక్కడ అత్యంత ధనవంతుడు. రియల్ ఎస్టేట్, టెక్నా లజీ, బాంకింగ్ రంగాల్లోని సంస్థలు కెనడాలో సంపన్నుల సంఖ్య పెరగడానికి కారణం.

ఈ ఆరు దేశాలు సాంకేతికత, పారిశ్రామిక రంగాలు, వ్యాపార విస్తరణలో ముందంజలో ఉన్నాయి. అమెరికా టెక్ దిగ్గజాలకు కేంద్రంగా ఉండగా, చైనా తన తయారీ శక్తితో, భారత్ స్టార్టప్ విప్లవంతో ముందుకు సాగుతోంది. జర్మనీ, రష్యా, కెనడా వంటి దేశాలు తమ సంప్రదాయ బలాలను కాపాడు కుంటూ సంపద సృష్టిస్తున్నాయి. ఇక ఈ దేశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తు న్నాయి. భారత్ వంటి దేశాల్లో బిలియనీర్ల సంఖ్య వేగంగా పెరగడం దాని ఆర్థిక పురోగతిని సూచిస్తోం దని నిపుణులు చెబుతున్నారు. మరోవైపు ప్రపంచంలోనే అత్యధిక బిలియనీర్లు ఉన్న ఈ ఆరు దేశాలు ప్రపంచ సంపద పంపిణీలో తమ ఆధిపత్యాన్ని చాటుతున్నాయి.

సూర్య స్పోర్ట్స్

# భారత్ విశ్వ విజేత

- 2007, 2024 తర్వాత మూడోసారి టీ20 ప్రపంచకప్ కైవసం చేసుకున్న భారత్
- పొట్టి కప్‌ను డిఫెండ్ చేసుకున్న తొలి జట్టుగా టీమిండియా ప్రపంచ రికార్డు
- ఫైనల్లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో ఘన విజయం
- బ్యాటింగ్‌లో సంజూ శాంసన్ (89), బౌలింగ్‌లో బుమ్రా (4/15) అద్భుత ప్రదర్శన
- అహ్మదాబాద్ వేదికగా 255 పరుగుల భారీ స్కోరు నమోదు చేసిన భారత్














టీ20 ప్రపంచకప్ ఫైనల్లో టీమిండియా మరోసారి విశ్వరూపం చూపించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఆదివారం జరిగిన తుది పోరులో న్యూజిలాండ్‌ను చిత్తుచేసి విశ్వవిజేతగా నిలిచింది. ఈ విజయంతో భారత్ సరికొత్త చరిత్ర సృష్టించింది. 2007, 2024 తర్వాత ఇది టీమిండియాకు మూడో టీ20 వరల్డ్ కప్ కావడం విశేషం. మూడు సార్లు టీ20 వరల్డ్ కప్ గెలిచిన తొలిజట్టుగా టీమిండియా రికార్డు నెలకొల్పింది. దాంతోపాటే, ఆతిథ్య జట్టు వరల్డ్ కప్ నెగ్గడం కూడా ఇదే తొలిసారి. అంతేకాదు, టీ20 ప్రపంచకప్ చరిత్రలో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగి, టైటిల్‌ను నిలబెట్టుకున్న తొలి జట్టుగా టీమిండియా రికార్డులకెక్కింది. సొంతగడ్డపై జరిగిన ఈ మెగా ఫైనల్లో భారత్ ఏకంగా 96 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై ఘన విజయం సాధించి ట్రోఫీని ముద్దాడింది. 256 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. భారత బౌలర్ల ధాటికి కివీస్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. భారత పేస్ దళపతి జస్ప్రీత్ బుమ్రా తన మ్యాజిక్ బౌలింగ్‌తో కివీస్ పతనాన్ని శాసించాడు. కేవలం 15 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి నడ్డి విరిచాడు. న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో వికెట్ కీపర్ టిమ్ సీఫెర్ట్ (52), కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (43) మాత్రమే పోరాడారు. వీరిద్దరూ మినహా మిగిలిన బ్యాటర్లు ఎవరూ క్రీజులో నిలవలేకపోయారు. ముఖ్యంగా డారిల్ మిచెల్ (17), ఫిన్ అలెన్ (9), రచిన్ రవీంద్ర (1) వంటి స్టార్ ప్లేయర్లు విఫలమవడంతో కివీస్ 19 ఓవర్లలో 159 పరుగులకే ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో బుమ్రా 4, అక్షర్ పటేల్ 3 వికెట్లు పడగొట్టగా.. హార్దిక్, వరుణ్ చక్రవర్తి, అభిషేక్ శర్మ తలో వికెట్ దక్కించుకున్నారు.

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్.. న్యూజిలాండ్ బౌలర్లపై విరుచుకుపడింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ ఆకాశమే హద్దుగా చెలరేగారు. తొలి వికెట్‌కు వీరిద్దరూ కేవలం 7.1 ఓవర్లలోనే 98 పరుగులు జోడించి శుభారంభం అందించారు. అభిషేక్ శర్మ 21 బంతుల్లోనే 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 52 పరుగులు చేసి మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఆ తర్వాత వచ్చిన ఇషాన్ కిషన్ (54)తో కలిసి సంజూ శాంసన్ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ముఖ్యంగా శాంసన్ కివీస్ బౌలర్లను ఊచకోత కోశాడు. 46 బంతుల్లో 5 ఫోర్లు, ఏకంగా 8 సిక్సర్లతో 89 పరుగులు చేసి ఇన్నింగ్స్‌కు వెన్నెముకగా నిలిచాడు. చివర్లో శివమ్ దూబే (26 నాటౌట్) ధాటిగా ఆడటంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 255 పరుగుల భారీ స్కోరు సాధించింది. సూర్యకుమార్ యాదవ్ డకౌట్ అయినా.. టీమిండియా సమిష్టి ప్రదర్శనతో మూడోసారి ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది.టాస్ ఓడి బ్యాటింగ్కు దిగిన భారత్కు ఓపెనర్లు అభిషేక్, శాంసన్ అద్భుతమైన ఆరంభం అందించారు. గత మ్యాచ్ ఫామ్ను కొనసాగిస్తూ శాంసన్ మరో భారీ ఇన్నింగ్స్తో రెచ్చిపోయాడు. మరోవైపు వరుసగా విఫలమవుతూ వస్తున్న అభిషేక్ ఈ మ్యాచ్లో హాఫ్ సెంచరీతో మెరిశాడు. అతడు 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేశాడు. తొలి రెండు ఓవర్లలో ఇన్నింగ్స్ చప్పగా సాగినా, మూడో ఓవర్లో అసలైన విధ్వంసం షురూ అయ్యింది. అభిషేక్, శాంసన్ పోటీపడుతూ మరీ బౌండరీలు బాదారు. దీంతో స్కోర్ బోర్డు పరుగులు పెట్టింది. ఈ ఇద్దరు తొలి వికెట్కు 98 పరుగుల జోడించారు. 7.1 వద్ద రచిన్ రవీంద్ర బౌలింగ్లో అభిషేక్ ఔట్ అయ్యాడు.ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026 ఫైనల్ మ్యాచ్లో టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ విధ్వంసక ఇన్నింగ్స్తో చెలరేగిపోయాడు. న్యూజిలాండ్ బౌలర్లపై ఆకాశమే హద్దుగా విరుచుకుపడి పరుగుల సునామీ సృష్టించాడు. కేవలం 21 బంతుల్లోనే 6 ఫోర్లు, 3 భారీ సిక్సర్ల సహాయంతో 52 పరుగులు చేసి, ఫైనల్ పోరులో భారత్కు అదిరిపోయే ఆరంభాన్ని అందించాడు. అతని సుడిగాలి ఇన్నింగ్స్తో నరేంద్ర మోదీ స్టేడియం దద్దరిల్లిపోయింది. ఈ మెగా ఫైనల్లో టాస్ గెలిచిన న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ బౌలింగ్ ఎంచుకున్నాడు. అయితే అతని నిర్ణయం పూర్తిగా తలకిందులైంది. క్రీజులోకి వచ్చిన తొలి బంతి నుంచే అభిషేక్ శర్మ తన ఉద్దేశాన్ని స్పష్టం చేశాడు. కివీస్ పేసర్లు మాట్ హెన్రీ, జాకబ్ డఫీ, లాకీ ఫెర్గూసన్లను లక్ష్యంగా చేసుకుని బౌండరీల వర్షం కురిపించాడు. మరో ఓపెనర్ సంజూ శాంసన్ కూడా దూకుడుగా ఆడటంతో పవర్ప్లే ముగిసేసరికి భారత్ వికెట్ నష్టపోకుండా 92 పరుగులు చేసి రికార్డు సృష్టించింది. ముఖ్యంగా ఫెర్గూసన్ వేసిన రెండు ఓవర్లలోనే 48 పరుగులు రాబట్టారంటే భారత బ్యాటర్ల ఆధిపత్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ తొలి వికెట్కు కేవలం 7.1 ఓవర్లలోనే 98 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఈ క్రమంలోనే అభిషేక్ తన హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. రచిన్ రవీంద్ర బౌలింగ్లో భారీ షాట్కు ప్రయత్నించి అభిషేక్ ఔటయ్యాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్ కూడా అదే జోరును కొనసాగించాడు. మరోవైపు సంజూ శాంసన్ (37 బంతుల్లో 67 నాటౌట్) బాధ్యతాయుతమైన హాఫ్ సెంచరీతో ఇన్నింగ్స్ను నడిపించగా, ఇషాన్ కిషన్ (14 బంతుల్లో 34 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో 12 ఓవర్లు ముగిసేసరికి భారత్ కేవలం ఒక వికెట్ నష్టానికి 161 పరుగుల భారీ స్కోరుతో పటిష్ట స్థితిలో నిలిచింది. అభిషేక్ శర్మ వేసిన బలమైన పునాదిపై మిగతా బ్యాటర్లు భారీ స్కోరు దిశగా దూసుకెళ్తున్నారు.

**శాంసన్ హ్యాట్రిక్ :** అనంతరం వచ్చిన ఇషాన్తో కలిసి శాంసన్ విధ్వంసం కొనసాగించాడు. ఇషాన్ కూడా వేగంగా ఆడాడు. ఈ క్రమంలోనే శాంసన్ 33 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. అతడికిది ఈ టోర్నీలో హ్యాట్రిక్ హాఫ్ సెంచరీ. హాఫ్ సెంచరీ తర్వాత శాంసన్ గేరు మార్చాడు. రచిన్ వేసిన 15వ ఓవర్లో శాంసన్ వరుగా మూడు సిక్సు బాదాడు. ఇదే జోరులో ఇషాన్ కూడా హాఫ్ సెంచరీ కంప్లీట్ చేసాడు. దీంతో భారత్ ఇన్నింగ్స్లో తొలి ముగ్గురు బ్యాటర్లు 50ం స్కోర్లు నమోదు చేశారు.

**నీషమ్ షాక్ :** 15 ఓవర్లకు భారత్ 203-1 స్కోర్తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. అయితే అప్పుడే బంతి అందుకున్న నీషమ్ భారత్ను తీవ్రంగా దెబ్బ కొట్టాడు. తొలి బంతికే శాంసన్ను అతడు ఔట్ చేశాడు. బారీ షాట్కు ప్రయత్నించిన శాంసన్ 89 పరుగులు వ్యక్తిగత స్కోర్ వద్ద ఔట్ అయ్యాడు. ఇక క్రీజులో కుదురుకున్న ఇషాన్ (54) అదే ఓవర్ ఐదో బంతికి పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత కెప్టెన్ సూర్య వచ్చీ రావడంతోనే భారీ షాట్కు ప్రయత్నించాడు. కానీ బౌండరీ లైన్ వద్ద రచిన్ అద్భుత క్యాచ్ అందుకున్నాడు. దీంతో ఒకే ఓవర్లో భారత్ మూడు కీలక వికెట్లు కోల్పోయింది. ఈ ఓవర్లో ఒకే పరుగు వచ్చింది.

**చివర్లో అదుర్స్:** అయితే 16వ ఓవర్లో మ్నరీడు వికెట్లు పడడంతో స్కోర్ వేగం తగ్గింది. కానీ పాండ్య ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన దూబే ఆఖరి ఓవర్లో ఇరగదీశాడు. నీషమ్ వేసిన ఈ ఓవర్లో వరుసగా 4,6,6,4,0,4 బాదేశాడు. దీంతో ఆఖరి ఓవర్లో 24 పరుగులు వచ్చాయి. దీంతో భారత్ స్కోర్ 250 దాటింది.

**శాంసన్ రికార్డ్ :** ఈ క్రమంలోనే శాంసన్ అరుదైన రికార్డు కొట్టాడు. సెమీస్తోపాటు ఫైనల్లోనూ 50ం స్కోర్ చేసిన మూడో బ్యాటర్గా రికార్డు సాధించాడు. అతడికంటే ముందు గతంలో షాహిద్ అఫ్రిది, విరాట్ కోహ్లీ ఈ ఘతన సాధించారు.

సూర్య www.suryaa.com

# సినిమా

## పోటాపోటీగా మహేష్, అల్లుఅర్జున్

తెలుగు చిత్రసీమలో అగ్ర కథానాయకులుగా వెలు గొందుతున్న సూపర్‌స్టార్ మహేష్ బాబు, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఇప్పుడు వెండి తెరపైనే కాకుండా థియేటర్ల వ్యాపారంలోనూ ఒకరికొకరు గట్టి పోటీని ఇస్తున్నారు. ఏషి యన్ సినిమాస్‌తో కలిసి మహేష్‌బాబు నిర్మించిన ఏఎంబీ సినిమాస్ ఇప్పటికే హైదరాబాద్‌లో ఒక బ్రాండ్‌గా మారిపోయింది. గచ్చిబౌలిలో ఉన్న ప్రధాన బ్రాంచ్‌తో పాటు, ఇటీవల బెంగళూరులో కూడా ఏఎంబీ సినిమాస్ కార్య కలాపాలను ప్రారంభించడం విశేషం. అంతేకా కుండా హైదరాబాద్‌లో మరో కొత్త బ్రాంచ్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో ప్రారంభించిన సంగతి తెలిసిందే. తదుపరి హైదరాబాద్‌లోనే హకీం పేటలో మరో కొత్త మల్టీప్లెక్స్ నిర్మాణం కోసం ప్రణాళికలు ఉండగా, గోవా, చెన్నైలోను ఏఎంబి మాల్స్ నిర్మాణం కోసం ఏషియన్ తో కలిసి ప్లాన్ చేస్తున్నారని కూడా కథనాలొచ్చాయి. మరోవైపు అల్లు అర్జున్ తన ఏఏఏ సినిమాస్ బ్రాండ్‌ను శరవేగంగా విస్తరిస్తున్నారు. కోకాపేటలో నిర్మిం చిన అల్లు సినిమాస్ పనులు దాదాపు ముగింపు దశకు చేరుకున్నాయి. వాస్తవానికి ఈ సంక్రాం తికే ఇది ప్రారంభం కావాల్సి ఉన్నా కానీ.. కొన్ని నిర్మాణ పనుల జాప్యం కారణంగా వాయిదా పడింది. ఎట్టకేలకు దురంధర్2 ప్రీమియర్‌తో ఇది మొదలవుతోందని సమాచారం. ఉగాది పర్వదినం సందర్భంగా ఈ భారీ మల్టీప్లెక్స్ మరింత కళకళలాడబోతోంది. పవర్‌స్టార్ ఉస్తాద్ భగత్ సింగ్ ఈ థియేటర్‌లో ఆడనుంది. ఇటీవల అల్లుశిరీష్ ప్రీ-వెడ్డింగ్ వేడుకను కూడా ఇదే ప్రాంగణంలో నిర్వహించడం ద్వారా ఈ మల్టీప్లెక్స్ సందడి అప్పుడే మొదలైంది. మరో వైపు వైజాగ్‌లోను ఏఏఏ సినిమాస్ బ్రాండ్‌ను అల్లు అర్జున్ బృందం విస్తరిస్తున్న సంగతి తెలిసిందే. కోకాపేట 'ఏఏఏ సినిమాస్' ప్రత్యేకతలు ప్రేక్షకులను ఆశ్చర్యపరి చేలా ఉన్నాయి. దేశంలోనే అతిపెద్ద 'డాల్బీ స్క్రీన్' ఈ థియేటర్‌లో అందుబాటులో ఉంది. ఈ భారీ స్క్రీన్‌తో పాటు మరో మూడు స్క్రీన్లు ఇక్కడ అందుబాటులోకి రానున్నాయి. ఈ మల్టీ ప్లెక్స్‌లో ప్రదర్శించబడే మొదటి పెద్ద చిత్రంగా 'దురంధర్' సీక్వెల్ ఉండ బోతోందని సమాచారం. ఆ తర్వాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' వంటి భారీ చిత్రాలు ఇక్కడ సందడి చేయనున్నాయి. ఉగా దికి విడుదలయ్యే కొత్త సినిమాలు ఈ అత్యా ధునిక స్క్రీన్లపై ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచనున్నాయి.




హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం ఏఎంబీ, ఏఏఏ సినిమాస్ మధ్య పోటాపోటీ వాతావరణం కనిపిస్తోంది. ఏషియన్ సినిమాస్ భాగస్వామ్యంతో మహేష్ బాబు, అల్లు అర్జున్ ఇద్దరూ కూడా అత్యున్నత సాంకేతిక ప్రమాణా లతో కూడిన మల్టీప్లెక్స్‌లను నిర్మించేందుకు పోటీపడుతున్నారు. ప్రేక్షకులు కేవలం సినిమా చూడటమే కాకుండా ఒక లగ్జరీ యాంబియెన్స్ అనుభూతిని పొందేలా ఈ థియేటర్ల డిజైన్ ఉం డటం విశేషం. ఏఎంబీ క్లాస్ లుక్‌తో ఆకట్టుకుంటుంటే, అల్లు సినిమాస్ టెక్నాలజీ పరంగా సరికొత్త రికార్డులను సృష్టించేందుకు సిద్ధమైంది. మల్టీప్లెక్స్ వ్యాపార రేసులో మహేష్, అల్లు అర్జున్ ముందు వరుసలో ఉన్నా కానీ.. యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ కూడా ఈ రంగంలో తన అడుగులు వేస్తున్నారు. అయితే ప్రభాస్ తన థియేటర్ల వ్యాపారాన్ని నెల్లూరు వంటి ప్రాంతా లకు పరిమితం చేశారు తప్ప ఇప్పటివరకు హైదరాబాద్‌లో సొంత మల్టీప్లెక్స్‌ను ప్రారం భించలేదు. ప్రభాస్ నుంచి కూడా భవిష్యత్తులో హైదరాబాద్ మార్కెట్లోకి ఎంట్రీ ఉంటుందేమో నని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక ఇతర అగ్ర హీరోలైన యంగ్ టైగర్ ఎన్టీఆర్, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం థియేటర్ల వ్యాపారంలో తటస్థంగా వ్యవహరిస్తున్నారు.

## 'దండోరా' ఇక్కడితో ఆగే సినిమా కాదు..
## ముమ్ముందు చాలా అవార్డులు వస్తాయి- హీరో శివాజీ

తెలంగాణ ప్రభుత్వం తాజాగా ప్రకటించిన 'గద్దర్ అవార్డులు 2025'లో 'దండోరా' సత్తా చాటుకుంది. మూడు కేటగిరీల్లో 'దండోరా' అవార్డుల్ని కొల్లగొట్టేసింది. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ నిర్మాణంలో మురళీకాంత్ 'దండోరా' చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ చిత్రంలో శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి, రాధ్య, అదితి భావరాజు ముఖ్య పాత్రల్ని పోషించారు. తమ సినిమాకు ప్రభుత్వం ప్రకటించిన అవార్డులు, ఇచ్చిన గుర్తింపు సందర్భంగా చిత్రయూనిట్ థాంక్స్ చెబుతూ మీడియా సమావేశం నిర్వహించింది. ఈ థాంక్యూ మీట్‌లో... శివాజీ మాట్లాడుతూ... 'మా 'దండోరా' సినిమాని గుర్తించి అవార్డుల్ని ఇచ్చిన జ్యూరీకి, తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు. శంఖంలో పోస్తే తీర్థం అవుతుంది. ఎన్టీఆర్ వేసిన ట్వీట్‌తో తెలుగు వారందరికీ ఈ చిత్రం దగ్గరైంది. మార్క్ కె రాబిన్‌కి అవార్డు రావడం ఆనం దంగా ఉంది. నాకు ఈ చిత్రంలో అవకాశం ఇచ్చిన బెన్నీకి థాంక్స్. ఈ మూవీ కోసం పని చేసిన ప్రతీ ఒక్కరికీ ఈ అవార్డుల్లో భాగం ఉంటుంది. తెలుగు వాళ్ల ప్రతిభను, సత్తాను చాటే చిత్రమిది. మురళీగారు 'దండోరా' కథని, మూవీని మా కోసమే తీశాడనిపిస్తుంది. ఈ పాత్ర కోసం, లుక్ కోసం నేను చాలా వరకు రాత్రి పూట రెండు, మూడు గంటలే నిద్రపోయే వాడ్ని. నటన అంటే దైవంతో సమానం. రాధ్య అనే పాప పాత్ర లేకపోయి ఉంటే ఈ సినిమా నేను చేసే వాడ్ని కాదు. నవదీప్, నందు, బిందు మాధవి ఇలా అందరూ ఫైనెస్ట్ యాక్టర్స్. ఈ మూవీ ఇంకా చాలా దూరం వెళ్తుందని నమ్ము తున్నాను. ఇక్కడితో ఆగే సినిమా అయితే కాదు. ముమ్ముందు చాలా అవార్డులు వస్తాయని ఆశిస్తున్నాను' అని అన్నారు. దర్శకుడు మురళీకాంత్ మాట్లాడుతూ.. 'మా 'దండోరా' సిని మాకు ఇలాంటి గుర్తింపు ఇచ్చిన జ్యూరీకి, ప్రభుత్వానికి థాంక్స్. ఈ ప్రయాణంలో తోడుగా నిలిచిన నా టీంలోని ప్రతీ ఒక్కరికీ థాంక్స్. కొత్త దర్శకుడిని అయినా సరే నా టీం అంతా నన్ను నమ్మింది. ఎంతో అనుభవం ఉన్న యాక్టర్స్ సైతం నాకు చాలా సపోర్ట్ చేశారు. మార్క్ కె రాబిన్ మా సినిమాకి ప్రాణం. ఆయన, నేను కలిసి ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపి సినిమాకు పని చేశాం. ఇలాంటి అవార్డులు, గుర్తింపు వచ్చిన సమయాల్లోనే మన వద్ద ఉన్న టాలెంట్ గురించి అందరికీ తెలుస్తుంది. శివాజీ వల్లే ఈ చిత్రం ఈ స్థాయికి వచ్చింది. ఎక్కడా, ఏనాడూ కూడా ఎలాంటి ఇబ్బంది పెట్టలేదు. కనీసం కేరవ్యాన్ కూడా ఆయన అడగలేదు. ఆయనలాంటి మంచి వ్యక్తి, గొప్ప ఆర్టిస్టులు మనకు అవసరం. ఈ సినిమా చూసి ఎంతో మంది ఐఏఎస్, ఐపీఎస్‌లు పర్సనల్‌గా నాకు ఫోన్ చేసి అభినందించారు. ఇలాంటి గుర్తింపు, అవార్డులు వస్తే మరింత మంచి చిత్రాల్ని, సందేశాత్మక సినిమాల్ని తీయాలనే ప్రోత్సాహం లభిస్తుంది' అని అన్నారు.




## ఇంట్రెస్టింగ్ గా విక్రమ్ ఆన్ డ్యూటీ -ఎంఎం కీరవాణి

బిగ్ బాస్ విన్నర్ నిఖిల్ మలియక్కల్ హీరోగా బ్రహ్మ రుద్ర దర్శకత్వంలో రూపొందిన క్రైమ్ థ్రిల్లర్ విక్రమ్ ఆన్ డ్యూటీ. జ్ఞాపిక ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై ప్రవీణ, అనిల్ కడియాల నిర్మించారు. జియో హాట్ స్టార్‌లో స్ట్రీమ్ అవుతున్న ఈ సిరిస్ టాప్ వన్‌లో ట్రెండ్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ ప్రెస్ మీట్ కి ఆస్కార్ విజేత ఎం ఎం కీరవాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంఎం కీరవాణి మాట్లాడుతూ... నా మిత్రులు అనిల్ గారు ప్రవీణ కోసం ఈ వేడుకకి రావడం జరిగింది. ఈ వెబ్ సిరీస్ లో కొన్ని గ్లింప్స్ చూశాను. హంట్ అనే యూనిట్ ద్వారా క్రైమ్ ఇన్వెస్టిగేషన్ జరుగుతుంది. హంట్ తో టాలెంట్ హంట్ జరగడం చాలా సంతోషాన్ని ఇస్తుంది. ఇండస్ట్రీకి చాలామంది కొత్త వాళ్ళు రావాలి. కొత్త మ్యూజిక్ డైరెక్టర్ సుహాస్ కి ఆల్ ది వెరీ బెస్ట్. తన మ్యూజిక్ బిట్స్ బావున్నాయి. ఇది ఆల్రెడీ నెంబర్ వన్ స్ట్రీమింగ్ లో ఉందని తెలిసింది. హాట్‌స్టార్ కి కంగ్రాజులేషన్స్ హర్ష గారు తన అనుభవాన్ని రంగరించి చేస్తున్నారు. చిన్నప్పుడు కొమ్మూరి సాంబశివరావు గారి డిటెక్టివ్ నవల చదివాను. అందులో డిటెక్టివ్ తన బ్రెయిన్ ఉపయోగించి కొన్ని నేరాలని పరిశోధిస్తుంటాడు. అలాగే మధుబాబు గారి నవలల్లో యాక్షన్ కూడా ఉంటుంది. ఈ సిరిస్ ఆ రెండూ ఉంటాయని ఆశిస్తున్నాను. చివరిగా ఒక హుక్ లైన్ ఇవ్వాలంటే.. విక్రమ్ ఆన్ డ్యూటీ బికాస్ ఆఫ్ హర్ష అఫ్ డ్యూటీ. అందరికి ఆల్ ద బెస్ట్. ప్రొడ్యూసర్ ప్రవీణ మాట్లాడుతూ.. పాడుతా తీయగా ప్రోగ్రామ్ సమయంలో కీరవాణి గారిని కలిసాను. అప్పటినుంచి మా జర్నీ ఒక ఫ్యామిలీ లాగా కొనసాగుతోంది. ఆయన ఈ వేడుకకు రావడం నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. మా ప్రాజెక్టు జియో హాట్ స్టార్‌లో రావడం చాలా అదృష్టంగా భావిస్తున్నాను. హర్ష గారి కథ చెప్పినప్పుడే సక్సెస్ అవుతుందని అనుకున్నాను. నందిని అనిల్ గారు ఈ ప్రాజెక్టు కోసం చాలా కష్టపడ్డారు. సమీర్ మేము చేసే ప్రతి ప్రాజెక్టులో ఉంటారు. నిఖిల్ విక్రమ్ గా అద్భుతంగా చేశారు.



## సంయుక్త ది బ్లాక్ గోల్డ్



వెర్సటైల్ హీరోయిన్ సంయుక్త ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ హై-వోల్టేజ్, హీరోయిన్-సెంట్రిక్ పాన్-ఇండియన్ యాక్షన్ డ్రామా ది బ్లాక్ గోల్డ్‌లో నటిస్తున్నారు. యోగేష్ కెఎంసి దర్శకత్వంలో హాస్య మూవీస్ బ్యానర్‌పై మాగంటి పిక్చర్స్‌తో కలిసి రాజేష్ దండా నిర్మిస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ది బ్లాక్ గోల్డ్ టీం ఒక పవర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో హీరోయిన్ సంయుక్త ప్రమాదకరమైన మైనింగ్ ప్రాంతం మధ్యలో నిలబడి కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. కథలోని కఠినమైన పరిస్థితులను ప్రతిబింబించేలా ఆ మైనింగ్ బ్యాక్‌డ్రాప్‌ను చూపించారు. పోస్టర్‌లో సంయుక్త చేతిలో రైఫిల్ పట్టుకుని కనిపించారు. ఆమె ముఖం మీద దుమ్ము, చేతులపై గాయాలు కనిపించడం కథలో ఘర్షణను ప్రజెంట్ చేస్తోంది. ఈ లుక్ సినిమాలోని రా, ఇంటెన్స్ టోన్‌కు పర్ఫెక్ట్ యాప్ట్. పోస్టర్‌లో బ్యాక్‌గ్రౌండ్‌లో కనిపించే అగ్నిప్రమాదాలు, బొగ్గుతో నిండిన రైలు మైనింగ్ ప్రాంతం గుండా దూసుకెళ్తున్న విజువల్స్ సినిమా భారీ యాక్షన్ స్థాయిని సూచిస్తున్నాయి.

## స్కేల్.. టెన్షన్.. డెడ్లీ యాక్షన్
## 'ధురంధర్: ది రివెంజ్' ట్రైలర్



ఈ సంవత్సరంలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈవెంట్ ధురంధర్ ది రివెంజ్ అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ధురంధర్ బాక్సాఫీస్ వద్ద ఒక సంచలనం, ఆల్ టైం బిగ్గెస్ట్ హిందీ చిత్రంగా నిలిచిన తర్వాత, ఇప్పుడు సీక్వెల్ రాబోతోంది, మరింత గొప్ప కాన్వాస్‌పై, తీవ్రతను పూర్తిగా కొత్త స్థాయికి తీసుకెళ్ళింది. ట్రైలర్‌లో రణవీర్ సింగ్ జస్కిరత్ సింగ్ రంగీ పాత్రలో మరోసారి తీవ్రతతో కనిపించారు. ఈసారి ఆయన జస్కిరత్, హమ్జా అనే రెండు పాత్రల్లో కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. కథలో కీలక పాత్రలుగా ఆర్. మాధవన్ వ్యూహాత్మక మాస్టర్‌మైండ్ అజయ్ సన్యాల్, అర్జున్ రాంపాల్ ఐఎస్ఐ మేజర్ ఇక్బాల్ పాత్రలో భయంకరమైన విలన్‌గా, అలాగే సంజయ్ దత్ ఎస్పీ చౌధరి అస్లంగా శక్తివంతమైన పాత్రలో కనిపించారు. అత్యంత భారీ యాక్షన్ సన్నివేశాలు, పదునైన డైలాగ్స్, థియేటర్లలో ప్రేక్షకుల నుంచి భారీ విజిల్స్ వచ్చేలా చేసే సన్నివేశాలతో ట్రైలర్ మొత్తం ఒక భారీ రివెంజ్ సాగాకు నాంది పలుకుతోంది. "హోంస్లా. ఈంధన్. బద్లా." అనే ట్యాగ్‌లైన్ ఈ సీక్వెల్‌ను ముందుకు నడిపించే రివెంజ్ కథను సూచిస్తోంది.

## జోరు పెంచిన నయన్



ప్రతిభతో పాటు అదృష్టం కూడా ఉంటే ఇండస్ట్రీని దశాబ్దాల పాటు ఏలేయొచ్చు అని నిరూపిస్తున్న అతి కొద్ది మంది హీరోయిన్స్ లో నయనతార ప్రథమ స్థానంలో నిలుస్తుంది. సౌత్ లేడీ సూపర్ స్టార్ గా పేరు దక్కించుకున్న ఈమె తమిళ్, మలయాళం, తెలుగు , హిందీ భాషల్లో సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఒకవైపు హీరోయిన్ పాత్రలతో మరొకవైపు ఆధ్యాత్మిక పాత్రలతో మెరిసిన నయనతార.. అటు యాక్షన్ పెర్ఫార్మెన్స్ తో కూడా అదరగొడుతున్న విషయం తెలిసిందే. ఒకవైపు హీరోయిన్గా మరొకవైపు నిర్మాతగా కూడా అడుగులు వేస్తున్న ఈమె.. ఇప్పుడు ఏకంగా టాలీవుడ్ మొదలుకొని బాలీవుడ్ వరకు సీనియర్ స్టార్ హీరోలకు కేరాఫ్ అడ్రస్ గా మారింది. ప్రముఖ కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ విఘ్నేష్ శివన్ ను ప్రేమించి పెళ్లి చేసుకున్న ఈమె.. సరోగసి ద్వారా ఇద్దరు మగ కవల పిల్లలకు జన్మనిచ్చింది. వివాహం తర్వాత ఈమె జోరు మరింత పెరిగిందనే చెప్పాలి. ఇందులో భాగంగానే .. 2023లో షారుక్ ఖాన్ తో కలిసి జవాన్ సినిమా చేసి ఊహించని పాపులారిటీ సొంతం చేసుకుంది. అటు బాలీవుడ్ లో కూడా తన మార్కెట్ ను పెంచుకుంది ఈ ముద్దుగుమ్మ. ఈ ఏడాది మెగాస్టార్ చిరంజీవితో మన శంకర వరప్రసాద్ గారు సినిమా చేసి ఇండస్ట్రీ హిట్ ను తన ఖాతాలో వేసుకుంది అంతేకాదు తాను పెట్టుకున్న కండిషన్స్ అన్నింటిని కూడా పక్కన పెట్టి మరీ ఈ సినిమాను ప్రమోట్ చేసి వార్తల్లో నిలిచింది నయనతార. అయితే అలాంటి ఈమె ఇప్పుడు మరో క్రేజీ హీరో సరసన నటించే అవకాశాన్ని అందుకున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై త్వరలో అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలు ఉన్నాయి. ఆయన ఎవరో కాదు బాలీవుడ్ స్టార్ హీరో, కండల వీరుడు సల్మాన్ ఖాన్. వంశీ పైడిపల్లి దర్శకత్వంలో దిల్ రాజు నిర్మాణంలో రూపుదిద్దుకుంటున్న ఒక బడా ప్రాజెక్టులో నయనతార అవకాశం అందుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇక దీనిపై త్వరలోనే అటు చిత్ర బృందం నుండి లేదా ఇటు నయనతార నుండి అధికారిక అనౌన్స్మెంట్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఏది ఏమైనా వయసు పెరుగుతున్నా కూడా నయనతార క్రేజ్ ఏమాత్రం తగ్గట్లేదు.. లేడీ సూపర్ స్టార్ అనే ట్యాగ్ కి తగ్గట్లుగానే స్టార్ హీరోల సినిమాలలో అవకాశాలు అందుకుంటూ దూసుకుపోతోంది. ఇక ఎంతోమందికి రోల్ మోడల్ గా నిలిచిన నయనతార ప్రతిభతో పాటు అదృష్టాన్ని కూడా మూటగట్టుకొని ఇండస్ట్రీలో స్టార్ హీరోలతో సమానంగా దూసుకుపోతూ ఉండడం విశేషం. ఇక నయనతార ప్రస్తుత సినిమాల విషయానికొస్తే.. ఒకవైపు స్టార్ హీరోల సినిమాలలో హీరోయిన్ గానే కాకుండా.. మరొకవైపు లేడీ ఓరియంటెడ్ చిత్రాలతో కూడా అలరిస్తోంది. అందులో భాగంగానే గతంలో వచ్చిన మూకుత్తి అమ్మన్ సినిమాకి సీక్వెల్ గా వస్తున్న మూకుత్తి అమ్మన్ 2లో నటిస్తోంది. ఈ చిత్రానికి ప్రముఖ స్టార్ డైరెక్టర్ సుందర్ సి దర్శకత్వం వహిస్తున్నారు. అలాగే గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో వరల్డ్ కమర్షియల్ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతున్న టాక్సిక్ సినిమాలో కూడా అవకాశం అందుకుంది . కన్నడ హీరో యష్ లీడ్రోల్ పోషిస్తున్న ఈ సినిమాలో ఆయనకు సోదరి పాత్రలో యాక్షన్ పర్ఫామెన్స్ తో అదరగొట్టడానికి సిద్ధమయ్యింది నయనతార.

## విశాల్ హీరోగా , సుందర్. సి దర్శకత్వంలో
## 'మొగుడు'



విశాల్, సుందర్. సి కాంబోలో ఇది వరకు వచ్చిన 'ఆంబళ', 'మద గద రాజా' చిత్రాలు బ్లాక్ బస్టర్‌గా నిలిచాయి. ఇక ఇప్పుడు హ్యాట్రిక్ కొట్టే క్రమంలో ఈ ఇద్దరూ కలిసి 'మొగుడు' అనే మూవీ చేస్తున్నారు. ఈ చిత్రంలో తమన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. డా. ఎ.సి. షణ్ముఖం ఆశీస్సులతో అవని సినిమాస్ ప్రై.లి., బెంజ్ మీడియా ప్రై.లి. బ్యానర్లపై ఈ మూవీని అరుణ్ కుమార్, ఖుష్బూ సుందర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో నవదీప్, సంపత్, అజయ్ ఘోష్, గరుడ రామ్, వీటీవీ గణేష్, యోగి బాబు ప్రధాన పాత్రల్ని పోషిస్తున్నారు. 'మొగుడు' సినిమాకి సంబంధించిన టైటిల్ ప్రోమోను ఇదివరకే రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఓ సాధారణ మొగుడిలా ఇంట్లో అన్ని పనులు చేస్తూనే.. అండర్ కవర్ పోలీస్‌లా రౌడీలను చితక్కొట్టేశాడు విశాల్. అన్ని రకాల అంశాల్ని జోడించిన ఈ మూవీని ఫుల్ మాస్ కమర్షియల్ యాంగిల్‌లో సుందర్. సి ఈ మూవీని తెరకెక్కిస్తున్నట్టుగా టైటిల్ ప్రోమోతో చెప్పకనే చెప్పేశారు. ఇక సుందర్. సి ఇప్పటి వరకు తీసిన 40కి పైగా చిత్రాలకు మాస్ ఆడియెన్స్‌లో ఉన్న క్రేజ్ గురించి అందరికీ తెలిసిందే. ఈ 'మొగుడు' మూవీని కూడా వాటికి ఏ మాత్రం తగ్గకుండా ఉండేట్టు ప్లాన్ చేసుకుంటున్నారు. 'మొగుడు' టీం ప్రస్తుతం ఫస్ట్ షెడ్యూ ల్‌ను పూర్తి చేసుకుంది. ఇక నెక్స్ట్ షెడ్యూల్‌ను కోల్ కత్తా , గోవా , చెన్నై ల్లో ప్లాన్ చేశారు.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044